

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తున్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 180

శుక్రవారం 15-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రంజీ రారాజు ముంబై

ఫైనల్‌లో విదర్భపై ఘన విజయం.. 42వసారి టైటిల్ సొంతం - స్పోర్ట్స్‌లో



'పారామౌంట్'తో రిలయన్స్ డీల్

వయాకామ్–18లో 13% పారామౌంట్ వాటాల కొనుగోలు - బిజినెస్‌లో



ఐదోసారీ అధ్యక్షపీఠం దిశగా

చాలా సంవత్సరాలుగా పుతిన్ ఏలుబడిలో ఉన్న రష్యాలో ఈరోజు నుంచి అధ్యక్ష ఎన్నికలు మొదలు కాబోతున్నాయి.

వివరాలు 6లో ▸



మమతకు తీవ్ర గాయం

బెంగాల్ సీఎం మమత ఇంట్లో పడిపోవడంతో నుదుటిపై తీవ్ర గాయమైందని.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని టీఎంసీ తెలిపింది.

వివరాలు 6లో ▸



18 నుంచి ఒంటిపూట బడులు

ఏపీలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలని విద్యా శాఖ ఆదేశించింది.

వివరాలు 14లో ▸



విశ్వసనీయత కలిగిన నేత జగన్

సీఎం జగన్ విశ్వసనీయత గల నాయకుడని.. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసే అవకాశం ఉందని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి అన్నారు.

వివరాలు 14లో ▸



నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మూడు పార్టీలు..

మళ్లీ అవే మాయమాటలు

బనగానపల్లె సభలో సీఎం జగన్ ధ్వజం

ప్రజలను మోసగించేందుకే మరోసారి జత కలిశాయి

మళ్లీ రంగురంగుల హామీలిచ్చేందుకు తయారయ్యాయి

2014 హామీలను అమలు చేయకుండా వంచించిన చరిత్ర వారిది

చెప్పిన ప్రతి మాటను నెరవేర్చిన విశ్వసనీయత మీ బిడ్డది

అక్కచెల్లెమ్మల నుంచి అవ్వాతాతల దాకా అందరికీ మంచి చేశాం

మీ బిడ్డ మీకు మంచి చేసి ఉంటే మీరే సైనికుడిలా నిలబడండి

'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' నిధులను బటన్ నొక్కి విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మూడేళ్లలో 4,95,269 మంది అగ్రవర్ణ పేద మహిళలకు రూ.1,877 కోట్ల మేర లబ్ధి

2 లో



2014లో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు చూపిస్తున్న సీఎం జగన్

శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం

సీమలో హైకోర్టు

- అది రాయలసీమ, కర్నూలు వాసుల కోరిక: సీఎం
- 87 ఏళ్లుగా కలగానే మిగిలిపోయింది
- సాకారం కోసమే పాలనా వికేంద్రీకరణకు శ్రీకారం
- కర్నూలు జిల్లాలో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి భూమి పూజ చేసిన సీఎం జగన్
- 150 ఎకరాల విస్తీర్ణంలో రూ.వెయ్యి కోట్లకుపైగా వ్యయంతో నిర్మాణం.. హైకోర్టు భవనాన్ని సైతం అక్కడే నెలకొల్పేలా సదుపాయాలు
- త్వరలోనే మరిన్ని ట్రిబ్యునల్స్ కర్నూలుకు తరలింపు

2 లో

భగ్గుమన్న పొత్తు బంధం..

టీడీపీ రెండో జాబితా ప్రకటన వెలువడగానే రాష్ట్ర వ్యాప్తంగా దుమారం

జనసేన, బీజేపీలకు సీట్ల కేటాయింపును నిరసిస్తూ సర్వత్రా ఆగ్రహావేశాలు

- భగ్గుమన్న విభేదాలు... రోడ్డుకెక్కిన అసమ్మతి
- పోటాపోటీగా టీడీపీ, జనసేన నాయకుల నిరసన జ్వాలలు
- పిఠాపురం నుంచి పవన్ బరిలోకి దిగుతానన్న పదినిమిషాలకే రచ్చరచ్చ
- టీడీపీకి గండి బాబ్జీ రాజీనామా..!
- భాష్యం ప్రవీణ్‌కు సీటు కేటాయించ దంతో నిరాశలో కొమ్మలపాటి
- బోడె ప్రసాద్‌కు సీటు లేదని తేల్చిచెప్పిన అధిష్టానం
- మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామన్న బోడె మద్దతుదారుల
- రంపచోడవరంలో శిరీషకు టికెట్ ఇవ్వడంపై నిరసన సెగలు.. కోసిగిలో నిరసన తెలిపిన తిక్కారెడ్డి అనుచరులు.. తిరుపతిలో ఆరణికి వ్యతిరేకంగా నగరంలో ఫ్లెక్సీలు
- కొవ్వూరులో 'ముప్పిడి' ఫ్లెక్సీలు చించేసిన 'జవహర్' వర్గీయులు

12 లో



పవన్‌కళ్యాణ్‌కు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పిఠాపురంలో తమ పార్టీ జెండాలను తగలబెడుతున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ సీట్లు మరో 34 ఖరారు

రెండో జాబితా విడుదల చేసిన చంద్రబాబు


ఎన్‌ఆర్‌ఐలు, డబ్బున్న వారికే ప్రాధాన్యం

పొత్తులే కత్తులై..

12 లో

మునుగుతున్న టీడీపీ నావ.. తమకు మొండి చేయి చూపారని సీనియర్ల ఆగ్రహం

'పొత్తు'కు పోతే 'కత్తెర' పడింది



- పొత్తులో మధ్య వర్తిత్వం చేసి నష్టపోయాం
- పెద్ద మనస్సుతో వెళ్లి మనల్ని మనమే చిన్న చేసుకున్నాం
- రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్ జనసేన కాకపోతే ఇంకెవరు?
- నాతో పని చేసేవాళ్లు కాఫీ ఇచ్చి ఎమ్మెల్యే అయిపోదామని ఆశపడ్డ వాళ్లు
- సంక్షేమం ఎక్కువైతే శ్రీలంక పరిస్థితే.. సోషల్ మీడియా వల్ల అవతలివారు చనిపోయే పరిస్థితి రాకూడదు
- జనసేన పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్

- వివరాలు 3లో

అసలే గుడ్డి.. ఆపై చంద్రబాబు పొరలు

ఉద్యోగాల కల్పనలో జగన్ సర్కారు మోసం చేసిందంటూ రామోజీ అక్కసు రాతలు

- కోట దాటి గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తే అక్కడ ఉద్యోగాల విప్లవం కనిపిస్తుంది
- ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల్లో 10–11 మంది శాశ్వత ఉద్యోగులు
- అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కొత్తగా 1.25 లక్షల ఉద్యోగాల సృష్టి, భర్తీ
- దేశంలో అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న రాష్ట్రాల్లో ఏపీది నాలుగో స్థానం.. వైద్య ఆరోగ్య శాఖలో ఏకంగా 53,466 ఉద్యోగాల భర్తీ
- కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన వైఎస్ జగన్
- 2022–23లో 1.2 లక్షల మందికి క్యాంపస్ ఉద్యోగాలు

ఫ్యాక్ట్‌చెక్



- యువత ఉపాధి కోసం 14.26 లక్షల మందికి నైపుణ్య శిక్షణ
- బాబు హయాంలో నిరుద్యోగిత రేటు 5.3 శాతం
- వైఎస్ జగన్ హయాంలో 4.1 శాతమే

3 లో

ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్!

నూతన ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌లను కేంద్రం నియమించింది. వారి నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర న్యాయ శాఖ విడుదల చేసింది. సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌లు 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు. సుఖ్‌బీర్ ఉత్తరా ఖండ్ క్యాడర్ అధికారి కాగా జ్ఞానేశ్ కేరళ క్యాడర్ అధికారి. సుఖ్‌బీర్ గతంలో ఉత్తరాఖండ్ సీఎస్‌గా, ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌గా పనిచేశారు. జ్ఞానేశ్ పార్ల మెంటరీ వ్యవహారాల శాఖలో కార్యదర్శిగా చేశారు.

6 లో







రెండు దశల్లో 'జమిలి ఎన్నికలు'

- లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి..
- ఆ తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థలకు..
- 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'తో దేశానికి మేలు
- రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు నివేదిక సమర్పించిన కమిటీ

6 లో

18 ఓటీటీలపై కేంద్రం నిషేధం



అసభ్యకర, అశ్లీల కంటెంట్‌ను ప్రదర్శిస్తున్నందుకుగాను 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వాటికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం తెలిపింది. 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వాటికి సంబంధం ఉన్న 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలు దేశంలో ఇకపై ప్రజలకు అందుబాటులో ఉండవని పేర్కొంది.

6లో

ఇదండీ వరస



ఇదే పార్టీలో ఉంటే టికెట్ ఇవ్వరని తెలిసే మధ్యలో రెండు పార్టీల్లోకి జంపయి మళ్లీ వస్తే గౌరవంగా ఆహ్వానించి టికెటిచ్చారు!

సగం బాండ్ల నిధులు బీజేపీకే

బాండ్ల రూపంలో పార్టీలకు మొత్తంగా రూ.12,999 కోట్ల విరాళం

అందులో రూ.6,060 కోట్లు బీజేపీకి... రూ.1,609 కోట్లు తృణమూల్‌కు

వెయ్యి కోట్లు దాటిన పార్టీలు బీజేపీ, తృణమూల్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్

అత్యధిక బాండ్లు విరాళమిచ్చిన టాప్-2 కంపెనీల్లో మెగా ఇంజనీరింగ్

తమిళనాడుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్ రూ.1,368 కోట్లు; మెగా రూ.1,186 కోట్లు

సుప్రీం ఆదేశాల మేరకు తమ వెబ్‌సైట్లో వెల్లడించిన కేంద్ర ఎన్నికల కమిషన్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకంతో అధికార బీజేపీకి అత్యధికంగా నిధులు సమకూరినట్లు వెల్లడయ్యింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎవరెవరు ఎంతెంత బాండ్లు కొన్నారు? ఏ పార్టీలకు ఎంతెంత వచ్చింది? అనే వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేసింది. ఈసీ ఈ జాబితాలను తమ వెబ్‌సైట్లో పెట్టి బహిరంగపరచింది. దీని ప్రకారం మొత్తంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ ఎన్నికల బాండ్ల రూపంలో రూ.12,999 కోట్లు అందాయి. దీన్లో 46.7%.. అంటే దాదాపుగా సగం అధికార బీజేపీ ఖాతాలోకే వచ్చా యి. రూ.6,060 కోట్ల విలువైన బాండ్లు బీజేపీ ఖాతాలోకి రాగా... ఆ తరవాతి స్థానాల్లో రూ.1,609 కోట్లతో టీఎంసీ, రూ.1,421 కోట్లతో కాంగ్రెస్ పార్టీ, రూ.1,214 కోట్లతో బీఆర్‌ఎస్, రూ.775 కోట్లతో బిజూ జనతాదళ్, రూ.639 కోట్లతో డీఎంకే వరుసగా నిలిచాయి. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు మేరకు గురువారం ఈసీ తమ వెబ్‌సైట్‌లో రెండు భాగాలుగా ఈ వివరాలను పొందుపరిచింది. మొదటి భాగంలో బాండ్లు కొనుగోలు చేసినవారి వివరాలు, వాటి విలువ, రెండో భాగంలో ఆయా బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల వివరాలు తేదీలతో సహా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ అనే సంస్థ అత్యధిక విలువైన బాండ్లు కొనుగోలు చేసి టాప్-1గా నిలిచింది. కోయంబత్తూరుకు చెందిన ఈ సంస్థ రూ.1,368 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేయగా... హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ రూ.966 కోట్లు, దాని అనుబంధ సంస్థ వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ రూ.220 కోట్లు కలిపి మొత్తం రూ.1,186 కోట్ల విలువైన బాండ్లను కొని రెండో స్థానంలో నిలిచింది. వందల కోట్ల మేర భారీగా బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, టోరెంట్ పవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, డీఎల్ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్, ఎస్సెల్ మైనింగ్, వేదాంత లిమిటెడ్, అపోలో టైర్స్, లక్ష్మీ నివాస్ మిట్టల్, పీవీఆర్, సూలా వైన్స్, వెల్‌స్పన్, సన్ ఫార్మా తదితర సంస్థలున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన యశోద హాస్పిటల్స్, నవయుగ ఇంజినీరింగ్, దివీస్ ల్యాబొరేటరీస్, ఎన్‌సీసీ, నాట్కో ఫార్మా, అరబిందో ఫార్మా కూడా బాండ్లు కొనుగోలు చేసిన సంస్థల్లో ఉన్నాయి.

ట్రోలింగ్స్ వల్లే మనస్తాపంతో

గీతాంజలి ఆత్మహత్య

గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి

- అసభ్య పదజాలంతో దూషిస్తుండటంతో తట్టుకోలేకపోయింది.. ఈ ట్రోల్స్‌ను ఎలా తొలగించాలో స్నేహితులతో చర్చించింది
- అది సాధ్యం కాదని వారు చెప్పారు
- రైల్వే ట్రాక్ పైకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసింది
- గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వారిలో ఇద్దరి అరెస్టు

5 లో



పెట్రోల్, డీజిల్‌పై రూ.2 తగ్గింపు



న్యూఢిల్లీ: దాదాపు రెండేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయి. త్వరలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రానుండగా పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగ సంస్థలు తెలిపాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి రానున్నాయని కేంద్ర చమురు శాఖ గురువారం సాయంత్రం తెలిపింది. ధర తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.96.72 నుంచి రూ.94.72కు, డీజిల్ ధర రూ.89.62 నుంచి 87.62కు రానుంది. వారం క్రితమే కేంద్రం వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100 మేర తగ్గించిన విషయం తెలిసిందే.





సభలో థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు పట్టుకుని సీఎం జగన్‌కు మద్దతుగా నినాదాలు చేస్తున్న ప్రజలు



సభలో నాగలితో సీఎం జగన్

మీ అందరికీ ఒక విన్నపం..

మీ అందరికీ ఒక విన్నపం! ఎన్నికల కోడ్ మరో మూడు నాలుగు రోజుల్లో రాబోతోంది. అందువల్ల బటన్ నొక్కటం పూర్తి చేస్తున్నాం. డబ్బులు వచ్చే కార్యక్రమం కాస్త అటూ ఇటుగా జరుగుతుంది. ఎవరూ ఆందోళన పడొద్దు. త్వరలోనే డబ్బులు పడతాయి. ఈ రెండు వారాల పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి చదవొద్దు. ఏబీఎన్, టీవీ-5 చూడొద్దు. చెడిపోయిన మీడియా వ్యవస్థతో మనం యుద్ధం చేస్తున్నాం. మంచి జరిగితే దాన్ని కూడా వక్రీకరించే చెడిపోయిన, కుళ్లిపోయిన ఈనాడు, ఆంధ్రజ్యోతితో యుద్ధం చేస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

మూడు పార్టీలు.. మళ్లీ అవే మాయమాటలు

బనగానపల్లె సభలో సీఎం వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: పేదరికానికి కులం ఉండదని, పేదవాడు ఎక్కడున్నా వారికి తోడుగా నిలిచే మనసు ప్రభుత్వ పెద్దలకు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలను ఆదుకునే గుణం, వారికి తోడుగా ఉండాలనే ఆరాటం పాలకులకు ఉండాలన్నారు. 'నిజానికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలు మన మేనిఫెస్టోలో లేవు. అయినప్పటికీ అగ్రవర్ణ పేదలకు సైతం అండగా ఉండాలని, వారు పేదరికంతో ఇబ్బంది పడే పరిస్థితులు రాకూడదని అడుగులు వేసిన ప్రభుత్వం మీ బిడ్డదే' అని చెప్పారు. అగ్రవర్ణ పేదలను ఆర్థికంగా ఆదుకుంటూ ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం కింద 45 – 60 ఏళ్ల మధ్య వయసున్న 4.19 లక్షల మంది మహిళల ఖాతాల్లో రూ.629 కోట్లు జమ చేసే కార్యక్రమాన్ని గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో బటన్ నొక్కి సీఎం జగన్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా మూడేళ్లలో మూడు దఫాల్లో 4,95,269 మందికి రూ.1,877 కోట్ల మేర లబ్ధిని చేకూర్చారు. బనగానపల్లెలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని సభా ప్రాంగణం నుంచే శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. సీఎం జగన్ ఏమన్నారంటే..

42.74 లక్షల మందికి మంచి చేశాం

'చేయూత' ద్వారా 33.15 లక్షల మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి చేస్తూ 58 నెలలుగా అడుగులు వేశాం. కాపు నేస్తం ద్వారా 4.64 లక్షల మందికి మేలు చేశాం. ఈబీసీ నేస్తం ద్వారా 4.95 లక్షల మందికి ప్రయోజనం చేకూరింది. ఇలా మొత్తంగా 45–60 ఏళ్ల మధ్య వయసున్న 42.74 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు మంచి చేశామని చెప్పేందుకు గర్వపడుతున్నా.

అందరి ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ

అమ్మ ఒడి, చేయూత, ఆసరా, సున్నావడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తంతో పాటు చివరకు ఇళ్ల పట్టాలను కూడా అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి వారికి ఇళ్లు సైతం కట్టిస్తున్నాం.పిల్లలు పెద్ద చదువులు చదవాలనే ఆకాంక్షతో అమలు చేస్తున్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల డబ్బులు కూడా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోనే వేస్తున్నాం. అక్కచెల్లెమ్మలు బాగుంటే వారి కుటుంబాలూ బాగుంటాయి, పిల్లల భవిష్యత్తూ బాగుంటుందని దృఢంగా విశ్వసించాం. ఎక్కడా కులమతాలు, ప్రాంతాలు, చివరకు ఏ పార్టీకి ఓటు వేశారనేది కూడా చూడలేదు. అర్హత ఉంటే చాలు వారికి తోడు ఉంటూ పారదర్శకంగా మేలు చేస్తూ అడుగులు వేస్తున్న ప్రభుత్వం ఇది. అవ్వాతాతలు, రైతన్నలతో పాటు అందరి ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ ప్రతి ఒక్కరికీ గుమ్మం వద్దకే పథకాలను, సంక్షేమాన్ని చేరవేస్తున్నాం.



ఈబీసీ నేస్తం చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> మూడు, నాలుగు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తోంది. 2014లో మాదిరిగానే చంద్రబాబు, దత్తపుత్రుడు మళ్లీ బీజేపీతో కలిశారు. నాడు మేనిఫెస్టో హామీలను విస్మరించినట్లుగానే ఇప్పుడు రంగురంగుల హామీలు గుప్పిస్తున్నారు. వారి మోసాలు, దగాను గమనించాలని కోరుతున్నా. చంద్రబాబు పేరు చెబితే వంచన, దత్తపుత్రుడి పేరు చెబితే ఐదేళ్లకోసారి కారును మార్చినట్టుగా భార్యను మార్చే ఓ మోసగాడు, వంచకుడు గుర్తుకొస్తాడు! ఒకరికి విశ్వసనీయత లేదు.. ఇంకొకరికి విలువలు లేవు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఈ రోజు పేదవాడి భవిష్యత్తుపై యుద్ధానికి వస్తున్నాయి. పొరపాటు చేయవద్దని, అందరూ బాగా ఆలోచన చేయాలని కోరుతున్నా.
> – ముఖ్యమంత్రి జగన్

మీ బ్యాంకు ఖాతాలే నిదర్శనం..

గత 58 నెలలుగా మన ప్రభుత్వం చేకూర్చిన లబ్ధికి మీ బ్యాంకు ఖాతాలే నిదర్శనం. మీరంతా ఒక్కసారి బ్యాంకులకు వెళ్లి గత పదేళ్లుగా మీ ఖాతాల స్టేట్‌మెంట్ ఇవ్వమని మేనేజర్లను కోరండి. చంద్రబాబు హయాంలో ఐదేళ్లు, మీ బిడ్డ ప్రభుత్వంలో ఐదేళ్ల డేటాను పరిశీలించండి. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయైనా మీ ఖాతాకు పంపించారా? అని అడుగుతున్నా. మీ బిడ్డ ప్రభుత్వంలో ఈ ఐదేళ్లలో ఎన్ని లక్షల రూపాయలు మీ చేతికి వచ్చాయో మీకే కనిపిస్తుంది. గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఇప్పుడు జరుగుతోంది. నాడు ఏ పథకం ఎప్పుడిస్తారో? అసలు ఇస్తారో లేదో తెలియని దుస్థితి. ఇప్పుడు మన గ్రామంలోనే ఓ సచివాలయ వ్యవస్థ వచ్చింది. అందులో మన ఊరి పిల్లలే వాలంటీర్లుగా సేవలందిస్తున్నారు. అది ఆదివారమైనా, సెలవు రోజైనా వలంటీర్ మీ ఇంటి వద్దకే వచ్చి మీ మనవడిగా, మనవరాలిగా తోడుగా ఉంటూ లంచాలు, వివక్ష లేకుండా సేవలు అందిస్తున్నాడు. ప్రతి అక్కచెల్లెమ్మ ఇవన్నీ గమనించాలని కోరుతున్నా.

మీరే చూడండంటూ గడప గడపకూ..

గతంలో ఎప్పుడూ లేని విధంగా రూ.2.70 లక్షల కోట్లను మీ బిడ్డ బటన్ నొక్కి నేరుగా మీ ఖాతాల్లోకి జమ చేశారు. ఇందులో రూ.1.89 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వెళ్లాయి. ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలను మీ బిడ్డ అమలు చేశాడు. మీ ఇంటికి వచ్చి మేనిఫెస్టో చూపించి గత ఎన్నికలప్పుడు జగనన్న ఏం చెప్పాడు? ఈ 58 నెలల్లో ఎన్ని చేశాడు? మీరే టిక్ పెట్టండి అని ధైర్యంగా గడప తొక్కే పరిస్థితి ఏ పార్టీకైనా ఉందా? అది ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉంది.

మ్యారేజ్ స్టార్, మోసగాడు, వంచకుడు..

ఎన్నికలప్పుడు రంగురంగుల హామీలు ఇవ్వడం, ఆ తర్వాత చెత్తబుట్టలో పడేసి మోసం చేయడం అనే సంప్రదాయాన్ని మార్చి విశ్వసనీయత అనే పదానికి అర్థం తేవడం కేవలం మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే జరిగింది. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు పేరు చెబితే వంచన గుర్తుకొస్తుంది. పొదుపు మహిళలకు ఆయన చేసిన దగా గుర్తుకొస్తుంది. చంద్రబాబు పేరు చెబితే ఒక్కటంటే ఒక్క మంచి పనిగానీ పథకంగానీ గుర్తురాదు. దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థను భ్రష్టు పట్టించే ఒక మోసగాడు, ఐదేళ్లకోసారి కారును మార్చినట్టు భార్యను మార్చే మ్యారేజ్ స్టార్, మోసగాడు, వంచకుడు గుర్తుకొస్తాడు. ఒకరికి విశ్వసనీయత లేదు, మరొకరికి విలువలు లేవు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఈ రోజు మీ బిడ్డ మీదకు కాదు.. పేదవాడి భవిష్యత్‌పై యుద్ధానికి వస్తున్నాయి.

ఏటా రూ.15 వేలు చొప్పున మూడు దఫాలుగా..

ఆర్థికంగా వెనుకబడిన ఓసీ అక్కచెల్లెమ్మలకు, వారి కుటుంబాలకు మంచి చేసేలా వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నాం. దీని ద్వారా 45–60 ఏళ్ల మధ్య వయసున్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, వెలమ, బ్రాహ్మణ తదితర అగ్రవర్ణ పేద అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తూ ఏటా రూ.15 వేల చొప్పున ఖాతాల్లో జమ చేసి తోడుగా ఉంటున్నాం. ఈ ఏడాది కొత్తగా ఆర్థిక సాయం పొందుతున్నవారు 65,618 మంది కాగా రెండు దఫాలు తీసుకున్న వారు 1,07,824 మంది ఉన్నారు. మూడో విడతలో 3,21,827 మంది అక్క చెల్లెమ్మలకు లబ్ధి చేకూరింది. ఎన్నికలొస్తున్నాయి కాబట్టి బటన్ నొక్కడం ఈ విడతతో ఆపేస్తున్నాం. మళ్లీ మీకు మరింత మంచి చేసేలా దేవుడు, మీరు ఆశీర్వదించాలని కోరుతున్నా.

అదనపు ఆదాయం సమకూరేలా..

చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్క చెల్లెమ్మలకు మంచి చేశాం. కాపు నేస్తం ద్వారా కాపులకు అండగా నిలిచి ఆర్థిక సహకారం అందిస్తున్నాం. అలాగే ఈబీసీ నేస్తం ద్వారా ఓసీ కులాల్లోని అక్క చెల్లెమ్మలకు కూడా అండగా నిలుస్తున్నామని సంతోషంగా చెబుతున్నా. ఈ డబ్బులతో వారు వివిధ వ్యాపారాలు నిర్వహించుకోవడం ద్వారా ప్రతి నెలా రూ.6 వేల నుంచి రూ.10 వేలు అదనంగా ఆదాయం సమకూరుతుందనే ఉద్దేశంతో అడుగులు వేగంగా ముందుకు వేశాం.

మోసగాళ్లకు బుద్ధి చెప్పండి..

మీ బిడ్డకు, చంద్రబాబు ప్రభుత్వానికి తేడాను గమనించాలని అందరినీ కోరుతున్నా. 99 శాతం హామీలను నెరవేర్చి మరోసారి మీ ఆశీస్సులు కోరుతున్న మీబిడ్డ ఒకవైపున ఉంటే మరోవైపున దగాకోర్లు, పచ్చి మోసగాళ్లు, మాయ మాంత్రికులున్నారు. ఈ యుద్ధంలో మీ బిడ్డకు మోసం చేయడం చేతకాదు. మీ బిడ్డ మిమ్మల్ని కోరేది ఒక్కటే! మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అనేది మాత్రమే ఆలోచించండి. మీ ఇంటికి మంచి జరిగి ఉంటే మీరే సైనికుల్లా, స్టార్ క్యాంపెయినర్లుగా మీ బిడ్డకు అండగా నిలవండి. మోసగాళ్లకు ఓటు అనే దివ్యాస్త్రంతో గట్టిగా బుద్ధి చెప్పండి.

2014 హామీలను బాబు నెరవేర్చారా?

ఇదే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బీజేపీతో కలిసి 2014లో కూడా ఇప్పటి మాదిరిగానే మోసపూరిత హామీలిచ్చారు. ముగ్గురూ ఒక్కటై వేదికపై కూర్చున్నారు. కూటమిగా ఏర్పడ్డారు. ఇదే పెద్దమనిషి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోపై సంతకం పెట్టి మరీ ప్రతీ ఇంటికి పంపించారు. రైతులకు రుణమాఫీపై తొలి సంతకం చేస్తామన్నారు. రూ.85,612 కోట్ల రైతుల రుణాలు మాఫీ చేస్తానని ఎగనామం పెట్టారు. పొదుపు సంఘాల మహిళలకు రూ.14,205 కోట్లు పూర్తిగా మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను మోసం చేశారు. మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని నమ్మించి విజయవాడ నడిబొడ్డున కాల్‌మనీ సెక్స్ రాకెట్ నడిపారు. ఆడపిల్ల పుడితే 'మహాలక్ష్మి' పథకం ద్వారా రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నారు. మరి ఒక్కరికైనా ఖాతాల్లో డిపాజిట్ చేశారా? ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. మరి ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షలు ఒక్కరికైనా ఇచ్చారా?

2014లో చంద్రబాబు 'నవ' మోసాలివీ..

- మద్యం బెల్ట్‌షాపులు రద్దు చేస్తూ రెండో సంతకం
- పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా మాఫీ
- పుట్టిన ప్రతి ఆడబిడ్డకు మహాలక్ష్మి పథకం ద్వారా బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్
- పండంటి బిడ్డ పథకం ద్వారా పేద గర్భిణీలకు రూ.10 వేలు ఆర్థిక సాయం
- పేద మహిళలకు ఉచితంగా స్మార్ట్‌ఫోన్లు
- ప్రతి కుటుంబానికి ఏడాదికి 12 వంట గ్యాస్ సిలిండర్లపై రూ.1,200 సబ్సిడీ. ఐదేళ్లలో మొత్తం రూ.6 వేలు సబ్సిడీ
- బడికి వెళ్లే విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ
- కుటీరలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్థిక స్వావలంబన
- మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు.

కరపత్రాలు చూపించి రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో హైటెక్‌సిటీ నిర్మిస్తానన్నారు. 2014 మేనిఫెస్టో పేజీ నెంబర్ 16, 17లో అక్క చెల్లెమ్మలకు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాల్లో మచ్చుకు 9 మాత్రమే మీతో పంచుకుంటున్నా. వాటిల్లో ఏ ఒక్కటైనా అమలు చేశారా? ఇంత దారుణంగా మోసం చేస్తున్న వ్యక్తులు మరోసారి రంగు రంగుల హామీలతో వంచనకు సిద్ధమయ్యారు.

కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో మహిళలు

శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం సీమలో హైకోర్టు!

అది రాయలసీమ, కర్నూలు వాసుల కోరిక: సీఎం జగన్

కర్నూలు (సెంట్రల్): శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమకు న్యాయం చేసేందుకు అడుగులు ముందుకు వేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 87 ఏళ్లుగా జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది సహేతుక న్యాయం చేసేందుకు డీ సెంట్రలైజేషన్ (పరిపాలనా వికేంద్రీకరణ) విధానానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అందులో భాగంగానే రాయలసీమ ముఖద్వారమైన కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించామని, రాష్ట్ర న్యాయ సంస్థలన్నింటినీ కర్నూలులోనే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గురువారం కర్నూలు జిల్లాలో పర్యటన సందర్భంగా కల్లూరు మండలం లక్ష్మీపురం సమీపంలో జగన్నాథగట్టు వద్ద 150 ఎకరాల్లో రూ.1,011 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి సీఎం జగన్ భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు జరిగాయి. లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మంధాత సీతారామమూర్తితో కలసి న్యాయ విశ్వ విద్యాలయం పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. న్యాయ విశ్వ విద్యాలయం నమూనా ఫొటో ఎగ్జిబిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం జగన్ మాట్లాడుతూ 87 ఏళ్ల క్రితం సహేతుక న్యాయం కోసం ఈ ప్రాంత ప్రజలు శ్రీబాగ్ ఒడంబడిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని, అప్పటి నుంచి అమలు కోసం నిరీక్షిస్తున్నారని గుర్తు చేశారు. 1937లో కుదిరిన శ్రీబాగ్ ఒప్పందం మేరకు ఆ రోజుల్లోనే హైకోర్టును ఇక్కడే నెలకొల్పుతారని భావించారని చెప్పారు. కర్నూలులో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో హైకోర్టు భవనాన్ని కూడా ఇక్కడే నెలకొల్పే సామర్థ్యాన్ని లా యూనివర్సిటీ సంతరించుకుంటుందనే ఆశాభావాన్ని సీఎం వ్యక్తం చేశారు. త్వరలోనే వర్సిటీ నిర్మాణ పనులను చేపట్టి వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

> శ్రీబాగ్ ఒడంబడికలో భాగంగా పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ఇక్కడే (కర్నూలు) హైకోర్టు పెడతామని చెప్పారు. ఈమేరకు ఆ రోజుల్లోనే ఇక్కడకు రావాల్సింది. హైదరాబాద్‌ను రాజధానిగా చేసినందున అప్పటిదాకా రాజధానిగా ఉన్న కర్నూలు ఆ హోదాను కోల్పోతుండటంతో ఇక్కడ హైకోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రోజు చెప్పిన మాట మేరకు ఈరోజు మన అడుగులు ముందుకు పడుతున్నాయి. – సీఎం జగన్

కర్నూలుకు మరిన్ని న్యాయ సంస్థలు

కర్నూలులో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంతోపాటు మరిన్ని ప్రతిష్టాత్మక న్యాయ విభాగాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, ఏపీ లీగల్ మెట్రాలజీ కమిషన్, ఏపీ లేబర్ కమిషన్, ఏపీ వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్, ఏపీ వక్ఫ్ బోర్డు ట్రిబ్యునళ్లను కర్నూలులోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే కర్నూలులో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలు పని చేస్తున్నాయని గుర్తు చేస్తూ రానున్న రోజుల్లో ఆయా కమిషన్లు, ట్రిబ్యునళ్లు, ఇతర న్యాయ సంస్థలన్నింటికీ జగన్నాథగట్టుపైనే భవన సముదాయాలను సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాయలసీమ ప్రజల ఆకాంక్షకు ప్రతీకగా జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం నిలుస్తుందని, సీమ అభివృద్ధికి ఇది మచ్చుతునక లాంటిదని కలెక్టర్ సృజన పేర్కొన్నారు.

తుంగభద్రలో కాలుష్య విముక్తికి రూ.131.84 కోట్లు

కర్నూలు నగర పాలకసంస్థలో అమృత్ 2.0 పథకం కింద రూ.131.84 కోట్లతో నిర్మించనున్న మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలకు సీఎం జగన్ శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. రాంబొట్ల దేవాలయం, మామిదాలపాడు, మునగాలపాడు సమీపంలో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా తుంగభద్ర నదికి మురుగునీరు, కాలుష్యం నుంచి విముక్తి లభించనుంది. కార్యక్రమంలో మంత్రి బుగ్గన, రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి జి.సత్యప్రభాకర్, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జిల్లా చైర్మన్ కరణం కిశోర్‌కుమార్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నేషనల్ లా యూనివర్సిటీకి భూమి పూజ చేస్తున్న సీఎం జగన్

కర్నూలు సమగ్ర నీటి సరఫరాకు రూ.115 కోట్లు

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో నీటి కొరతను అధిగమించేలా రాష్ట్ర ప్రభుత్వం గొప్ప ముందడుగు వేసింది. రూ.115 కోట్లతో అమృత్ 2.0 పథకం ద్వారా సమగ్ర నీటి సరఫరాకు సంబంధించిన పైలాన్‌ను ముఖ్యమంత్రి జగన్ ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా జగన్నాథగట్టు వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్, సర్వీసు రిజర్వాయర్, గ్రావిటీ మెయిన్స్ విభాగాల ద్వారా హంద్రీనీవా సుజల స్రవంతి నీటిని శుద్ధి చేసేందుకు ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. శుద్ధి అయిన నీటిని అక్కడి నుంచి కర్నూలు నగరానికి సరఫరా చేస్తారు. రోజుకు 50 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) నీటిని శుద్ధి చేసేలా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



లా యూనివర్సిటీకి సంబంధించిన శిలాఫలకం వద్ద సీఎం జగన్

అగ్రకుల పేదలను గుర్తించిన ఏకైక సీఎం జగన్

అగ్రకులాల్లోనూ పేదలు ఉంటారని గుర్తించి మేలు చేస్తున్న ఏకైక సీఎం జగనే. గత ఎన్నికలకు ముందు నా భర్త మరణించగా వితంతు పింఛన్ అందలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాకు పింఛన్ మంజూరైంది. ఈబీసీ నేస్తం ద్వారా నాకు రూ.45 వేల మేర లబ్ధి చేకూరింది. టీడీపీ హయాంలో మా అమ్మకు వృద్ధాప్య పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరిగాం. ఇప్పుడు ఇంటివద్దే వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నారు.

– పద్మావతి, ఈబీసీ నేస్తం లబ్ధిదారురాలు, బనగానపల్లె

అసలే గుడ్డి.. ఆపై బాబు పొరలు

ఉద్యోగాల కల్పనలో జగన్ సర్కారు మోసం చేసిందంటూ రామోజీ అక్కసు రాతలు


ఉద్యోగాల విప్లవం.. జగన్ మార్కు మోసం!

కళ్లకు చంద్రబాబు పొరలు కమ్మేసిన గుడ్డి రామోజీ మరోసారి బట్టలిప్పేశారు. ఉద్యోగాలివ్వకుండా యువతను జగన్ సర్కారు మోసం చేసిందంటూ చేతికొచ్చింది రాసి చిందులు తొక్కారు. తాను కట్టుకున్న కోట దాటి గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి చూస్తే అక్కడ సీఎం జగన్ సృష్టించిన ఉద్యోగాల విప్లవం ఈ బధిరుడికి కనిపించేది. చంద్రబాబు స్కిల్ స్కామ్‌ను బయటకు తీశారన్న అక్కసుతో జగన్ ఏలుబడిలో ఉద్యోగాల కల్పన లేదంటూ పచ్చి అవాస్తవాలను అచ్చు వేశారు. పదే పదే అవాస్తవాలను ప్రచారం చేస్తున్న రామోజీ ఒకసారి గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి ఉద్యోగాలు కల్పించలేదంటూ రాగం తీస్తే అప్పుడు ఎవరు ఎవరి కాలర్ పట్టుకుని నిలదీస్తారో తెలుస్తుంది. ఈ రాతలపై మండిపడుతున్న యువత ఎవరి కాలర్ పట్టుకోవాలో ఇప్పటికే నిర్ణయించేసుకుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లోనే 1.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత జగన్ సర్కారుది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో 10-11 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు కనిపిస్తారు. దేశ చరిత్రలో ఒకేసారి కొత్తగా 1.25 లక్షల ఉద్యోగాలను సృష్టించడం, వెంటనే భర్తీ చేయడం జరగనేలేదు. చంద్రబాబు హయాంలో నిరుద్యోగిత రేటు 5.3 శాతం ఉంటే ఇప్పుడు వైఎస్.జగన్ హయాంలో కేవలం 4.1 శాతమే. ఈ గణాంకాలు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ వెలువరించినవి. 2014-19 మధ్య చంద్రబాబు భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య కేవలం 34,108. చంద్రబాబు దిగిపోయే మే 2019 నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,97,123 మాత్రమే. ఇప్పుడు వైఎస్.జగన్ హయాంలో శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగులు మొత్తం కలిపి 6,38,087 మంది ఉన్నారు. వైద్య ఆరోగ్య రంగాన్ని చంద్రబాబు గాలికి వదిలేస్తే, వైఎస్.జగన్ సర్కారు 53,466 ఉద్యోగాలను భర్తీ చేసింది.

సాక్షి, అమరావతి

నైపుణ్య శిక్షణ మీ బాబు భక్షణే

అసలు ఈనాడు రామోజీ ఏడుపు అంతా చంద్రబాబు స్కిల్ స్కామ్‌పై విచారణ చేపట్టడమేనని అక్కసుతో రాసిన ఈ కథనం చెప్పకనే చెబుతోంది. స్కిల్ పేరుతో చంద్రబాబు దోపిడీ అంతా ఇంతా కాదు. స్కిల్ పేరుతో కోట్లాది రూపాయల నిధులు తన ఇంటికి మళ్లించేశారు. కానీ వైఎస్.జగన్ ప్రభుత్వం 175 శాసనసభ నియోజకవర్గాల్లో కనీసం ఒకటి ఉండే విధంగా మొత్తం 192 స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ లెవెల్-4 లోపు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి తక్కువ కాకుండా మొత్తం 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. హై ఎండ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి తిరుపతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తోంది. అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు రాష్ట్ర విద్యార్థులు అందుకునే విధంగా స్కిల్ ఇంటర్నేషనల్ పేరుతో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఇందుకోసం పలు పరిశ్రమలు, విదేశీ సంస్థలతో ఒప్పందం చేసుకొంది. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కోర్సులను అందిస్తోంది. 2019-20 నుంచి 2023-24 వరకు 14,26,515 మంది యువతకు శిక్షణ ఇచ్చింది.

అత్యధిక ఉద్యోగాల కల్పనలో దేశంలోనే ఏపీ నాలుగో స్థానం

కేంద్రం విడుదల చేసిన ఇండియా 2023 స్కిల్ రిపోర్ట్ అత్యధిక ఉద్యోగావకాశాల కల్పనలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని స్పష్టం చేసింది. సామాజిక, పారిశ్రామిక, సాంకేతిక మౌలిక సదుపాయాలు కల్పన భేష్ అని నివేదిక ప్రశంసించింది. ప్లేస్‌మెంట్లలో రూ.2.6 లక్షలు అంతకంటే ఎక్కువ వేతనాలు అందే రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని స్కిల్ రిపోర్ట్ పేర్కొంది. యువతకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు నైపుణ్య శిక్షణ ఇప్పించి పెద్ద పెద్ద ఉద్యోగాలు పొందేలాగా ప్రోత్సహిస్తున్నది సీఎం వైఎస్.జగన్ మాత్రమే.

ప్లేస్‌మెంట్లలో రూ.2.6 లక్షలు అంతకంటే ఎక్కువ వేతనాలు అందే రాష్ట్రాలు	
1వ స్థానం	ఆంధ్రప్రదేశ్
2వ స్థానం	కర్ణాటక
3వ స్థానం	మహారాష్ట్ర
4వ స్థానం	తమిళనాడు
5వ స్థానం	ఉత్తరప్రదేశ్

అత్యధిక ఉద్యోగాల కల్పన ఉన్న రాష్ట్రాలు	
1వ స్థానం	ఉత్తరప్రదేశ్
2వస్థానం	మహారాష్ట్ర
3వస్థానం	ఢిల్లీ
4వ స్థానం	ఆంధ్రప్రదేశ్
5వ స్థానం	రాజస్థాన్

ఇంటర్న్‌షిప్ అందుకుంటున్న వారి శాతం	
ఆంధ్రప్రదేశ్	93.50
రాజస్థాన్	93.22
జార్ఖండ్	92.98
కర్ణాటక	91.62
వెస్ట్ బెంగాల్	91.38

ప్లేస్‌మెంట్లు ఇలా

సంవత్సరం	సంఖ్య
2018-19	37000
2019-20	52000
2020-21	69000
2021-22	85000
2022-23	1.2 లక్షలు

సౌభాగ్యమ్మ బంధువులకే వైఎస్ కుటుంబంపై అనుమానాల్లేవు

వివేకా హత్యపై టీడీపీ నేత పార్థసారథిరెడ్డి



కడప రూరల్: 'మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మృతిపై.. ఆయన సతీమణి సౌభాగ్యమ్మ సొంత తమ్ముళ్లు, బంధువులకే సీఎం వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపై ఎలాంటి అనుమానాల్లేవు, వారు ఎలాంటి ఆరోపణలూ చేయలేదు. చంద్రబాబు సౌభాగ్యమ్మకు కడప ఎంపీ సీటును కేటాయిస్తారని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అదే గనుక జరిగితే అంతకంటే అవమానం మరొకటి ఉండదు' అంటూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి తాము వైఎస్ కుటుంబానికి రాజకీయంగా ప్రత్యర్థులుగానే ఉన్నామని తెలిపారు. టీడీపీలో ఉంటూ వైఎస్ కుటుంబంతో రాజకీయంగా పోరాటం చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి మృతి సంఘటనపై ఆయన సతీమణి సౌభాగ్యమ్మతో పాటు ఆమె తమ్ముళ్లు బంధువులకు వైఎస్ కుటుంబంపై ఎలాంటి అనుమానాల్లేవని, వారు ఏ ఆరోపణలూ చేయలేదని చెప్పారు. ప్రస్తుతం మారిన రాజకీయాల నేపథ్యంలో సౌభాగ్యమ్మను టీడీపీ తరపున కడప ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోందన్నారు. ఈ ప్రచారం పార్టీ వర్గాల్లో అయోమయానికి గురి చేస్తోందని చెప్పారు. చంద్రబాబు రాజకీయ వ్యూహాల్లో భాగంగా ఆ దిశగా అడుగులు వేస్తే పెద్ద తప్పిదమే అవుతుందని హెచ్చరించారు. పైగా ఎన్నో ఏళ్లుగా టీడీపీని నమ్ముకుని ఉన్న వారిని నిలువునా మోసిగించినట్లవుతుందన్నారు. తనలాంటి వారిని కడప ఎంపీగా బరిలో నిలిపితే కార్యకర్తల్లో చంద్రబాబుపై నమ్మకం కలుగుతుందని చెప్పారు.

ఎన్నారైల కోసం 'మేము సైతం'

ఏపీలో సంక్షేమాభివృద్ధిపై అవగాహన కల్పించే కార్యక్రమం

సాక్షి, అమరావతి: గడిచిన ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించే విధంగా 'మేము సైతం' పేరుతో ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోటీని ఔత్సాహిక ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేశారు. ప్రవాసాంధ్రులు శరత్ ఎత్తప్ప, తిరుమల్ రెడ్డి ఏర్పాటు చేసిన ఈ ఆన్‌లైన్ పోటీని ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ వెంకట్ మేడపాటి ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో లబ్ధిదారులు పొందిన లబ్ధి గురించి అభిప్రాయాన్ని వీడియో రూపంలో చేసి అందరికీ తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. https://memusaitham.in/ లింక్ ద్వారా రిజిస్టర్ అయి, వీడియోలను షేర్ చేయాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు 'మేము సైతం' కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లి జిల్లా, రాష్ట్ర స్థాయి క్యాష్ బహుమతులు గెలవచ్చన్నారు. వీడియోలను అనుభవజ్ఞులైన బృందం పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుందని, మొత్తం రూ.25 లక్షల నగదు బహుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రతి కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ. 25,000, రెండో బహుమతి కింద రూ.15,000, మూడో బహుమతి కింద రూ.10,000 ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.5,000, రెండో బహుమతి కింద రూ.3,000, మూడో బహుమతి కింద రూ.2,000 ఇవ్వనున్నట్లు చెప్పారు.

శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ మల్లికార్జునరావు

ప్రమాణం చేయించిన సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్


జస్టిస్ మల్లికార్జునరావు, జస్టిస్ చక్రవర్తిలతో న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

సాక్షి, అమరావతి: హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ బొప్పన వెంకట వరాహలక్ష్మీ నరసింహ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రమాణం చేశారు. వీరి చేత ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు మొదటి కోర్టు హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రమాణం చేసిన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, రిజిస్ట్రార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ మల్లికార్జునరావు 2022 ఆగస్టు 4న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన విషయం తెలిసిందే. వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం గత నెలలో కేంద్రానికి సిఫారసు చేసింది. దీంతో వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఈనెల 10న ఉత్తర్వులు జారీ చేశారు.

ఫైబర్‌నెట్ కేసులో రూ. 17.75 కోట్ల ఆస్తుల అటాచ్

- సీఐడీకి అనుమతినిచ్చిన హోమ్ శాఖ
- ఏసీబీ కోర్టు అనుమతి కోసం పిటిషన్ దాఖలు చేయనున్న సీఐడీ

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు దర్యాప్తులో సీఐడీ జోరు పెంచింది. ఈ కేసులో నిందితులైన టెరాసాఫ్ట్ కంపెనీ చైర్మన్ వేమూరి హరికృష్ణ, ఆ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్‌లకు చెందిన రూ.17.75 కోట్ల విలువైన స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. సీఐడీ ప్రతిపాదనకు రాష్ట్ర హోమ్ శాఖ అనుమతినిచ్చింది. ఈమేరకు హోమ్ శాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌ను నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు బినామీ కంపెనీ టెరాసాఫ్ట్‌కు కేటాయించారు. అప్పటి వరకు బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీకి ఈ ప్రాజెక్ట్‌ను అప్పగించడమే కాకుండా పనులు నాసిరకంగా చేశారు. షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా మళ్లించారు. దీనిపై ఇప్పటికే ఏ1గా చంద్రబాబు, ఏ2గా వేమూరి హరికృష్ణ, ఏ4గా టెరాసాఫ్ట్ కంపెనీ, ఏ5గా తుమ్మల గోపీచంద్‌తో పాటు పలువురిపై సీఐడీ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో నిందితులు వేమూరి హరికృష్ణ, టెరాసాఫ్ట్ కంపెనీ, తుమ్మల గోపీచంద్, తుమ్మల పావనీదేవీ, తుమ్మల బాపయ్య చౌదరీలకు చెందిన ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పొంగూరు నారాయణకు 41(ఏ) నోటీసులివ్వండి

- ఆయన అల్లుడు పునీత్‌పై కఠిన చర్యలేవీ తీసుకోకండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: వేధింపులకు గురిచేస్తున్నామంటూ తన మరదలు పొంగూరు కృష్ణ ప్రియ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నెల్లూరు, బాలాజీనగర్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ నేత పొంగూరు నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారణ జరిపారు. ఈ సందర్భంగా పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ, నారాయణకు సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) కింద నోటీసులు జారీ చేస్తామన్నారు. నోటీసులు అందుకునేందుకు నారాయణ అందుబాటులో ఉండడం లేదన్నారు. న్యాయమూర్తి ఈ వివరాలను నమోదు చేశారు. ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణ అవసరం లేదంటూ దానిని మూసివేశారు. ఇదిలా ఉంటే, ఇదే కేసులో నారాయణ అల్లుడు కొతప పునీత్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాస రెడ్డి విచారణ జరిపారు. పునీత్ తరపు న్యాయవాది సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదులో పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. కేవలం పేరు మాత్రమే ప్రస్తావించారన్నారు. అందువల్ల కేసు కొట్టేయాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి నిరాకరించారు. కేసు కొట్టేయడం సాధ్యం కాదన్నారు. పునీత్‌పై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

'పొత్తు'కు పోతే 'కత్తెర' పడింది

- జనసేన పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: టీడీపీ - బీజేపీ పొత్తుకు మధ్యవర్తిత్వం చేస్తే మనమే సీట్లను తగ్గించుకోవాల్సి వచ్చిందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. జనసేన ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో తన సినిమాల ప్రస్తావనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. జనసేన సీట్లు తగ్గించుకోవాల్సి రావడంపై మాట్లాడుతూ.. పొత్తుల్లో రెండు పార్టీల మధ్య మధ్యవర్తిత్వం చేస్తే ఏం నష్టపోతామో తనకు బాగా అర్థమైందన్నారు. పెద్ద మనసుతో వెళ్తే మనల్ని మనం చిన్న చేసుకున్నామని చెప్పారు. తన అన్న నాగబాబుకు మాట ఇచ్చిన లోక్‌సభ సీటును సైతం త్యాగం చేయాల్సి వచ్చిందని అన్నారు. సినిమాల్లో తనకు ఎదురు దెబ్బలు లేవని, రాజకీయాల్లో మాత్రం తన ఎదుగుదలే తనకు శాపం అయిందని, పదేళ్లుగా దెబ్బలు తగులుతూనే ఉన్నాయని చెప్పారు. 2019లో 30 స్థానాలకు పోటీ చేయాలని అనుకున్నామని, అందరి బలవంతంపై అన్ని స్థానాల్లో పోటీ చేశామని చెప్పారు. అప్పుడు కొన్ని స్థానాల్లోనే పోటీ చేసి ఉంటే ఇప్పటికి జనసేన గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీగా ఉండేదన్నారు. అధికారం జనసేనకు కనుచూపు మేరలో ఉందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్ మనమేనన్నారు. పొత్తులో జనసేన అభ్యర్థులను గెలిపించడానికి టీడీపీ, బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అప్పులు తెచ్చి సంక్షేమం చేసుకుంటూ పోతే మన రాష్ట్రం కూడా శ్రీలంకలా మారే పరిస్థితి ఉంటుందని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా కారణంగా అవతలివారు చనిపోయే పరిస్థితి రాకూడదని, పార్టీ శ్రేణులు ప్రత్యర్థులను ఎందుకు తిడుతున్నామో సందేశాల్లో స్పష్టంగా చెప్పాలని సూచించారు. ఈ ఎన్నికల్లో భీమవరం నుంచి పులవర్తి రామాంజనేయులు, తిరుపతి నుంచి జంగాలపల్లి శ్రీనివాసులు పోటీ చేస్తారని పవన్ చెప్పారు.

పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నా

లోక్‌సభకు కూడా పోటీపై పెద్దలతో చర్చించాక నిర్ణయం

తాను ఈసారి పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు పవన్ ప్రకటించారు. అసెంబ్లీ స్థానంతో పాటు లోక్‌సభకు కూడా పోటీ చేసే విషయంపై పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు. 'చాలా మంది ఎమ్మెల్యే, ఎంపీ రెండింటికీ పోటీ చేయాలని సూచిస్తున్నారు. కానీ రెండింటికీ పోటీ చేస్తే క్రాస్ ఓటింగ్‌లు వంటివి ఉంటాయని గందరగోళంలో ఉన్నా. నాకు మాత్రం ఎమ్మెల్యేగా ఉండాలనే ఉంది' అని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత ఈలి నాని

సాక్షి,అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం టీడీపీ సీనియర్ నేత ఈలి నాని (ఈలి వెంకట మధుసూదన రావు) వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం నివాసంలో గురువారం సీఎం జగన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. గతంలో ఈలి నాని ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిథున్ రెడ్డి పాల్గొన్నారు.


ఈలి నానికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్

పోటీపై గంటా సమాలోచనలు

మధురవాడ/కొమ్మాది: టీడీపీ గురువారం విడుదల చేసిన రెండో జాబితాలో కూడా పేరు లేకపోవడంతో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు గురువారం ఎండాడలోని ఫెబుల్ బీచ్ విల్లాస్‌లో రోజంతా సమాలోచనల్లో బిజీబిజీగా గడిపారు. ఇక్కడ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మిత్రులు, శ్రేయోభిలాషులతో సమావేశం అంటూ హైడ్రామా నడిపారు. ఇక్కడ 20 నుంచి 30 మంది వరకు తనకు అత్యంత సన్నిహితులతో సమాలోచనలు చేశారు. చివరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాబోయే ఎన్నికల్లో పోటీ గురించి మిత్రులు, శ్రేయోభిలాషులతో సమావేశమై చర్చించడం జరిగిందని, అందరి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు టీడీపీ అధిష్టానానికి తెలియజేస్తామంటూ అందులో పేర్కొన్నారు.

టీడీపీ ఓడిపోయిన సీట్లు బీజేపీకా!

- ఈ సీట్లపై పునరాలోచన జరగాలి
- బీజేపీ జాతీయ నాయకత్వానికి రాష్ట్ర నాయకుల లేఖ
- రాష్ట్ర పార్టీ ద్వారానే అధికారికంగా పంపిన నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గత నాలుగైదు విడతలుగా గెలవని సీట్లను చంద్రబాబు ఏరికోరి పొత్తులో బీజేపీకి కేటాయించారని బీజేపీ రాష్ట్ర నాయకులు కొందరు జాతీయ నాయకత్వానికి ఓ లేఖలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రస్తుత రాష్ట్ర కార్యవర్గంలో కీలక స్థానాల్లో ఉన్న ఆ నాయకులు ఈ లేఖను రాష్ట్ర నాయకత్వం ద్వారానే అధికారికంగా జాతీయ నాయకత్వానికి చేరవేసినట్టు సమాచారం. ఇందుకోసం వారు రాష్ట్ర పార్టీ నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి మరీ లేఖను వారి ద్వారానే పంపినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పొత్తుల ఖరారు అనంతరం రాష్ట్ర పార్టీలో పరిణామాలపై చర్చించేందుకు మొదటినుంచీ బీజేపీలో ఉన్న 20 మందికి పైగా నేతలు బుధవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే సమావేశమైన విషయం తెలిసిందే. ఈసారి పొత్తుల్లో సీట్ల ఎంపిక విధానం, వాటిలో బీజేపీ, టీడీపీ బలాబలాలు, గెలుపు అవకాశాలపై వారు చర్చించారు. చంద్రబాబు బీజేపీకి కేటాయించిన సీట్లన్నీ టీడీపీ పోటీ చేసినా గెలవలేనివని నిర్ధారణకొచ్చారు. ఆ సమావేశంలో పాల్గొనని మరికొందరు నాయకులు కూడా వారికి మద్దతు తెలపడంతో బుధవారం రాత్రే వారు ఓ లేఖ రూపొందించారు. తమ అభ్యంతరాలను రాష్ట్ర పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, తమ లేఖను అధికారికంగా కేంద్ర పార్టీకి పంపాలని గట్టిగా పట్టుబట్టారు. దీంతో గురువారం రాష్ట్ర నాయకత్వం ఆ నాయకుల అభ్యంతరాలను జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ప్రస్తుత పొత్తుల్లో బీజేపీకి కేటాయించిన స్థానాలన్నింటిలో గత నాలుగైదు విడతలుగా టీడీపీ ఒక్కసారి కూడా గెలవని సీట్లేనని ఆ లేఖలో వారు వెల్లడించినట్లు తెలిసింది. మూడు పార్టీల కూటమిలో ఈసారి టీడీపీ పోటీ చేసినా కచ్చితంగా ఓడిపోతామని భావించిన సీట్లనే చంద్రబాబు బీజేపీకి కేటాయించారని తెలిపినట్లు సమాచారం. ఆయా నియోజకవర్గాల వారీగా మూడు పార్టీల బలాబలాలు, ఇతర వివరాలను కూడా ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. బీజేపీకి కేటాయించిన పది సీట్లలోనూ రెండు (బద్వేలు, జమ్మలమడుగు) సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొంత జిల్లాలోనివేనని, వాటిలో ఏ ఇతర పార్టీ గెలవదని స్పష్టం చేసినట్లు తెలిసింది. బీజేపీ సంస్థాగతంగా కూడా బలంగా లేని బద్వేలును కేటాయించారని ఉదహరించినట్టు తెలిసింది. వీటన్నింటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, సీట్ల ఎంపికపై పునరాలోచన చేయాలని జాతీయ పార్టీని కోరినట్లు సమాచారం.

స్థానికులకే ఉద్యోగాల చట్టం రాజ్యాంగ విరుద్ధం

- ఆ చట్టాన్ని కొట్టేయండి
- హైకోర్టులో ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, వసంత ఇండస్ట్రీస్ పిటిషన్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ

సాక్షి, అమరావతి: పరిశ్రమలు, కర్మాగారాల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు తప్పనిసరిగా ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ చట్టాన్ని చట్ట, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి కొట్టేయాలని కోరుతూ ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, వసంత ఇండస్ట్రీస్ వ్యాజ్యాన్ని దాఖలు చేశాయి. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

ఆ అధికారం శాసనసభకు లేదు

పరిశ్రమలు, కర్మాగారాల్లో స్థానికులకు 75 శాతం మేర ఉద్యోగాలు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ ఇన్ ఇండస్ట్రీస్, ఫ్యాక్టరీస్ పేరుతో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. పరిశ్రమల ఏర్పాటు వల్ల భూములు కోల్పోయిన వారిని, ఇతర విధాలుగా ప్రభావితం అవుతున్న వారిని ఆదుకునేందుకు నిశ్చయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పరిశ్రమలు, కర్మాగారాల్లో స్థానికులకు 75 శాతం మేర ఉద్యోగులు ఇచ్చి తీరాలని స్పష్టం చేసింది. దీనిపై పిటిషన్ దాఖలుక కాగా.. ఈ వ్యాజ్యం తేలేంత వరకు చట్టం అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఓ అనుబంధ పిటిషన్ కూడా దాఖలైంది. పిటిషనర్ల తరపు న్యాయవాది తేలప్రోలు శ్రీచరణ్ వాదనలు వినిపిస్తూ.. పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ విషయంలో చట్టాన్ని తెచ్చే అధికారం అసెంబ్లీకి లేదన్నారు. అది కేవలం పార్లమెంట్ పరిధిలోని వ్యవహారమని తెలిపారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రైవేటు యాజమాన్యాలను ఒత్తిడి చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. దీనివల్ల పరిశ్రమలు, కర్మాగారాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల వారికి స్థానికత ఆధారంగా ఉద్యోగాలను తిరస్కరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అలాగే వ్యాపారుల హక్కులను కూడా హరించడమేనని తెలిపారు. స్థానికత ఆధారంగా ఉద్యోగం ఇవ్వాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. నిర్దిష్ట పనికి తగిన ఉద్యోగిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, అధికారం యాజమాన్యాలకు ఉందని వివరించారు. ఈ చట్టం వల్ల నైపుణ్యం లేకపోయినా స్థానికులకు తప్పనిసరిగా ఉద్యోగం ఇవ్వాల్సిన పరిస్థితి వస్తోందని, దీనివల్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో విధ్వంసం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు గడికోట, కొరుముట్ల

సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలంటే టీడీపీ పోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. స్వలాభం కోసం పొత్తులు పెట్టుకొని అదేదో రాష్ట్ర హితం కోసం అన్నట్లుగా చంద్రబాబు మాట్లాడుతున్నారని, ఆయన మాటల్ని ప్రజలు నమ్మరని అన్నారు. శాసన సభలో ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులుతో కలిసి ఆయన గురువారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన మాటని నెరవేర్చే తత్త్వం సీఎం వైఎస్ జగన్‌దని శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. ఎత్తులు పైఎత్తులు నమ్ముకొని ఎన్నికలకు వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కొరుముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. చెప్పారు. చంద్రబాబుకు అబద్ధాలు తప్ప నిజాలు పలికే అలవాటే లేదన్నారు. అందుకే, 'నిజం చెబితే ఐటీడీపీ వికృత చేష్టలకు ఒక వివాహిత బలైంది. టీడీపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఎవడైతే, తన ముఖాన్ని అల్లాహ్‌కు సమర్పించుకొని సజ్జనుడై ఉంటాడో,
అలాంటివాడు నిస్సందేహంగా దృఢమైన ఆధారాన్ని పట్టుకున్నవాడే!
సకల వ్యవహారాల ముగింపు (తీర్పు) అల్లా వద్దనే ఉంది.

– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 15 మార్చి 2024

ఈసీలో కొత్త నీరు!

ఎన్నికల నోటిఫికేషన్ల విడుదల సమయాల్లో మాత్రమే వినబడే ఎన్నికల సంఘం చాన్నాళ్లుగా తరచు వార్తల్లోకెక్కుతోంది. అక్కడ కమిషనర్ల ప్రవేశమూ, నిష్క్రమణా కూడా సంచలనాలుగా, వివాదాస్పదంగా మారుతున్నాయి. ఈ నెల 9న ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ రాజీనామా చేశాక ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో కేవలం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. తాజాగా ఇద్దరు మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూలను ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ గురువారం ప్రకటించింది. తనకు 212 పేర్లతో బుధవారం రాత్రే జాబితా పంపారని, తెల్లారేలోగా అంతమందిని జల్లెడపట్టి వారిలో ఇద్దరిని ఎంపిక చేయటం సాధ్యమేనా అని కమిటీలోని విపక్ష నేత అధీర్ రంజన్ చౌధురి ప్రశ్నించారు. ఆ సంగతలావుంచి రేపో మాపో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడబోతున్న దశలో ఈ ఎంపిక వుండదని, ఏకసభ్య సంఘం చేతులమీదుగా అంతా ముగుస్తుందని చాలామంది అనుకున్నారు. కానీ రాజు తల్చుకుంటే కానిదంటూ ఏముంటుంది? నిజానికి ఎన్నికల సంఘం 90వ దశకం వరకూ ఏకసభ్య సంఘంగానే వుండేది. 1987లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో జైల్‌సింగ్‌కు రెండోసారి అవకాశం లేకుండా ఎన్నికల ప్రక్రియను సవరించాలన్న నాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రయత్నానికి అప్పటి ఎన్నికల కమిషనర్ ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి అడ్డుపుల్ల వేయటంతో ఆగ్రహించి ఆ సంఘాన్ని త్రిసభ్య సంఘం చేయాలని కేంద్రం భావించింది. అయితే అనంతర కాలంలో వీపీ సింగ్ ప్రభుత్వం దాన్ని బుట్టదాఖలా చేసింది. 1990లో నాటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ దూకుడును తట్టుకోలేకపోయిన నాటి పీవీ నరసింహారావు సర్కారు దాన్ని త్రిసభ్యసంఘంగా మార్చింది.

నిర్వాచన్ సదన్‌లో ఏదో జరుగుతోందని తెలిసినా ఎందుకో అర్థంకాని పరిస్థితి గతంలో లేదు. ఏదైనా సమస్యవుంటే ప్రభుత్వం వివరణనివ్వటం రొటీన్‌గా సాగిపోయేది. లేదంటే మీడియానే కూపీ లాగే ప్రయత్నం చేసేది. ఇప్పుడు వివరణనిచ్చే సంస్కృతీ లేదు... వెలికితీసే మీడియా కూడా లేదు. ఈమధ్యే ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ హఠాత్తుగా తన పదవికి రాజీనామా చేసి నిష్క్రమించారు. వచ్చినప్పటిలాగే వెళ్లేటపుడు కూడా ఎన్నో ప్రశ్నలు మిగిల్చారు. వాస్తవానికి ఆయనకు ఇంకా మూడేళ్ల వ్యవధివుంది. పైగా వచ్చే ఫిబ్రవరిలో రాజీవ్‌కుమార్ రిటైరయ్యాక ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యే అవకాశం కూడావుంది. ఈ చాన్సును కమిషనర్లుగా వున్నవారు ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరు. పోనీ గోయెల్‌కు అలా వెళ్లితీరాల్సిన పరిస్థితి ఏర్పడినా సాధారణంగా కేంద్రం సర్దిచెప్పే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే గత నెలలో మరో కమిషనర్ అనూప్ పాండే రిటైరయ్యారు. గోయెల్ కూడా నిష్క్రమిస్తే ఒక్కరే మిగులుతారు. ఒక్కరితో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు బదులు ఆ ప్రక్రియ ముగిసేవరకూ వుండాలని ఆయన్ను కోరితే వేరుగా వుండేది. ఈ హఠాత్తు నిష్క్ర మణలోని ఆంతర్యమేమిటో మూడోకంటికి తెలియదు. ఆయనంతట ఆయన వెళ్లారా, ప్రభుత్వమే అడిగిందా అన్నది అర్థంకాదు. ఆయన నియామకం కూడా వివాదాస్పదమే. 2022 నవంబర్ వరకూ పంజాబ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా వున్న గోయెల్ ఆ నెల 18న స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు. రాత్రికి రాత్రి కేంద్ర న్యాయశాఖలో కమిషనర్ ఫైలు చకచకా కదిలి, నలుగురు సభ్యుల జాబితాలో గోయెల్ పేరు చేరిపోయింది. ఆ మర్నాడే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు ఆ ఫైలు వెళ్లటం, గోయెల్‌ను ఎంపిక చేయటం, ఆయన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం ముగిసిపోయాయి. ఈ హైస్పీడ్ '24గంటల వ్యవహారం'పై దాఖలైన పిల్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 'ఎందుకింత తొందర?' అంటూ కేంద్రాన్ని ప్రశ్నించింది కూడా. కానీ చివరకు ఆ పిల్‌ను తోసిపుచ్చింది.

ఎన్నికల కమిషనర్‌ల నియామకం అంశంలో కొత్త చట్టం వచ్చేవరకూ ఎంపిక కమిటీలో ప్రధాని, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వుండాలని నిరుడు మార్చిలో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. రాజ్యాంగంలోని 324(2) అధికరణను ఉల్లంఘించి ప్రధాని ఏకపక్షంగా నియమకాలు చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం ఆ తీర్పునిచ్చింది. అనంతరం ఆగస్టులో కేంద్రం తెచ్చిన చట్టంలో ఆ తీర్పు స్ఫూర్తి గాలికెగిరి పోయింది. ప్రధాని, కేంద్రమంత్రి, లోక్‌సభలో విపక్షనేత ఎంపిక కమిటీలో వుంటారని ఆ చట్టం చెబుతోంది. పర్యవసానంగా ఎప్పటిలా పాలకపక్షం అభీష్టమే నెరవేరుతుంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో విపక్షం లేకుండానే బిల్లు ఆమోదం పొంది, చట్టం కావటాన్ని సవాలు చేస్తూ దాఖలైన రిట్ ప్రస్తుతం విచారణలో వుంది. ఆ చట్టంకిందనే తాజాగా ఇద్దరు కమిషనర్లను నియమించారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ కీలకమైన అంశం. దాన్ని పర్యవేక్షించే ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వుండాలని జనం కోరుకుంటారు. అందుకే కమిషనర్‌ల నియామకం, పదోన్నతులు సాధ్యమైనంత పారదర్శకంగా వుండేందుకు ప్రయత్నించాలి. హఠాత్తు నిష్క్రమణలు, ఆగమనాలు ఎన్నికల సంఘం తటస్థతను ప్రశ్నార్థకం చేస్తాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యే దశలో అశోక్ లావాసా 2020లో హఠాత్తుగా రాజీనామా చేయటం, ఇటీవల వున్నట్టుండి గోయెల్ నిష్క్రమించటం, పాలకపక్షందే పైచేయిగావున్న ఎంపిక కమిటీ కొత్త నియామకాలు చేయటం వంటివి సంశయాలకు తావిస్తాయని పాలకులు తెలుసుకోవటం ఉత్తమం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.షష్ఠి తె.3.27 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి సప్తమి, **నక్షత్రం:** కృత్తిక రా.9.20 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.9.45 నుండి 11.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.33 నుండి 9.21 వరకు, తదుపరి ప.12.33 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** రా.7.11 నుండి 8.40 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

మూడు విచిత్ర దారుల కలయిక

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మంచి పంటలు పండే 30 వేల ఎకరాల భూమిలో అమరావతి నగర నిర్మాణమనే లాభసాటి దారి పట్టాడు చంద్రబాబు. అత్తారింటికి దారి వెతికే నటుడేమో పిల్లలకు యూట్యూబ్‌లుండగా బడులెందుకు అని ప్రశ్నల వర్షం మొదలెట్టాడు. దేశ భవిష్యత్తుకు బడిదారి కాదు వెతకాల్సింది, గుడిదారి అని బీజేపీ చెబుతున్నది. ఈ మూడు దారులూ ఎన్నికల కోసం ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటయ్యాయి. ఇక జగనేమో విద్యా, వైద్య రంగాలను గ్రామ వ్యవస్థల్లోకి బలంగా తీసుకెళ్లి సంపూర్ణ గ్రామ అభివృద్ధికి పథకాలు రూపొందించే బాట పట్టాడు. ఈ అభివృద్ధి మార్పులో రిస్క్ ఉన్న మాట నిజం. బలమైన కాంట్రాక్ట్ క్లాస్ ప్రభుత్వానికి అడ్డం తిరిగే అవకాశం ఉంటుంది. కానీ ఇది అన్ని కులాల్లోని బీదవారి భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలకు ముందు మూడు విచిత్ర దారుల కలయిక జరిగింది. ఒకటి అమరావతికి దారి. ఆ దారి ఏది, ఏది అని 2019 నుండి చంద్రబాబు వెతుకుతున్నాడు. ఈయన దారి తప్పడమనేది 2014లోనే జరిగింది. రాష్ట్రానికి హైదరాబాదును మించిన రాజధాని తను, తన కొడుకు దశాబ్దాలు పాలించి అతి త్వరలోనే సింగపూర్ లాంటి సిటీ కడుతామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కృష్ణానది ఒడ్డున బంగారు పంటలు పండే 30 వేల ఎకరాల భూమిని రైతుల దగ్గరి నుండి తీసుకున్నారు. అప్పుడు కేంద్రాన్ని పరిపాలిస్తున్న బీజేపీ కూడా ఈ దారి తప్పిన దారిలో ఉంది.

ఈ భూముల్లో మంచి పంటలు పండించుకునే రైతుల్ని అతి త్వరలోనే పెట్టుబడిదారులను చేస్తామని ఆశ పెట్టారు. ఇది విచిత్ర ఆశ. ఆ రైతులెలా నమ్మారోగానీ ఒక చిన్న రాష్ట్రం 30 వేల ఎకరాల్లో ఒక నగరాన్ని నిర్మించి, బాగా పంటలు పండే ఖరీదైన ఎకరా భూమికి బదులు 200 గజాల కమర్షియల్ ల్యాండ్ ఇస్తామంటే ఎలా నమ్ముతారు? ఇక ఆ ఐదేండ్లలో సింగపూర్ నగర నిర్మాతలు రాష్ట్ర బడ్జెట్‌నంతా ఇతర దేశాల కాంట్రాక్ట్ బృందాలకు, మంత్రివర్గ కమిటీలు ప్రపంచ పట్టణాల నమూనాల అధ్యయనానికి ఖర్చు చేశారు. నగర నిర్మాణం జరగకముందే దాని చుట్టూ రింగురోడ్లు, ఉద్యానవనాలు తయారౌతున్నట్టు ప్రకటించారు. వీటి నమూనాలు గీయడానికి వందల కోట్లు ఖర్చు చేశారు. చివరికి 2019 ఎన్నికలు వచ్చే నాటికి అమరావతికి దారేది? అనే స్థితిలో చంద్రబాబు ఆయన ప్రయివేటు విద్యా, వైద్య మంత్రివర్గ మిత్ర బృందం ఎన్నికలకు పోయింది. ఘోరంగా ఓడారు. ఇప్పుడు అత్తారింటికి దారేది? అని నిరంతరం వెతికే నాయకుడు లేని నాటకదారితో పొత్తు కుదుర్చుకున్నాడు బాబు.

ఈ అత్తారింటికి నిరంతరం దారి వెతికే నటుడు పిల్లలకు యూట్యూబ్‌లుండగా బడులెందుకు, సినిమాలుండగా రైతులకు వ్యవసాయం పనులెందుకు, వెల్‌ఫేర్ స్కీములెందుకు? అని ప్రజల బతుకుదారులన్నీ మూసెయ్యాలని ఎన్నికల ముందే ప్రశ్నల వర్షం మొదలెట్టాడు. ఈ ఇద్దరు కలిసి తమ విచిత్ర దారుల కలయిక చాలదన్నట్లు మళ్లీ బీజేపీని కూడా తమ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. దేశ భవిష్యత్తుకు బడిదారి కాదు వెతకాల్సింది, గుడిదారి అని చాలా కాలంగా బీజేపీ చెబుతున్నది. వీళ్లంతా కలిసి పోటీ చేసి గెలిస్తే, రాష్ట్ర బడ్జెట్‌ను ఏ దారి అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాలనే కొట్లాట మొదలౌతుంది. చంద్రబాబు అమరావతి నిర్మాణం కోసం ఖర్చు పెట్టాలంటాడు. 30 వేల ఎకరాలతో సింగపూర్లు నిర్మించాలి! పవన్ తన కల్యాణం కోసం ఖర్చు చేయాలంటాడు. ఆయనకు అత్తారింటి దారి వెతుకులాట, ఆ దారిలో ఖర్చు చేయడం తప్ప ప్రజల అభివృద్ధి దారి, పిల్లల బడి దారి, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ విద్య, ప్రజల ఆరోగ్యం కోసం హాస్పిటల్స్ వంటివి ఆయన నటనా జీవితంలో



ఎరుగనివి. బీజేపీతో పొత్తు కుదిరింది కనుక అది గుడుల నిర్మాణం, పురాతన సంప్రదాయ చరిత్ర పరిరక్షణ, అభివృద్ధి, విశ్వగురుపీఠ ఏర్పాటు అమెరికాలో చేయాలనే ఆశయ సాధనకు డబ్బు ఖర్చు చెయ్యాలనే డిమాండ్ చేయడం మామూలే.

జగన్ పరిపాలించిన ఐదేండ్లు ఏక కేంద్ర నిర్ణయాలు, ఖర్చు అభివృద్ధి ప్లాన్లు జరిగాయి. అందులో మొదటిది, అసాధ్యమైన 30 వేల ఎకరాల నగర నిర్మాణం ఆపడం; అది ఆపకుండా ప్రజల కోసం ఏ ఖర్చూ చెయ్యలేమని గుర్తించడం. రెండవది విద్యా, వైద్య రంగాలను గ్రామ వ్యవస్థల్లోకి బలంగా తీసుకెళ్లి సంపూర్ణ గ్రామ అభివృద్ధికి పథకాలు రూపొందించటం; భవన నిర్మాణ ఖర్చును పట్టణ నిర్మాణ రంగం నుండి పల్లె నిర్మాణ రంగంలోకి మార్చడం; గ్రామాల్లో బడుల భవనాలు, హాస్పిటళ్లు, సెక్రటేరియట్లు నిర్మించడం; ఈ నిర్మాణ పనులను పెద్ద కాంట్రాక్టర్ల నుండి గ్రామ కాంట్రాక్టర్లకు మార్చడం; అందులో ముఖ్య గ్రామ ప్రజా కమిటీలకు నిర్మాణ బాధ్యతలు ఒప్పజెప్పడం. ఈ అభివృద్ధి మార్పులో రిస్క్ ఉన్న మాట నిజం. బలమైన కాంట్రాక్ట్ క్లాస్ ప్రభుత్వానికి అడ్డం తిరిగే అవకాశం చాలా ఉంటుంది.

ఇంతకంటే పెద్ద రిస్కుతో కూడిన నిర్ణయం ప్రభుత్వ విద్యా విధానాన్ని ఆంగ్ల ప్లస్ తెలుగుతో జతపర్చి ఆధునిక విద్యా టెక్నాలజీని శ్రమ జీవుల పిల్లల బతుకుల్లోకి తీసుకెళ్లటం. ఇది భారతదేశం వంటి ప్రయివేటు విద్యా పెట్టుబడి–దోపిడీ వ్యవస్థ ఏ దేశంలో లేనంత బలంగా ఉన్న చోట ప్రయోగాత్మకంగానైనా చెయ్యడం ఊహకందనిది. ఇది విద్యా దోపిడీ, ప్రయివేటు పెట్టుబడుల డబ్బు విస్తరించి ఉన్న ఆస్తులు, వాటి చుట్టూ ఉన్న మాఫియాను బాగా బలహీనపర్చే నిర్ణయం. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం అంటేనే ఉగ్రరూపం దాల్చే ప్రయివేటు ఇంగ్లిష్ మీడియం మాఫియాతో నేరుగా తలపడటం. ఈ మాఫియాకు ఇప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు దాసోహం చేసే రోజులివి.

కార్మిక వర్గ రక్షకులమనే కమ్యూనిస్టు పార్టీలు సైతం ప్రయివేటు విద్యా మాఫియాను అంటకాగి బతుకుతూ ఉన్న దశ ఇది. ప్రయివేటు విద్యా రంగం ఈ దేశంలో మిగతా అన్ని పెట్టుబడిదారీ రంగాలను మించిన ఆస్తుల్ని, మంది మార్బలం, బస్సులు, కార్లు, వ్యాన్లు కలిగి ఉండి మారుమూల గ్రామాల్లో కూడా విస్తరించి ఉన్నందువల్ల దీని శక్తి ఉత్పత్తి రంగ పెట్టుబడి కంటే బలమైంది. దీన్ని ఎదిరించలేకనే అన్ని రాజకీయ పార్టీలు, చివరికి కమ్యూనిస్టు పార్టీలతో సహా, ఊకదంపుడు 'మాతృభాష' సిద్ధాంతం ప్రజలకు నేర్పి తమ పార్టీలను, తమ పిల్లల మెదళ్లను ప్రయివేటు విద్యా వ్యవస్థకు తాకట్టు పెట్టాయి. జగన్ దాన్ని బద్దలు కొట్టారు. ఇది మామూలు విషయం కాదు. భారతదేశ జ్ఞాన సంపద రూపు రేఖల్ని మార్చే పోరాటం ఇది.

ప్రజా సంక్షేమ వ్యవస్థను భారతదేశంలో ఏ కేంద్ర ప్రభుత్వం గాని, ఏ రాష్ట్ర ప్రభుత్వంగానీ ఊహించని స్థాయిలో 'మనీ ట్రాన్స్‌ఫర్' పద్ధతిలో ప్రజా బ్యాంకు ఎకౌంటుల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసింది జగన్ ప్రభుత్వం. ఇటువంటి స్కీములను ఈ మూడు పార్టీల కూటమి కూడా చేస్తామనొచ్చు. కానీ అన్ని సమస్యలకు, ముఖ్యంగా విశాల ప్రజల బీదరికానికి మందు జగన్ ప్రారంభించిన క్వాలిటీ ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వం ఇవ్వడంలో ఉన్నది. దానికి బద్ధ శత్రువు చంద్రబాబు, పచ్చి వ్యతిరేకి బీజేపీ, పిచ్చి వ్యతిరేకి పవన్. వీళ్లంతా ప్రయివేటు ఇంగ్లిష్ మీడియం విద్యా పెట్టుబడిదారీ వర్గాన్ని తమ భుజాల మీద మోస్తారు. వీళ్ళు అధికారంలోకి వస్తే మొదట ఆగిపోయేది ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య, కొత్త పాఠశాలల నిర్మాణం. ఇప్పటికే నిర్మించబడ్డ బడులకు మెయింటనెన్స్ డబ్బు ఆపివేత, మిర్రర్ ఇమేజ్ బుక్స్ ప్రింటింగ్ ఆపివేత.

సంక్షేమాలు ఎన్ని చేస్తామని చెప్పినా 30 వేల ఎకరాల్లో సింగపూర్ నిర్మాణం కార్యక్రమం అన్నింటినీ ఆపేస్తుంది. అమరావతి భారీ నగర నిర్మాణ సమస్య ఈ మూడు పార్టీల మెడకు చుట్టుకున్న పెద్ద నాగుపాము. బాబు నిర్మించే పట్టణ పాముకు సరిపోయేన్ని పాలు వీరు పొయ్యకపోతే అది వీరిని కాటేసి చంపేస్తుంది. దానికి గ్రామాలను మాడ్చాలి. ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందు ఒకే ఒక పరిష్కారముంది. అది ఈ ఎన్నికల్లో జగన్‌ని గెలిపించుడు. కనీసం ఇంకో ఐదేండ్లు విద్యా రంగం మార్పులతో ఇప్పుడున్న సంక్షేమ పథకాలను కొనసాగించుకుంటే క్రమంగా ఇటువంటి పథకాలు అవసరం లేని దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవుతుంది. ఈ మూడు దారుల కూటమే వస్తే మళ్లీ అగాథంలో ఆంధ్రప్రదేశ్ పడుతుంది. బాబు భయమంతా గ్రామాల్లోని కూలీ నాలీ చేసుకొని బతికే వారి పిల్లలు మేధావులు, నాయకులు అయితే తన కొడుకు, మనవడు ఏమౌతారనే. ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కులాల్లోని బీదవారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నేలకు దిగితేనే...



బెంగళూరు గమ్మత్తయిన నగరం. ప్రతి ఒక్కరూ మేఘాల్లోనే ఉంటారు. కానీ ఎవరి దగ్గరా నీళ్లు లేవు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

అభినందనలు



కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా ఎంపికైన సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌కు అభినందనలు. ఇద్దరికీ అద్భుతమైన రికార్డు ఉంది. కఠిన బాధ్యతను నిర్వర్తించడంలో వారికి శుభాకాంక్షలు అందిస్తున్నాను.

– ఎస్.వై. ఖురేషీ, కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

ఉండాల్సిన నియంత్రణ



యూఎస్ టీవీ నెట్‌వర్కులను విదేశీయులు సొంతం చేసుకోవడానికి ఎఫ్‌సీసీ నియంత్రణలు ఉన్నందున రూపర్ట్ మర్డోక్ 1985లో అమెరికా పౌరుడు కావాల్సి వచ్చింది. ఇండియాలో కూడా డిజిటల్ మీడియా సహా వార్తా సంస్థలను విదేశీయులు సొంతం చేసుకోకుండా అలాంటి నియంత్రణలు ఎందుకు లేవు? స్పష్టమైన ప్రమాదం కనబడుతోంది.

– హిందోల్ సేన్‌గుప్తా, కాలమిస్ట్

జరగదు!



నాటో దళాలు, రష్యా నేరుగా తలపడటం గానీ, అణ్వాయుధాలు జారవిడుచుకోవడం గానీ జరగదు. అనవసర సద్దు వలదు.

– వెలీనా త్చకరోవా, భౌగోళిక రాజకీయాల విశ్లేషకురాలు

తప్పని నైపుణ్యం



ఏకకాలంలో మహిళలు అనేక పనులు చేయగలరని ఇటీవల ఒక ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఎత్తిచూపారు. అధికార స్థానాల్లో ఉన్న మనుషులు ఇలాంటి సందేశాన్ని ఇవ్వకూడదు. మహిళలు ఏకకాలంలో అనేక పనులు ఎందుకు చేస్తారంటే, విధి లేక. కానీ అలాంటి పరిస్థితి ఉండకూడదు.

– సాన్యా తల్వార్, సంపాదకురాలు

ఉపవాస దీక్ష



నేను గత 25-30 ఏళ్లుగా, ప్రతి సంవత్సరం రమదాన్ నెలలో ఒకరోజు (సాధారణంగా చివరి శుక్రవారం) ఉపవాసం ఉంటున్నాను. ముస్లిం సోదరసోదరీమణులకు సంఘీభావం చాటడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిమేతరులను కూడా అలాగే చేయాలని అభ్యర్థిస్తున్నాను.

– మార్కండేయ కాట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

కాదనలేని నిజం



కర్ణాటకలోని 20 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 10 మంది అభ్యర్థులను మార్చింది. గత ఎన్నికల్లో ఆ పార్టీ 28 స్థానాలకు 25 గెలిచింది. అయినప్పటికీ సగం మందిని మార్చడమంటే, వ్యక్తుల కన్నా తమ భావజాలం గెలిపిస్తుందన్న విశ్వాసం కనబడుతోంది. దేశంలోని 62 శాతానికి పైగా జనాలు హిందుత్వను వ్యతిరేకిస్తున్నప్పటికీ, బీజేపీ ఒక పార్టీగా ప్రబలమైనది.

– చేతన్ కుమార్ అహింస, కన్నడ నటుడు

ఇన్ బాక్స్

కృత్రిమ మేధస్సు – వినియోగదారులు

"విపణిలో వినియోగదారుడు అత్యంత ముఖ్యమైన అతిథి. వినియోగదారుడు లేకుండా వ్యాపారం లేదు" అన్నారు ఎలియనోర్ రూజ్‌వెల్ట్. నేడు గూగుల్ అసిస్టెంట్, అమెజాన్ అలెక్సా వంటి కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) ఆధారిత ఎలక్ట్రానిక్ వస్తువులు ఇళ్లలోకి వచ్చేశాయి. కృత్రిమ మేధస్సుతో నేడు వినియోగదారులకు వచ్చే అనుమానాలను ఇ-కామర్స్ కంపెనీలు నివృత్తి చేస్తున్నాయి. ఇవ్వాళ బ్యాంకింగ్ రంగం, వాణిజ్యరంగాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒక భాగంగా మారింది. అలాగే వాణిజ్య రంగంలో కృత్రిమ మేధస్సుతోనే నకిలీ వస్తువులను కూడా గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దేశంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిపోతున్నాయి. గూగుల్ పే, ఫోన్ పే, గేట్ వే, ఫ్రీచార్జ్, పేటీఎం, మొబిక్విక్ వంటి సంస్థలు డిజిటల్ చెల్లింపులు నిర్వహిస్తున్నాయి. వాటన్నింటినీ కృత్రిమ మేధస్సు ద్వారానే నిర్వహిస్తున్నారు. గూగుల్ మ్యాప్ కూడా కృత్రిమ మేధస్సు ద్వారానే పనిచేస్తుంది.

వినియోగదారులు ఇప్పుడు కృత్రిమ మేధస్సుపై ఆధారపడి అనేక సేవలను, వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులు నాణ్యమైన వస్తువులు వెతికే క్రమంలో అనేక నకిలీ ఉత్పత్తులు కూడా గూగుల్ సెర్చ్‌లో కనిపిస్తున్నాయి. 'తక్కువ ధర-ఎక్కువ వస్తువులు' అనే మోసపూరిత విధానాన్ని కొందరు అనుసరిస్తున్నారు. కొన్ని సంస్థలైతే లాటరీలు, బహుమతులు, డిస్కౌంట్ ధరలతో మోసగిస్తున్నాయి. బ్రాండెడ్‌కంపెనీల పేరుతో నకిలీ వస్తువులూ, వినియోగించిన వస్తువులూ, వస్తువుల బదులు రాళ్ళు, సబ్బులు వంటి వాటినీ డెలివరీ చేసే సంస్థలు కూడా పుట్టుకొచ్చాయి. వీటి నుండి నేడు వినియోగదారులకు రక్షణ కల్పించవలసిన బాధ్యతను ఇ-కామర్స్ కంపెనీలు, సెర్చ్ ఇంజన్ సంస్థలే తీసుకుని అనేక నకిలీ సంస్థలను నిషేధించాయి. ఇందుకు కృత్రిమ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాన్నే వాడుతున్నారు. వైద్యం కోసం వినియోగించే మందులను కూడా నేడు కొన్ని ఈ-కామర్స్ సంస్థలు డోర్ డెలివరీ చేస్తున్నాయి. నకిలీ సంస్థలను, నకిలీ మందులను గుర్తించటం కష్టతరంగా మారింది.

వినియోగదారులు డిజిటల్ మార్కెట్‌లో ఎదుర్కొంటున్న మోసాలు / నష్టాల నుండి రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. వారిని ఈ మోసాల పట్ల జాగరూకులను చేయడం లక్ష్యంగా ఈ ఏడాది 'వినియోగదారుల కొరకు న్యాయమైన మరియు బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు' అనే థీమ్‌ను కేంద్ర వినియోగదారులు, ఆహార మరియు పౌర సరఫరాలశాఖ మంత్రిత్వ శాఖ ప్రటించడం ముదావహం.

– దాసరి ఇమ్మానియేలు, ఏపీ వినియోగదారుల సంఘాల సమాఖ్య ఛైర్మన్
(నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం)

ట్రోలింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో గీతాంజలి అనే మహిళ ప్రభుత్వ పథకాలు తీసుకొని ఏ విధంగా లబ్ధి పొందిందో ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరంగా చెప్పింది. ఆమె ప్రభుత్వ పథకాల వల్ల తమ కుటుంబానికి ఎంతగా లబ్ధి చేకూరిందీ, వారి పిల్లలకి కూడా భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా విధానం ఎంతగా ఉపయోగ పడనున్నదో సంతోషంగా తెలియ పరిచింది. కానీ ఆమె అభిప్రాయంపై కొందరు వ్యక్తులు (ప్రతిపక్షాల కార్యకర్తలు) అనుచిత, అన్‌పార్లమెంటరీ పదాలతో కూడిన కామెంట్లు చేశారు. దీంతో ఆమె మానసికంగా కుంగిపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ఇప్పుడు వారు తల్లిలేని పిల్లలయ్యారు.

ఈ మధ్యకాలంలో 'సోషల్ ట్రోలింగ్' బాగా పెరిగిపోయింది. ముఖ్యంగా రాజకీయాలలో ఇది మరింత తీవ్రంగా ఉంది. ఒక పార్టీనీ, ఒక వ్యక్తినీ, ఒక నాయకుణ్ణీ, ఒక విధానాన్నీ సమర్థిస్తూ మాట్లాడితే వెంటనే సామాజిక మాధ్యమాల్లో పలు పార్టీలకు సంబంధించిన వారు అదే పనిగా వారిని విమర్శించడం కనిపిస్తోంది. అయితే ఇందులో మహిళలను కించపరచడం, వారిని తక్కువ చేసి మాట్లాడటం, అనరాని మాటలు అనడం బాధాకరం. రాజకీయ చర్చల్లో సాధారణంగా చిన్న పిల్లల్నీ, మహిళలనూ కించపరచకూడదు అనే కనీస ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా?

సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం కేవలం రాజకీయ వర్గాలే కాదు సాధారణ ప్రజలు కూడా చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశా లల్లో చదువుతున్నటువంటి బాలికలు మాట్లా డిన ఇంగ్లీష్‌పై కూడా చాలా ట్రోల్స్ వచ్చాయి. పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ



పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశ పెట్టి వారు ముందుకు దూసుకువెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అటువంటి పిల్లలు మాట్లాడే ఇంగ్లీష్‌పై వ్యంగ్యాస్త్రాలను ఆ యా వర్గాలకు చెందిన వారే కొందరు ట్రోల్ చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఇలా ప్రభుత్వ పథకాల వల్ల ప్రయోజనం పొందుతున్న మహిళలూ, బడిపిల్లలను సోషల్ మీడియాలో ట్రోల్ చేసి వారిని క్షోభ పెట్టడం ప్రతిపక్ష కార్యకర్తలకు తగదు. ఇలా చేస్తే వారు అవమానంతో ఆత్మహత్యలు చేసుకోవడం పెరుగుతుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూ ట్యూబ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా దిగ్గజాలు... ట్రోల్ చేసేవారిని గుర్తించి, నియంత్రించడానికి ప్రత్యేక టెక్నాలజీని అభివృద్ధి చేయాలి. అలాగే ప్రభుత్వం కూడా తమ ఐటీ డిపార్ట్‌మెంట్ ద్వారా తగిన నియంత్రణా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా అటువంటి వారికి జరిమానాలు విధించాలి.

భావస్వేచ్ఛ ఉందికదా అని ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించడం సరికాదుకదా? ఇటువంటి వారి ప్రవర్తన సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే యువతపై చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. అసలు ఈ ట్రోలింగ్‌లో పాల్గొంటున్న వారిలో ఎక్కువ మంది యువతే ఉండటం ఇందుకు నిదర్శనం. గీతాంజలి ఆత్మహత్య కేసులో పోలీసులు గురు వారం ప్రతిపక్ష టీడీపీ కార్యకర్తలు ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని గుంటూరు ఎస్పీ తుషార్ ప్రకటించారు. ఇలా కఠినంగా వ్యవహరిస్తేనే ట్రోలింగ్‌ను అరికట్టడం సాధ్య మవుతుంది.

– డా॥ శ్రవణ్ కుమార్ కందగట్ల
sravankuc@gmail.com

పుష్పం– ఫలం

"పూర్వం ఒక అమాయకుడు ఒక మామిడితోట కొనుక్కొన్నాడు. దాని చుట్టూ బోలెడు మోదుగు చెట్లు ('అగ్నిపూల' చెట్లు– పలాశ చెట్లు అని కూడా అంటారు) ఉన్నాయి. వసంతం రాగానే మామిడి చెట్లు పూతపట్టాయి. కానీ అంత పెద్ద చెట్టుకు ఎంతో చిన్న పూలు కనిపించేసరికి, 'అమాయకుడు' నిరుత్సాహపడిపోయాడు. పూలు చిన్నగా ఉంటే పండ్లూ చిన్నవే కాస్తాయి కదా అని దిగులు పడ్డాడు.

జ్యోతిర్మయం

అదే సమయంలో భళ్ళున పూసిన మోదుగు పూలు పెద్దగా, ఎర్రగా, ఆకర్షణీయంగా కనిపించాయి. పూలు ఇంత పెద్దగా ఉంటే, కాయలు మరింత పెద్దవిగా, రుచిగా ఉంటాయని అంచనా కట్టాడు 'అమాయకుడు'. వెంటనే మామిడి చెట్లన్నీ నరికేసి, మోదుగ చెట్లకు నీళ్ళు పట్టి, ఎరువూ గట్రా వేసి పోషించాడు. మోదుగ చెట్టు ఫలించినప్పుడు రుచీపచీ లేని అతి చిన్న మోదుగు కాయలు చూసి, 'అయ్యో, నేనెంతటి మూర్ఖపు పని చేశాను!' అని అప్పుడు దుఃఖించాడు.

నేను కూడా అలా మామిడి చెట్టును నరికి మోదుగ చెట్టును పోషించిన మూర్ఖుడినే. సోహం ఆమ్ర వనం ఛిత్వా / పలాశాన్ చ న్యషేచయమ్! / రామం ఫలాగమే త్యక్త్వా,/ పశ్చాత్ శోచామి దుర్మతిః!! (వాల్మీకి, అయోధ్యా 63–10) 'చేతికి అందివచ్చిన రాముడిని దుర్మతినై వదులుకొని, తరవాత ఇలా శోకిస్తున్నాను!'' రాముడు వనవాసానికి వెళ్ళాక, తన పట్టమహిషి కౌసల్య ముందు ఇలా వాపోతున్నవాడు దశరథ మహారాజు. 'ఒక పని చేసేటప్పుడు దీని ఫలం ఎలా ఉంటుంది, అది తియ్యని పుణ్యఫలమా, లేక, చేదయిన పాప ఫలమా, ఈ కర్మలో ఏమి దోషం ఉంది, ఎంతటి దోషం ఉంది అన్న గమనిక అవసరం. అది నాకు లేకపోయింది' అని పశ్చాత్తాప పడుతున్నాడు.

చిన్నతనంలో ఆయన వేటకు వెళ్ళాడు. రాత్రి సరయూనదిలో నీళ్ళు తాగేందుకు వచ్చే అడవిజంతువులను చీకటిలో వేటాడి చంపాలన్న చాపల్యం వల్ల, తొందరపాటుతో అంధకారంలో సంధించిన బాణం శ్రావణ కుమారుడి ప్రాణం తీసింది. అలాగే మరో సందర్భంలో, తనను ఎప్పుడయినా సరే, ఏదయినా సరే వరంగా అడిగే అధికారాన్ని చిన్న భార్య కైకకు అనాలోచితంగా కట్టబెట్టాడు. ఆ దూకుడుతనం వల్ల ఆయన చాలా చేదుఫలాన్ని రుచి చూడవలసి వచ్చింది.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి

- 'ప్రత్తిపాటి' ముందస్తు బెయిల్ పిటిషన్లపై సీఐడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధుల మళ్లింపు ఆరోపణలపై నమోదైన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ బలుసు శ్రీనివాసరావు తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. ఈ కేసులో వీరిని అరెస్ట్ చేయబోమంటూ సీఐడీ ఇచ్చిన హామీని ఈ నెల 22 వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జీఎస్టీ చెల్లించకపోవడంతోపాటు బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారంటూ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) డిప్యూటీ డైరెక్టర్ సీతారామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి, కుమార్తె, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వారంతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మల్లికార్జునరావు గురువారం మరోసారి విచారణ జరిపారు.

రెంటచింతలలో భానుడి ప్రతాపం

- అత్యధికంగా 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత

రెంటచింతల: భానుడి ప్రతాపం గణనీయంగా పెరుగుతోంది. పల్నాడు జిల్లా రెంటచింతలలో గురువారం గరిష్ఠంగా 40.8 డిగ్రీలు, కనిష్ఠంగా 29.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచే మండుతున్న ఎండలతో పాటు ఉక్కపోత వల్ల గ్రామస్తులు హడలిపోతుండగా, వేడి తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు తట్టుకోలేక పోతున్నారు.

యునైటెడ్ ఫ్రంట్ పేరుతో కొత్త కూటమి

- కన్వీనర్‌గా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): యునైటెడ్ ఫ్రంట్ పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ కూటమి ప్రారంభించినట్లు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఆయన స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తరాంధ్ర కార్యాలయాన్ని గురువారం ఎంవీపీ కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫ్రంట్ కూటమి నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ, ఆల్ తెలుగు ప్రజాపార్టీ, జాతీయ సమసమాజ్ పార్టీ, బీసీకే, ప్రజా రిపబ్లికన్ పార్టీ సంయుక్తంగా ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌ను స్థాపించినట్లు వెల్లడించారు. ఈ కూటమిలోని అన్ని పార్టీలు కలిసి ఉమ్మడిగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దించడం జరుగుతుందన్నారు. జై భారత్ నేషనల్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం టార్చ్‌లైట్‌ను ఎన్నికల గుర్తుగా ప్రకటించినట్లు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జై భారత్ నేషనల్ పార్టీ తరపున విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రక్షాళన అవసరమని చెప్పారు.

ట్రోలింగ్స్ వల్లే మనస్తాపంతో
గీతాంజలి ఆత్మహత్య

- అసభ్య పదజాలంతో దూషిస్తుండటంతో తట్టుకోలేకపోయింది
- ఈ ట్రోల్స్‌ను ఎలా తొలగించాలో స్నేహితులతో చర్చించింది
- అది సాధ్యం కాదని వారు చెప్పారు.. రైల్వే ట్రాక్ పైకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసింది
- గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వారిలో ఇద్దరి అరెస్టు
- మరికొందరి కోసం గాలిస్తున్నాం
- గుంటూరు ఎస్పీ తుషార్ దూడి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నగరంపాలెం : ఇంటి పట్టా రిజిస్టరై చేతికి వచ్చిన సందర్భంలో ఆనందంగా మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ గీతాంజలి పాలిట శాపంగా మారిందని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడీ తెలిపారు. ఈ వీడియోను ట్రోల్ చేయడంతో తట్టుకోలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గీతాంజలి మృతికి బాధ్యులైన ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసు విచారణ కోసం ఐపీఎస్ అధికారి నచికేత్ షెల్కే నేతృత్వంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), శ్రీనివాసరావు (ఎల్/ఓ), తెనాలి సబ్ డివిజన్ డీఎస్పీ రమేష్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. ఈ క్రమంలో



ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారా వచ్చిన ట్రోలింగ్‌లను పరిశీలించామన్నారు. గీతాంజలి నాలుగో తేదీన లోకల్ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిందని, ఆమె మాట్లాడిన మాటలు అదే రోజు సోషల్ మీడియాలో వైరలయ్యాయని తెలిపారు. దీనికి అనేక వ్యూస్ వచ్చాయని, దీంతో ఆమెను కొందరు ట్రోల్ చేయడం మొదలుపెట్టినట్లు గుర్తించామన్నారు. వీటిని చూసి ఆమె మనస్తాపానికి గురైందని, రెండు రోజులు డీలాగా గడిపినట్లు తెలిసిందన్నారు. ఏడో తేదీ ఉదయం ఈ ట్రోలింగ్‌పై తన సన్నిహితులు, బంధువులతో చర్చించిందని, వాటిని ఎలా తొలగించాలని వారిని అడగ్గా, అది సాధ్యం కాదని వారు ఆమెకు చెప్పారని తెలిపారు. ఈనెల ఏడో తేదిన ఆమెకు విజయవాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిందని, ఆ తర్వాత కూడా బంధువులతో మాట్లాడిందని చెప్పారు. తనను, తన పిల్లలను, భర్తను కూడా అసభ్య పదజాలంతో తిడుతున్నారని వారి వద్ద ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే గీతాంజలి తెనాలి రైల్వే ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసిందని చెప్పారు. ఆమెను గమనించి లోకో పైలెట్ అప్రమత్తమై, బ్రేక్ వేసి రైలును నిలిపారని, అప్పటికే రైలు తగలడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయని చెప్పారు. ఆమెను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. తెనాలి జీఆర్పీ పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులను విచారించగా, సోషల్ మీడియాలో అసభ్యకరమైన కామెంట్ల వల్ల ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ కేసు తీవ్రతను గుర్తించి క్రైమ్ నంబర్ 28/24/యు/ఎస్ 174 సీఆర్‌పీసీగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ తరువాత కేసును తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, దానిని కేసు నంబర్ 65/24సెక్షన్ 509, 306 ఐపీసీ , సెక్షన్ 67 ఐటీ యాక్ట్‌గా తిరిగి నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. వెయ్యికిపైగా కామెంట్లు ఉన్నట్లు విచారణ బృందాలు గుర్తించాయన్నారు. సోషల్ మీడియాలో అటువంటి భాష ఉపయోగించడం బాధాకరమన్నారు. ట్రోలింగ్‌కు పాల్పడిన విజయవాడకు చెందిన పసుమర్తి రాంబాబు, పశ్చిమ గోదావరి జిల్లా ఉండికి చెందిన వెంకట దుర్గారావుని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని అన్నారు. మిగతా వారిని గుర్తించే పనిలో ఉన్నామని చెప్పారు.

ట్రోల్స్‌పై ఫిర్యాదు చేయండి

పిల్లలు, మహిళలు, ఎవరైనా ఇటువంటి దారుణమైన ట్రోల్స్‌కి గురైతే సచివాలయాల్లోని మహిళా పోలీసులకు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో, దిశ పీఎస్‌లో, దిశ యాప్, డయల్ 100, స్టేట్ మహిళా హెల్ప్‌లైన్ నంబర్, సైబర్ మిత్ర వాట్సాప్ నంబర్ 9121211100కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ చెప్పారు. నేరుగా తనను కూడా సంప్రదించవచ్చన్నారు.

కొనసాగిన నిరసనలు

గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకల తీరుపై ప్రజల ఆగ్రహం.. పలు చోట్ల కొవ్వొత్తులతో ర్యాలీలు



చంద్రగిరిలో కొవ్వొత్తుల ర్యాలీ



విజయవాడలో న్యాయవాదులు ర్యాలీ

సాక్షి, నెట్‌వర్క్: తెనాలికి చెందిన గొల్తి గీతాంజలిని అసభ్యకర మెసేజ్‌లతో వేధించి, ఆమె ఆత్మహత్యకు కారణమైన టీడీపీ, జనసేన పార్టీలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గీతాంజలిపై ఈ రెండు పార్టీల సోషల్ మీడియా మూకలు అసభ్య సందేశాలతో దాడి చేయడాన్ని ఖండిస్తూ ప్రజలు చేస్తున్న నిరసనలు గురువారమూ కొనసాగాయి. పలు ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. ట్రోలింగ్ గూండాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడలో న్యాయవాదులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో విజయవాడ న్యాయస్థానాల సముదాయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరిగింది. టీడీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వో వి.శ్రీనివాసరావుకు న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ టీడీపీ చర్యలతో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుజాత, ఉషా జ్యోతి, సౌమ్య, జ్యోతి, సి.హెచ్.సాయిరామ్, పిల్లా రవి, కె.జయరాజు, మన్మధరావు, కె.ప్రభాకర్, నిర్మల్ రాజేష్, సూర్యనారాయణరెడ్డి, పూర్ణ, భార్గవ్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. తిరుపతి జిల్లా చంద్రగిరిలో విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద గీతాంజలి చిత్రపటానికి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారికి సంఘీభావం తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరులో ప్రజలు నిరసన ప్రదర్శన చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, గీతాంజలి జోహార్ అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గౌరుపోటు రమాదేవి తదితరుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేశారు.



చిత్తూరు జిల్లా పలమనేరులో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న స్థానికులు

గీతాంజలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

- టీడీపీ, జనసేన మూకల పోస్టింగులకు బలైన గీతాంజలి
- ఆమె కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం జగన్
- పిల్లల పేరిట రూ.20 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్
- డిపాజిట్ పత్రాలను అందించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకల అసభ్యకర పోస్టింగులకు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడిన గొల్తి గీతాంజలి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆ కుటుంబానికి అందింది. గీతాంజలి కుమార్తెలు రిషిత, రిషికల పేరిట చెరొక రూ.10 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆ పత్రాలను గురువారం సాయంత్రం గీతాంజలి భర్త బాలచంద్ర సమక్షంలో చిన్నారులకు అందజేశారు. ముందుగా గీతాంజలి చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మందపాటి శేషగిరిరావుతో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం డిపాజిట్ పత్రాలను చిన్నారులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా తన కుటుంబానికి జరిగిన మేలును గీతాంజలి బహిరంగంగా మీడియాలో చెప్పటాన్ని జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకలు వికృత పోస్టింగులతో ఆమె బలవన్మరణానికి కారకులయ్యారని ఎమ్మెల్యే శివకుమార్ ధ్వజమెత్తారు. తన చేత్తో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకున్న గీతాంజలి భౌతికకాయానికి తానే పూలమాల వేయాల్సి రావటం ఎమ్మెల్యేగానే కాకుండా వ్యక్తిగతంగానూ ఎంతగానో కలచివేసిందన్నారు. అమాయక మహిళలపై ఇలాంటి వేధింపులకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు.



డిపాజిట్ పత్రాలను చిన్నారులకు అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్



చిన్నారులు రిషిత, రిషికలకు రూ.2 లక్షలు అందజేస్తున్న హరికృష్ణారెడ్డి

ఎన్నారై పంచ్ ప్రభాకర్ రూ.2 లక్షల సాయం

టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి కుటుంబానికి ఎన్నారై పంచ్ ప్రభాకర్ రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఆయన పంపిన డబ్బును గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి, స్థానిక నేతలు గీతాంజలి భర్త బాలచంద్ర, చిన్నారులు రిషిత, రిషికలకు అందజేశారు. ఈ నగదు సాయం చేసిన ఎన్నారై పంచ్ ప్రభాకర్ వీడియో కాల్ ద్వారా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆందోళన చెందవద్దని, ఇద్దరు పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ఖర్చులను తన మిత్ర బృందంతో కలిసి తామే భరిస్తామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియాలో ఇలాంటి వేధింపులు బాధాకరమని వ్యాఖ్యానించారు. ఆర్థిక సాయం అందించిన పంచ్ ప్రభాకర్‌కు బాలచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

సహకార సంఘాలకు అవార్డుల ప్రదానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ సహకార సంఘాలను జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) ఎక్సలెన్స్, మెరిట్–2023 అవార్డులు వరించాయి. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కానూరు పీఏసీఎస్, పులుగుర్త హ్యాండ్లూమ్ వీవర్స్ కో–ఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ, వైఎస్సార్ జిల్లా జంగవారిపల్లె మహిళా డెయిరీ సహకార సంఘం, అన్నమయ్య జిల్లా కుప్పం మహిళా డెయిరీ సహకార సంఘాలు ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపికయ్యాయి. అన్నమయ్య జిల్లా తిమ్మ సముద్రం పీఏసీఎస్, అనకాపల్లి జిల్లా దిమిలి పీఏసీఎస్, ప్రకాశం జిల్లా రంగరాయ పాలెం, చిత్తూరు జిల్లా పెదభరణపల్లె మహిళా డెయిరీ సహకార సంఘాలకు మెరిట్ అవార్డులు పొందాయి. గురువారం మంగళగిరిలోని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆయా సొసైటీలకు ఎన్‌సీడీసీ రీజినల్ డైరెక్టర్ వంశీ దుబాసి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు అవార్డులను ప్రదానం చేశారు.



అవార్డులతో సహకార సంఘాల మహిళలు

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ
ఏ దశలో ఉంది?

- పూర్తి వివరాలను మా ముందుంచండి
- కేంద్ర ప్రభుత్వం, విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం
- స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకం.. దీనిపై కేంద్రానికి సీఎం లేఖ కూడా రాశారు
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసలు ప్రైవేటీకరణ ఏ దశలో ఉంది? స్టీల్ ప్లాంట్ భూములను ఏమైనా విక్రయించారా? విక్రయిస్తే ఎంత మేర విక్రయించారు? తదితర వివరాలను తమ ముందుంచాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యాన్ని ఆదేశించింది. అలాగే భూములను ఇతరులకు విక్రయించారని ఆరోపిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందుంచాలని పిటిషనర్ కేఏ పాల్‌ను ఆదేశించింది. ఏది పడితే అది ఆరోపిస్తే సరిపోదని.. ఆధారాలు లేకుండా మాట్లాడవద్దని పాల్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కేఏ పాల్, మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిని జస్టిస్ నరేందర్ ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపిస్తూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లో ఉందా? నష్టాల్లో ఉందా? అన్న విషయాన్ని తేల్చేందుకు హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. వాస్తవానికి స్టీల్ ప్లాంట్ లాభాల్లోనే నడుస్తోందని చెప్పారు. ఒకవేళ నష్టాల్లో ఉంటే.. ఆ మొత్తాన్ని భరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు చెందిన 2 వేల ఎకరాల భూములను ఇప్పటికే విక్రయించారని ఆరోపించారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఆరోపణలు చేస్తే సరిపోదని.. భూములు విక్రయించినట్లు ఆధారాలు చూపాలని పాల్‌కు స్పష్టం చేసింది.

ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకం

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. దీనిపై కేంద్రానికి సీఎం జగన్ లేఖ కూడా రాశారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్టీల్ ప్లాంట్‌ను నష్టాల నుంచి బయటపడేసేందుకు ఏం చేయాలో కూడా కేంద్రానికి సూచనలు చేశామన్నారు. భూములిచ్చిన వారు నష్టపోకూడదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉందా? అని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం నుంచి వివరాలు తెప్పించుకోవాల్సి ఉందని శ్రీరామ్ తెలిపారు. కేంద్రం తరఫు న్యాయవాది స్పందిస్తూ, ప్లాంట్ భూములను విక్రయించామన్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు.

జగన్‌లాంటి అన్న మీ దేశాల్లో ఉన్నారా!

ఐక్యరాజ్య సమితి మహిళా దినోత్సవంలో జయశ్రీ, పద్మజ



సీఎం జగన్ చేపట్టిన కార్యక్రమాలపై పోస్టర్లు ఆవిష్కరించిన జయశ్రీ, పద్మజ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ మహిళలకు అసలైన అండదండ అని, సీఎం జగన్ వంటి అన్నలు మీ దేశాల్లోను, సమాజాల్లోను ఉన్నారా అని వివిధ దేశాల నుంచి హాజరైన మహిళలను ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు కె.జయశ్రీ, స్త్రీ శిశు సంక్షేమ సలహాదారు నారమల్లి పద్మజ అడిగారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో రాష్ట్రం నుంచి వారిద్దరూ హాజరయ్యారు. గురువారం జరిగిన సదస్సులో ఏపీలో అమలవుతున్న మహిళాభివృద్ధి కార్యక్రమాల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, భద్రత అంశాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను 6 నిమిషాల వీడియో ద్వారా ప్రతినిధులకు వివరించారు. 'మహిళల కోసం ప్రభుత్వాలు చేసే ఖర్చు ద్వారానే ప్రగతిలో వేగం సాధ్యం' అనే అంశంపై వారు మాట్లాడుతూ 'ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్. యాక్సిలరేట్ ప్రోగ్రెస్' అన్నది 2024లో ఐక్యరాజ్య సమితి నినాదమని, ఈ నినాదాన్ని ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా ఆచరణలోకి తెచ్చారని వివరించారు. ఏపీలో అయిదేళ్ళుగా జెండర్ సమానత్వం పరంగా అక్కచెల్లెమ్మల సాధికారత కోసం సీఎం జగన్ అనేక విప్లవాత్మక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. జగనన్న అమ్మ ఒడి లాంటి స్కీమ్‌లు మీ దేశాల్లో, మీ సమాజాల్లో కూడా తల్లులు, పిల్లలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఇక్కడి పథకాలను అధ్యయనం చేసి మీ సమాజాల్లో అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఏపీలో అమలు చేస్తున్న సామాజిక పెన్షన్లు, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం వంటి పథకాల వల్ల మహిళల ఆర్థిక స్తోమతతోపాటు వారి ఆత్మగౌరవం పెరిగిందన్నారు.


చంద్రబాబు ఒక రాజకీయ టెర్రరిస్ట్

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



శ్రీరంగరాజపురం (చిత్తూరు జిల్లా): చంద్రబాబు ఒక రాజకీయ టెర్రరిస్ట్ అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. శ్రీరంగరాజపురం మండలంలోని కొత్తపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'చంద్రబాబు మాటల మాయల ఫకీరు. అధికారం కోసం ఎవరి కాళ్లకైనా పూజలు చేయడానికి వెనుకాడడు. 2019 ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి మాట్లాడుతూ మోదీ కన్న తల్లిని, భార్యను వదిలివేసిన వ్యక్తి అని మోదీకి దేశాన్ని పాలించే అర్హత లేదని దుయ్యబట్టాడు. మైనారిటీల హక్కులను కాల రాస్తూ ముస్లింలను ఊచకోత కోసిన దరిద్రుడు ఈ మోదీ. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వే జోన్ వంటి ప్రాజెక్టులను ఇవ్వకుండా రాష్ట్రంపై వివక్ష చూపిస్తున్న ఇలాంటి వ్యక్తికి దేశానికి ప్రధాని అయ్యే అర్హత లేదు' అని దేశం మొత్తం ప్రచారం చేసిన చంద్రబాబు నేడు మోదీ కాళ్లు పట్టుకున్నాడని మండిపడ్డారు. సోనియగాంధీని ఇటలీ రాక్షసి. కాంగ్రెస్‌ను దేశంనుంచి బహిష్కరించాలని చెప్పి.. మళ్లీ సోనియా కాళ్లు పట్టుకున్నాడని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం ఎక్కడ రాజీ పడకుండా అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. దత్తపుత్రుడు వివాహ వ్యవస్థ భ్రష్టు పట్టించిన ఓ మోసగాడన్నారు. జగనన్నను గెలిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందని నారాయణస్వామి విజ్ఞప్తి చేశారు.

వలంటీర్ల వ్యవస్థ భేష్: రఘువీరా



మడకశిర: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ చాలా మంచిదని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ప్రశంసించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాబోదని రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలను కూల్చే సంస్కృతి బీజేపీదని విమర్శించారు. ఎస్‌బీఐ ద్వారా బాండ్ల రూపంలో బీజేపీకి వచ్చిన పార్టీ ఫండ్ వివరాలను బయట పడితే ఆ పార్టీ పని అయిపోతుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మడకశిర అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మంచి వ్యక్తి అని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కన్వీనర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తనను కలిసిన గడినాడు కన్నడిగులతో రఘువీరారెడ్డి మాట్లాడారు. కర్ణాటక ప్రభుత్వం ద్వారా అక్కడి ప్రజలు పొందుతున్న ప్రయోజనాలను గడినాడు కన్నడిగులకూ వర్తింపజేసే విధంగా కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నేతలు

పెదవేగి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నవేళ వైఎస్సార్‌సీపీలోకి పెద్ద ఎత్తున కొనసాగుతున్న చేరికలు టీడీపీ, జనసేన పార్టీలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. అదే తరహాలో దెందులూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులైన అమ్మపాలెం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు చందు సీతారాంబాబు, విప్పాబత్తుల కోటేశ్వరరావు, చందు ధర్మారావు, యర్రా నాగబాబు, వెనిగళ్ల నాగసాయి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారని చెప్పారు.




వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

లా వర్సిటీ.. రాష్ట్రానికే మణిహారం

- 1,264వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: పాలనా వికేంద్రీకరణ లక్ష్యంతో మూడు ప్రాంతాల సమానాభివృద్ధికి కట్టుబడి అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు వేదికగా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం రాష్ట్రానికే మణిహారం కానుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,264వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన విధంగా పరిపాలనా వికేంద్రీకరణ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. రాష్ట్రం యావత్తు తన గుప్పెట్లో పెట్టుకోవాలనే యోచనతో బాబు అండ్ కో చేస్తున్న కుటిల యత్నాలకు త్వరలోనే గండి పడనుందని చెప్పారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా ప్రజల ఖాతాల్లోకి మళ్లించి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచాడని కొనియాడారు. రాష్ట్రంలో పేదల సమస్యలు పక్కన బెట్టి అధికారం కోసం పాకులాడుతున్న పలు పార్టీలు పొత్తులు, ఎత్తులతో పడరాని పాట్లు పడుతుండడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెద్దింటి విజయ్, పులిదాసు, కుమ్మరవల్లి కిషోర్ బాబు, కారుమూరి పుష్పరాజు, బోదాల సలోమీ, బోదాల సౌమ్య, పల్లె బాబు, నూతక్కి జోషి పాల్గొన్నారు.



ఐదోసారి అధ్యక్ష పీఠం దిశగా

- రష్యా అధ్యక్ష ఎన్నికల్లో హాట్‌ఫేవరెట్‌గా వ్లాదిమిర్ పుతిన్
- నేటి నుంచి మూడ్రోజులపాటు కొనసాగనున్న అధ్యక్ష ఎన్నికల పోలింగ్
- దాదాపు ఖాయమైన గెలుపుతో 2030దాకా పుతిన్ పాలనే

వ్లాదిమిర్ పుతిన్ పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే దేశం రష్యా. చాలా సంవత్సరాలుగా పుతిన్ ఏలుబడిలో ఉన్న రష్యాలో ఈరోజు నుంచి అధ్యక్ష ఎన్నికలు మొదలుకాబోతున్నాయి. గతంలో ఒక్క రోజులో పోలింగ్ పూర్తయ్యేది. దేశ చరిత్రలో తొలిసారిగా వరసగా మూడు రోజులపాటు అంటే 15, 16, 17 తేదీల్లో పోలింగ్‌కు రష్యా సిద్ధమైంది. ఉక్రెయిన్‌పై దురాక్రమణతో ప్రస్తుతం తన అధీనంలో ఉన్న నాలుగు ఉక్రెయిన్ రీజియన్‌ల లోనూ ఈ ఎన్నిక క్రతువు కొనసాగనుంది. ప్రస్తుత పదవీకాలంతో కలిపి పుతిన్ ఇప్పటికే నాలుగు సార్లు(2000, 2004, 2012, 2018)లో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. 2008లో ప్రధానిగానూ సేవలందించారు. మానవహక్కుల గొంతుక, విపక్ష నేత అలెక్సీ నావల్నీ గత నెల మారుమూల కారాగారంలో అనుమానాస్పద స్థితిలో చనిపోవడంతో ఈసారి పుతిన్ వ్యతిరేక ఓటింగ్ పెరుగుతుందా? లేదా అనేది వేచిచూడాలి.

పుతిన్ హవా..

అధ్యక్ష రేసులో పుతిన్ విజయబావుటా ఎగరేస్తారని ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది. అయినా సరే పౌర హక్కులను కాలరాస్తూ, నియంత పోకడలతో దేశాన్ని ఏలుతున్న పుతిన్ పాలనకు అంతం పలుకుతామంటూ విపక్ష పార్టీల నేతలు ప్రతినబూనారు. ఎన్నికల రణరంగంలో పుతిన్‌ను ఓడిస్తామంటూ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా(ఎల్‌డీపీఆర్) తరఫున అభ్యర్థిగా లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ అభ్యర్థిగా వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థిగా నికోలే ఖరిటోనోవ్‌లు ఎన్నికల బరిలో నిలిచారు. దేశ ఓటర్లలో పుతిన్‌కు 75 శాతం మద్దతు ఉందని, ఈ ముగ్గురు తలో 5 శాతం ఓట్లతో సరిపెట్టుకుంటారని ముందస్తు పోలింగ్ అంచనాలు విశ్లేషిస్తున్నాయి.

కుంభస్థలిని కొట్టగలరా ?


నికోలే


స్లట్‌స్కీ


దవాన్‌కోవ్

పోటీలో ఏ అభ్యర్థి నిలబడాలి అనేది దాదాపు దేశ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) నిర్ణయిస్తుంది. ఎల్‌డీపీఆర్ నేత లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ నేత వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ నేత నికోలే ఖరిటోనోవ్‌లు ఈసారి బరిలో దిగారు. పుతిన్‌ను వీరంతా విమర్శిస్తున్నప్పటికీ ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీరు వ్యతిరేకించలేదు. యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక విపక్ష నేత బోరిస్ నదేహ్‌దిన్‌ను పోటీకి నిలబడకుండా సీఈసీ అడ్డుకుంది. అభ్యర్థిత్వానికి సరిపడా సంతకాలను సేకరించలేకపోయారని ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కించింది. మరో అభ్యర్థి యెకటేరియా డుంట్‌సోవానూ సీఈసీ ఇలాగే పక్కకునెట్టింది. పుతిన్‌ను ప్రధానంగా విమర్శించే విపక్ష నేత అలెక్సీ నావల్నీ ఇప్పుడు ప్రాణాలతో లేడు. స్లట్‌స్కీ, దవాన్‌కోవ్, ఖరిటోనోవ్‌లు దేశ సమైక్యత విషయానికొచ్చేసరికి పుతిన్‌కు పరోక్షంగా మద్దతు పలుకుతారు. ఈ లెక్కన దేశ సమైక్యత జెండా పట్టిన పుతిన్‌కే ఎక్కువ ఓట్లు పడతాయి. దీంతో వీళ్లు పుతిన్‌ను ఓడించడం అనేది అసంభవం.

పోలింగ్ ఎక్కడెక్కడ?

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారం కంటే ముందే మొదలుపెట్టారు. ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతాలపై పుతిన్ ప్రధానంగా దృష్టిపెట్టారు. రష్యా భూభాగంలో ఎలాగూ మెజారిటీ సాధిస్తానని పుతిన్ బలంగా నమ్ముతున్నారు. ఉక్రెయిన్ ప్రాంతాల్లో గెలిచి తమది అధర్మ యుద్ధం కాదని ప్రపంచానికి చాటి చెప్పాలని పుతిన్ యోచిస్తున్నారు. ఇక్కడ స్థానిక ఎన్నికలు, రెఫరెండమ్‌లు ఇప్పటికే నిర్వహించారు. అంతర్జాతీయ నిబంధనలు ఉల్లంఘనకు గురయ్యాయని ప్రపంచదేశాలు మొత్తుకున్నా పుతిన్ పట్టించుకోవట్లేదు. ఈసారి 11.42 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలుస్తోంది. అర్హులైన ఓటర్లు విదేశాల్లో ఉన్నా సరే ఓటేయొచ్చు. మార్చి 19 కల్లా తొలి దఫా ఫలితాలు వెల్లడి కావచ్చు. తుది ఫలితాలు తెలియాలంటే మార్చి 29వ తేదీకా ఆగాల్సిందే. 2018 గత అధ్యక్ష ఎన్నికల్లో 68 శాతం పోలింగ్ నమోదైంది.

ఇంకెన్నాళ్లు పుతిన్ పాలిస్తారు?

మరో రెండు పర్యాయాలు దేశ అధ్యక్షుడిగా కొనసాగేందుకు అనువుగా చట్టం చేసి 2021లో పుతిన్ దానిపై సంతకం చేశారు. ఈసారి గెలిచి, 2030లోనూ గెలిస్తే 2036దాకా పుతిన్ దేశాధ్యక్షుడిగా కొనసాగుతారు. రష్యా పాలకుడు జోసెఫ్ స్టాలిన్ తర్వాత అత్యంత ఎక్కువకాలం దేశాన్ని పాలించిన నేతగా పుతిన్ పేరు ఇప్పటికే చరిత్రకెక్కింది.

పుతిన్‌కు నిజంగా అంతటి ఫాలోయింగ్ ఉందా?

రష్యా పౌరులు ఆంక్షల చట్రం, నిఘా నీడలో జీవిస్తారని పశ్చిమదేశాలు తరచూ ఆరోపిస్తుంటాయి. దీంతో పుతిన్‌ను ఇష్టపడే ఎన్నుకుంటున్నారా లేదంటే మరో ప్రత్యామ్నాయం లేక పుతిన్‌కు జై కొడుతున్నారా అనేది ఇతమిద్ధంగా ఎవరికీ తెలీదు. పుతిన్ పాపులారిటీ 80 శాతాన్ని దాటేసిందని అక్కడి ప్రభుత్వేతర ఎన్నికల మేథో సంస్థ 'ది లెవడా సెంటర్' ఇటీవల ప్రకటించింది. అయితే 2023 చివరి నుంచి దేశవ్యాప్తంగా పెరిగిన ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరవరలు ఎగిసిన నేపథ్యంలో పుతిన్ పాలనపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరిగాయని సంస్థ విశ్లేషించడం గమనార్హం. తనను వ్యతిరేకించే వాళ్లను పుతిన్ అస్సలు సహించలేడని పుతిన్‌కు గతంలో ప్రసంగాలు రాసి ఇచ్చిన అబ్బాస్ గలియమోవ్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్, జ్ఞానేశ్

కేంద్రం నోటిఫికేషన్

న్యూఢిల్లీ: నూతన ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌లను కేంద్రం నియమించింది. వీరి నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం కేంద్ర న్యాయ శాఖ విడుదలచేసింది. అంతకుముందు 212 పేర్లను సెర్చ్ కమిటీ ఎంపిక చేసి మోదీ నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్‌కు పంపించింది. కాగా, వీరి నియామక విధానాన్ని సంబంధిత సెలక్షన్ ప్యానెల్‌లో సభ్యుడైన కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి తప్పుబట్టారు. '' ఈ పేర్లను పరిశీలించాలంటూ 212 మంది పేర్ల జాబితాను గత రాత్రి నాకు ఇచ్చారు. తెల్లారితే సెలక్షన్ ప్యానెల్ చైర్మన్ మోదీ అధ్యక్షతన భేటీ ఉంది. రాత్రి ఇచ్చి మధ్యాహ్నంకల్లా 212 మందిలో ఎలక్షన్ కమిషనర్‌గా అర్హత ఉన్న వ్యక్తిని ఎంపికచేయడం మానవమాత్రులకు సాధ్యమా? బుధవారం ప్యానెల్ భేటీ జరగడానికి కేవలం 10 నిమిషాల ముందు తుది జాబితా అంటూ ఆరు పేర్లున్న లిస్ట్ ఇచ్చారు. ఈ తుది జాబితా నుంచి సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌ల పేర్లను ప్యానెల్‌లోని మెజారిటీ సభ్యులు ఖరారుచేశారు. అయితే ఈ ప్రతిపాదిత పేర్లలో ఈ ఇద్దరినే ఎందుకు ఎంపిక చేశారో నాకైతే అర్థంకాలేదు. సుప్రీంకోర్టు గత తీర్పు ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) ఈ ఎంపిక కమిటీలో ఉంటే బాగుండేది' అని అధీర్ అభిప్రాయపడ్డారు. ఈ ప్యానెల్‌లో మోదీ, అధీర్‌తోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సభ్యులుగా ఉన్నారు. ఎలక్షన్ కమిషనర్ అనూప్‌చంద్ర పాండే గత నెల 14వ తేదీన రిటైర్ కావడం, మరో ఎలక్షన్ కమిషనర్ అరుణ్ గోయెల్ హఠాత్తుగా రాజీనామా చేయడంతో ఎన్నికల సంఘంలో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి.

ఇద్దరూ 1988 బ్యాచ్ అధికారులే

ఎలక్షన్ కమిషనర్‌లుగా ఎంపికైన సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌లు 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు. సుఖ్‌బీర్ ఉత్తరాఖండ్ క్యాడర్ అధికారి కాగా, జ్ఞానేశ్ కేరళ క్యాడెర్ అధికారి. సుఖ్‌బీర్ గతంలో ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. అఖిలభారత సర్వీస్‌లోకి రాకముందు సుఖ్‌బీర్ అమృత్‌సర్‌లో ఎంబీబీఎస్ చదివారు. జ్ఞానేశ్ గతంలో కేంద్రంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా చేశారు. అమిత్ షా మంత్రిగా ఉన్న సహకార శాఖలోనూ కార్యదర్శిగా ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదాను కల్పించిన ఆర్టికల్ 370ని రద్దుచేయడంలో జ్ఞానేశ్ హోం శాఖలో పనిచేస్తూ కీలకపాత్ర పోషించారు. ఐఐటీ(కాన్పూర్) పట్టభద్రుడైన జ్ఞానేశ్ 2014లో ఢిల్లీలో కేరళ రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్నారు. నూతన ఎలక్షన్ కమిషనర్లను ఎంపికచేసేందుకు సీజేఐ, ప్రధాని, లోక్‌సభలో విపక్షనేతలతో సెలక్షన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని గత ఏడాది సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దీనికి అనుగుణంగా కేంద్రం చట్టం చేసింది. కానీ సీజేఐకి బదులు కేంద్ర మంత్రికి ప్యానెల్‌లో స్థానం కల్పించింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం కోర్టు విచారణ జరగనుంది.


జ్ఞానేశ్ కుమార్ సుఖ్‌బీర్ సంధూ

18 ఓటీటీలపై నిషేధం

సాక్షి, న్యూఢిల్లీ: అసభ్యకర, అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేసినందుకుగాను 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వాటికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయనున్నట్లు కేంద్రం గురువారం తెలిపింది. 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వీటికి సంబంధం ఉన్న 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలను దేశంలో ఇకపై ప్రజలకు అందుబాటులో ఉండవని పేర్కొంది. తొలగించే 10 యాప్‌లలో ఏడు గూగుల్ ప్లే స్టోర్, 3 యాపిల్ యాప్ స్టోర్‌లో ఉండేవి.

వేటుపడిన 18 ఓటీటీలివే..

డ్రీమ్స్ ఫిలిమ్స్, వూవీ, యెస్మా, అన్‌కట్ అడ్డా, ట్రీఫ్లిక్స్, ఎక్స్‌ప్రైమ్, నియోన్ ఎక్స్ వీఐపీ, బేషరమ్స్, హంటర్స్, రబ్బిట్, ఎక్స్‌ట్రామూడ్, న్యూఫ్లిక్స్, మూడ్ ఎక్స్, మోజోఫ్లిక్స్, హాట్ షాట్స్ వీఐపీ, ఫుగీ, చికూఫ్లిక్స్, ప్రైమ్‌ప్లే వంటి ఓటీటీ సోషల్ మీడియా ఖాతాలను తొలగించారు. తొలగించిన వాటిలో 12 ఫేస్‌బుక్ ఖాతాలు, 17 ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు, 16 ఎక్స్ ఖాతాలు, 12 యూట్యూబ్ ఖాతాలు సోషల్ మీడియా ద్వారా అశ్లీలతను ప్రసారం చేస్తున్నాయి.

సాగురైతుల అభివృద్ధే లక్ష్యం: రాహుల్ గాంధీ

నాసిక్: రైతుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా విపక్షాల 'ఇండియా' కూటమి పనిచేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ ప్రకటించారు. తమ కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే చేపట్టబోయే రైతు సంక్షేమ కార్యక్రమాలను రాహుల్ వివరించారు. గురువారం మహారాష్ట్రలో చాంద్‌వడ్‌లో రైతుర్యాలీలో ప్రసంగించారు. '' రైతన్నల ప్రయోజనాలే మాకు పరమావధి. వ్యవసాయాన్ని జీఎస్టీ పరిధి నుంచి తొలగిస్తాం. పంట బీమా పథకంలో సంస్కరణలు తెచ్చి రైతు అనుకూల విధానాలను ప్రవేశపెడతాం' అని అన్నారు.

అవినీతి నిర్మూలనే మా సిద్ధాంతం: మోదీ

న్యూఢిల్లీ: అవినీతి, దుష్పరిపాలన, జాతి వ్యతిరేక విధానాలే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అజెండా అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. అవినీతిని, బుజ్జగింపు రాజకీయాలను నిర్మూలించాలన్నదే తమ సిద్ధాంతమని అని తేల్చిచెప్పారు. ప్రజా సంక్షేమం ద్వారానే దేశ సంక్షేమం సాధ్యమని తాము విశ్వసిస్తున్నామని తెలిపారు. పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి పథకం లబ్ధిదారులతో ప్రధాని మోదీ గురువారం సమావేశమయ్యారు. ఈ పథకంతో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని వెల్లడించారు. వీధి వ్యాపారులకు బ్యాంకుల వడ్డీకే తక్కువ రుణ సదుపాయం లభిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటిదాకా 62 లక్షల మందికి రూ.11,000 కోట్లకుపైగా రుణాలు ఇచ్చినట్లు తెలియజేశారు.

రెండు దశల్లో 'జమిలి' ఎన్నికలు

- లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి..
- ఆ తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థలకు..
- కోవింద్ కమిటీ సిఫార్సులు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు నివేదిక సమర్పించిన కమిటీ


గురువారం రాష్ట్రపతి ముర్ముకు నివేదిక అందజేస్తున్న కోవింద్, చిత్రంలో అమిత్ షా

న్యూఢిల్లీ: 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై అధ్యయనం చేయడానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ తన నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించింది. రామ్‌నాథ్ కోవింద్‌తోపాటు కమిటీ సభ్యులైన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ ఎన్.కె.సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కాశ్యప్, లోక్‌సభలో మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును నివేదిక అందజేశారు. జమిలి ఎన్నికలపై 18,629 పేజీల ఈ నివేదికలో ఉన్నత స్థాయి కమిటీ కీలక సిఫార్సులు చేసింది. రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత 100 రోజుల్లోగా అన్ని రకాల స్థానిక సంస్థలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది. జమిలి ఎన్నికలతో అభివృద్ధి వేగవంతం అవతుందని, దేశానికి మేలు జరుగుతుందని ఉద్ఘాటించింది. ఈ ఎన్నికల కోసం కోవింద్ కమిటీ రాజ్యాంగానికి మొత్తం 18 సవరణలు సూచించింది.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే....

రామ్‌నాథ్ కోవింద్ కమిటీని 2023 సెప్టెంబర్ 23న కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ 191 రోజులపాటు విస్తృత పరిశోధన సాగించింది. భాగస్వామ్యపక్షాలు, నిపుణులతో సంప్రదింపులు జరిపింది. దక్షిణాఫ్రికా, స్వీడన్, బెల్జియం, జర్మనీ, జపాన్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, బెల్జియం తదితర దేశాల్లో అమల్లో ఉన్న జమిలి ఎన్నికల ప్రక్రియలను అధ్యయనం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే కోవింద్ కమిటీ సిఫార్సుల చేసిందని అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ సిఫార్సుల ప్రకారం రాజ్యాంగానికి కనిష్ఠ సవరణలతో జమిలి ఎన్నికలు నిర్వహించవచ్చని పేర్కొన్నాయి.

32 పార్టీల మద్దతు

జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను కోవింద్ కమిటీ సేకరించింది. అభిప్రాయం చెప్పాలంటూ 62 పార్టీలకు సూచించగా, 47 పార్టీలు స్పందించాయి. ఇందులో 32 పార్టీలు జమిలికి జైకొట్టాయి. 15 పార్టీలు వ్యతిరేకించాయి. మిగిలిన 15 పార్టీలు స్పందించలేదు. బీజేపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఏఐఏడీఎంకే, బిజూ జనతా దళ్, మిజో నేషనల్ ఫ్రంట్, శివసేన, జనతాదళ్(యూ), శిరోమణి అకాలీదళ్ తదితర పార్టీలు మద్దతు ప్రకటించగా, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, నాగా పీపుల్స్ ఫ్రంట్, సమాజ్‌వాదీ పార్టీ వంటివి వ్యతిరేకించాయి.

త్వరలో లా కమిషన్ నివేదిక

ఏకకాలంలో ఎన్నికలపై లా కమిషన్ త్వరలో తన నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది. 2029 నుంచి జమిలి ఎన్నికలు ప్రారంభించాని లా కమిషన్ సిఫార్సు చేయబోతున్నట్లు సమాచారం. లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని లా కమిషన్ సూచించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కోవింద్ కమిటీ సిఫార్సులు

- లోక్‌సభలో హంగ్, అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలు ఎదురైనప్పుడు మళ్లీ తాజాగా ఎన్నికలు నిర్వహించాలి. కొత్త సభను ఏర్పాటు చేయాలి.
- ఎన్నికలు జరిగి కొత్తగా కొలువుదీరిన లోక్‌సభ ఐదేళ్లు కొనసాగదు. అంతకంటే ముందున్న సభ గడువు ఎన్నాళ్లు మిగిలి ఉంటుందో అప్పటివరకు మాత్రమే కొత్త సభ మనుగడ సాగిస్తుంది.
- రాష్ట్రాల శాసనసభలు లోక్‌సభ కాల వ్యవధి ముగిసేవరకు(ముందుగా రద్దయితే తప్ప) పనిచేస్తాయి.
- జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 83(పార్లమెంట్ కాల వ్యవధి), ఆర్టికల్ 172(శాసనసభ కాల వ్యవధి)కు సవరణ చేయాలి.
- ఆర్టికల్ 83, ఆర్టికల్ 172కు సవరణ చేయడానికి రాష్ట్రాల అమోదం అవసరం లేదు.
- జమిలి ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాల ఎన్నికల సంఘాలతో సంప్రదించి ఒక ఉమ్మడి ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డులు రూపొందించాలి. ఇందుకోసం ఆర్టికల్ 325కి సవరణ చేయాల్సి ఉంటుంది.
- స్థానిక సంస్థలతో ఏకకాలంలో ఎన్నికల కోసం ఆర్టికల్ 324ఏను సవరించాలి.
- ఆర్టికల్ 325, ఆర్టికల్ 324ఏకు సవరణ చేయాలంటే రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతిఏటా ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడుతోంది. విలువైన సమయం వృథా అవుతోంది. జమిలి ఎన్నికలతో ఇలాంటి సమస్యలు పరిష్కరించవచ్చు.
- జమిలి ఎన్నికల కోసం ప్రభుత్వం ఒక పటిష్టమైన చట్టబద్ధ యంత్రాంగాన్ని రూపొందించాలి.

ఉద్యమం మరింత ఉధృతం

- కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌లో రైతుసంఘాల తీర్మానం
- ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌కు పోటెత్తిన రైతన్నలు

న్యూఢిల్లీ: రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఇందుకు ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో గురువారం జరిగిన 'కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్' వేదికైంది. ఈ మహాపంచాయత్‌కు భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చారు. 2021లో ఢిల్లీ సరిహద్దుల వెంట నెలల తరబడి ఉద్యమం, కేంద్రం తలొగ్గి వివాదాస్పద మూడు సాగు చట్టాలను ఉపసంహరించుకున్నాక ఢిల్లీలో జరిగిన అతిపెద్ద రైతు సభ ఇదే కావడం విశేషం. సాగు, ఆహారభద్రత, సాగుభూమి, రైతు జీవనం పరిరక్షణే పరమావధిగా, మోదీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలంటూ చేసిన తీర్మానాన్ని రైతు సంఘాలు ఆమోదించాయి. రైతు సంఘాల ఉమ్మడి వేదిక అయిన సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) అధ్వర్యంలో ఈ భారీసభ జరిగింది. ట్రాక్టర్లు తీసుకురావద్దని, శాంతియుత సమావేశానికి పోలీసులు అనుమతి ఇవ్వడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే లోక్‌సభ ఎన్నికల పూర్తయ్యేదాకా తమ ఉద్యమం కొనసాగిస్తామని రైతులు తీర్మానంలో స్పష్టంచేశారు. 'ఈ ఉద్యమం ఆగదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా విస్తరిస్తుంది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మాతో చర్చించాల్సిందే' అని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ అన్నారు.


గురువారం ఢిల్లీలో జరిగిన మహాపంచాయత్‌కు భారీగా హాజరైన రైతులు

రాజ్యసభ ఎంపీగా సుధా మూర్తి ప్రమాణం



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్‌పర్సన్ సుధా మూర్తి(73) గురువారం రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హౌస్‌లోని తన చాంబర్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రమాణం చేయించారు. ఆమె కన్నడ భాషలో ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సుధా మూర్తి భర్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తితోపాటు రాజ్యసభలో అధికార పక్ష నేత పీయూష్ గోయెల్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమెను 2006లో పద్మ శ్రీ, 2023లో పద్మ భూషణ్ పురస్కారాలతో గౌరవించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గత వారం కేంద్రం ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసిన విషయం తెలిసిందే.

ఉల్లి ఎగుమతులపై జూన్ దాకా నిషేధం?

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయంగా ఉల్లి ధరల్లో తగ్గుదల కనిపించని కారణంగా వాటి ఎగుమతులపై ప్రస్తుతం కొనసాగుతున్న నిషేధాన్ని మరింతకాలం పొడిగించాలని కేంద్రం యోచిస్తోంది. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మార్చి 31 వరకు విధించిన నిషేధాన్ని జూన్ వరకు కొనసాగించే అవకాశాలున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత దేశీయ రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధర సగటున కిలో రూ.34 మేర ఉంది. ఇది గతేడాది ధరలతో పోలిస్తే 41 శాతం ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ పొడిగింపు అనివార్యమని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

మమతకు తీవ్రగాయాలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నుదుటికి తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో చేరారు. గురువారం సాయంత్రం ఒక కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మమత కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న తన సొంతింటికి చేరుకున్నారు. ఇంట్లో పడిపోవడంతో ఆమె నుదుటికి గట్టి దెబ్బతగిలిందని మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ చెప్పారు. తీవ్రంగా రక్తస్రావం అవుతుండటంతో వెంటనే ఎస్ఎస్‌కేఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. మమత త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

బెంగళూరు హోటల్లో ఉజ్బెక్ మహిళ హత్య

బనశంకరి: బెంగళూరులోని ఓ హోటల్‌లో విదేశీ మహిళ హత్యకు గురయ్యారు. శేషాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి వెలుగుచూసింది. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జరీనా (37) వ్యాపార వీసాపై నాలుగు రోజుల క్రితం బెంగళూరుకు వచ్చారు. బుధవారం మధ్యాహ్నం శేషాద్రిపురంలో ఓ హోటల్ రెండో అంతస్తు గదిలో బస చేశారు. బుధవారం రాత్రి 10:30 గంటలైనా ఆమె బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హోటల్ సిబ్బంది మాస్టర్ కీ ద్వారా తెలుపు తెరిచారు. లోపల చూడగా జరీనా విగతజీవిగా కనిపించారు. వారిచ్చిన సమాచారంతో పోలీసులు ఆధారాలు సేకరించి, సీసీ ఫుటేజీ, సెల్ కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎవరో గొంతు నులిమి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

యుద్ధ ట్యాంక్‌ను నడిపిన కిమ్

సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ స్వయంగా ట్యాంకును నడిపారు. బుధవారం ఆయన దేశ సైనిక దళాల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. యుద్ధానికి సిద్ధం అయ్యేందుకు పెద్ద ప్రయత్నాలు చేయాలని సేనలకు పిలుపునిచ్చారు. అధికార వార్తా సంస్థ(కేసీఎన్ఏ) గురువారం ఈ విషయం వెల్లడించింది. పొరుగుదేశం దక్షిణ కొరియా, అమెరికా 11 రోజులుగా కొనసాగిస్తున్న భారీ సైనిక విన్యాసాలు గురువారంతో ముగియనున్నాయి. అందుకు బదులుగా అన్నట్లు కిమ్ యుద్ధ ట్యాంకుల పోరాట సన్నద్ధతను పరిశీలించారు.

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ.. పట్టుబడ్డ భారతీయులు

వాషింగ్టన్: కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ముగ్గురు భారతీయులు సహా నలుగురు అక్కడి అధికారులకు పట్టుబడ్డారు. కెనడాలో గూడ్స్ రైలెక్కిన వీరు ఈ నెల 12న సరిహద్దులు దాటాక బఫెలో నగరంలోని ఇంటర్నేషనల్ రైల్‌రోడ్ బ్రిడ్జి వద్ద కదులుతున్న రైలు నుంచి కిందికి దూకారు. ఆ క్రమంలో నలుగురిలో ఒక మహిళ గాయపడింది. ఆమెతోపాటు మిగతా ముగ్గురినీ అనంతరం సరిహద్దు గస్తీ సిబ్బంది పట్టుకున్నారు. వీరు ఎలాంటి పత్రాలు లేని అమెరికాయేతర పౌరులని చెప్పారు. ఇందులో మహిళ, మరో ఇద్దరు వ్యక్తులు భారతీయ పౌరులు కాగా, నాలుగో వ్యక్తిని డొమినికల్ రిపబ్లిక్ దేశస్తుడిగా గుర్తించామన్నారు.

ఎమ్మెల్సీలుగా నితీశ్, రబ్డీ దేవి ఏకగ్రీవం

పట్నా: బిహార్ శాసనమండలి సభ్యులుగా సీఎం నితీశ్ కుమార్, మాజీ సీఎం రబ్డీ దేవి సహా 10 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్జేడీకి చెందిన రబ్డీ దేవి శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. కేబినెట్ మంత్రి సంతోష్ సుమన్ కూడా మండలికి ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. జేడీయూ చీఫ్ కూడా అయిన నితీశ్ కుమార్ గురువారం పార్టీ నాయకులతో శాసనమండలి సెక్రటేరియట్‌కు చేరుకుని ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

పంజాబ్‌లో 8 మందితో ఆప్ తొలి జాబితా

చండీగఢ్: రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను పంజాబ్‌కు సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 8 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన మొదటి జాబితాను గురువారం ప్రకటించింది. వీరిలో అయిదుగురు కేబినెట్ మంత్రులు కావడం గమనార్హం. ఇటీవలే కాంగ్రెస్ నుంచి ఆప్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే, పంజాబీ నటుడు బస్సీ పఠానా గుర్‌ప్రీత్ సింగ్ కూడా ఉన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఆప్ భాగస్వామి అయినప్పటికీ పంజాబ్‌లో మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తోంది. ప్రస్తుత లోక్‌సభలో పంజాబ్ నుంచి ఆప్‌కు 13 మంది సభ్యులున్నారు.

ఆస్పత్రిలో చేరిన ప్రతిభా పాటిల్

పుణె: మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్(89) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. జ్వరం, ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆమె బుధవారం పుణెలోని భారతి ఆస్పత్రిలో చేరారు. ఆమె ఆరోగ్య నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు గురువారం వెల్లడించాయి. ఆమెకు చికిత్స అందిస్తున్నామని, వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపాయి. దేశ మొట్టమొదటి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్ 2007 నుంచి 2012 సంవత్సరాల మధ్య పనిచేశారు.

బీజేపీలో చేరిన పంజాబ్ మాజీ సీఎం భార్య

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్ భార్య, ఎంపీ ప్రణీత్ కౌర్ గురువారం బీజేపీలో చేరారు. పంజాబ్‌లోని పటియాలా స్థానం నుంచి నాలుగు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన ఆమె కేంద్ర మంత్రిగానూ పనిచేశారు. అమరీందర్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరాక.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ప్రణీత్ కౌర్‌ను గత ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతల సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వం, పదేళ్లుగా మోదీ ప్రభుత్వం చేస్తున్న పనులు నచ్చి బీజేపీలో చేరినట్లు చెప్పుకున్నారు. బీజేపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందని మీడియాతో ప్రణీత్ కౌర్ అన్నారు.

శరద్ పవార్ పేరును వాడుకోరాదు

ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ పేరును, ఆయన ఫొటోలను రాజకీయ ప్రయోజనాల కోసం అజిత్ పవార్ వర్గం వాడుకోరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. తనకున్న పలుకుబడిని ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం దుర్వినియోగం చేస్తోందంటూ శరద్ పవార్ వేసిన పిటిషన్‌పై గురువారం అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. శరద్ పవార్ తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వీ చేసిన వాదనలపై స్పందించిన న్యాయస్థానం పైవిధంగా వ్యాఖ్యానించింది. వేరుగా ఉండాలనుకున్నప్పుడు సొంత గుర్తింపును మాత్రమే వాడుకోవాలని ధర్మాసనం అజిత్ పవార్ వర్గానికి స్పష్టం చేసింది. ఈ విషయమై తగు సమాధానం ఇవ్వాలని అజిత్ వర్గాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.



మడిచేశారు

గురువారం బెళగావిలో.. కన్నడలో లేని షాపుల బోర్డులను, ఫ్లెక్సీలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించిన దృశ్యం

న్యూస్‌రీల్

చెత్తకుప్పలో శిశువు మృతదేహం



విగతజీవిగా పసికందు

బాగేపల్లి: అప్పుడే మృతి చెందిన పసిగుడ్డును ఓ కసాయి తల్లి చెత్తకుప్పలో విసిరివేసిన విషాదఘటన బాగేపల్లి తాలూకా కానగమాకలపల్లి గ్రామంలో గురువారం ఉదయం వెలుగుచూసింది. చెత్తకుప్పలో శిశువు మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని పరిశీలించారు. ఎనిమిది నెలల మగ శిశువును ఒక బ్యాగులో చుట్టి చెత్తలో పడేశారు. చనిపోయాక పడేశారా, లేక బతికి ఉండగానే వదిలేయడం వల్ల చనిపోయాడా? అనే సందేహాలూ ఉన్నాయి. బాగేపల్లి పోలీసులు శిశువు మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలించారు.

లంచగొండి అధికారుల అరెస్టు

మైసూరు: రిటైర్డు ఉపాధ్యాయుని నుంచి లంచం తీసుకుంటూ చామరాజగర జిల్లా హనూరు విద్యాశాఖాధికారి శివరాజు, సీఆర్‌పి మునిరాజు లోకాయుక్తకు చిక్కారు. వివరాలు.. హనూరు తాలుకాలో తోమియార్ పాళ్యకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ 139 రోజుల వేతనం బాకీ ఉండడంతో మంజూరు చేయాలని పై అధికారులను కోరారు. ఇందుకు వారు రూ. 15 వేలు ముట్టజెబితే చేస్తామని తెలిపారు. లంచం విషయమై బాధితుడు లోకాయుక్తకు సమాచారమిచ్చాడు. విద్యాశాఖాధికారి కార్యాలయంలో శివకుమార్ నుంచి లంచం తీసుకుంటుండగా శివరాజును, మునిరాజును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ఎన్నికల తరువాత నీటి బిల్లుల పెంపు: డీసీఎం

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల తరువాత బెంగళూరులో జలమండలి నీటి చార్జీలను పెంచుతామని డీసీఎం డీ.కే.శివకుమార్ తెలిపారు. గురువారం విధానసౌధలో నీటి పొదుపు పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత 10–11 సంవత్సరాల నుండి నీటి ధరలను పెంచలేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. భూగర్భ జల రక్షణ, నీటి పొదుపుపై జాగృతిని ప్రారంభించామన్నారు. బెంగళూరు ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూస్తున్నాం. 6,900 బోర్‌వెల్‌లు ఖాళీ అయ్యాయి. ఉన్న 7000 బోర్‌వెల్‌ల ద్వారా నీరు సరఫరా అవుతోంది. ట్యాంకర్‌లను స్వాధీనం చేసుకొని అక్రమ నీటి సరఫరాను అరికట్టాం, అయినా కూడా నీటి కొరత ఉందని చెబుతున్నారని వాపోయారు. తమిళనాడుకు కావేరి నీరు విడుదల చేస్తున్నారనేది వదంతి మాత్రమే అన్నారు.

యల్లమ్మదేవి జాతర



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి నియోజకవర్గం హొంగసంద్రలో ప్రసిద్ధ యల్లమ్మదేవి జాతర వేడుకలు ఘనంగా ప్రారంభం కావడం జరిగింది. గురువారం ఉదయం నుంచి అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానంలో ఎమ్మెల్యే భోజనం ఆరగించారు. స్థానికులు బాబు రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపాలు అంటుకుని బాలికకు తీవ్ర గాయాలు



గాయపడిన చిన్నారి (ఫైల్)

తుమకూరు: మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల నుంచి బయటకు వచ్చిన ఓ చిన్నారి ప్రమాదశాత్తు మంటల్లో గాయపడింది. గ్రామానికి చెందిన విరుపాక్షి, లక్ష్మీ దంపతుల ఆరేళ్ల కుమార్తె దీక్ష తీవ్రంగా గాయపడింది. దీక్ష తన ముగ్గురు స్నేహితులతో కలిసి సమీపంలోని ఆలయం వద్దకు వచ్చింది. అక్కడ దీపాలు వెలిగించి ఉన్నారు. ఇది గుర్తించని బాలిక వాటికి సమీపంలోకి వెళ్లడంతో నైలాన్ దుస్తులు అంటుకున్నాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే గుర్తించిన అక్కడ ఉన్న వారు మంటలను ఆర్పి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరు విక్టోరియాకు తరలించారు.

మెట్రో రైల్ మూడో దశకు ఓకే

- ఎస్‌ఐ స్కాంపై సిట్‌తో దర్యాప్తు
- సౌధ ఆవరణలో భువనేశ్వరి మాత విగ్రహం
- మంత్రిమండలి భేటీలో నిర్ణయాలు



మెట్రో మూడో దశ అమలైతే మరిన్ని ప్రాంతాలకు రైలు సేవలు

బనశంకరి: ఎస్‌ఐ ఉద్యోగాల స్కాం విచారణకు సిట్ ఏర్పాటు, విధానసౌధ ఆవరణలో భువనేశ్వరి మాత విగ్రహం, బెంగళూరులో మెట్రో రైలు మూడో దశకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గురువారం విధానసౌధలో సీఎం సిద్దరామయ్య ఆధ్వర్యంలో మంత్రిమండలి సమావేశం జరిగింది. మూడుగంటల పాటు పలు అంశాలపై చర్చించారు. ఆ వివరాలను రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ మీడియాకు వివరించారు. ముఖ్యమైన విశేషాలు...

రూ.15 వేల కోట్లతో థర్డ్ ఫేజ్

- విధానసౌధ ఆవరణలో రూ.23 కోట్ల వ్యయంతో కన్నడ మాత భువనేశ్వరి విగ్రహం ఏర్పాటు.
- బెంగళూరులో ట్రాఫిక్ రద్దీకి పరిష్కారంగా మెట్రో రైలు మూడో దశ నిర్మాణానికి ఓకే. ఇందుకు రూ.15,611 కోట్లు వ్యయమవుతుంది. ఫేజ్–3 కింద కొత్త మార్గాల నిర్మాణంతో పాటు ఉన్న మార్గాలను మరింత దూరం పొడిగిస్తారు. దీని వల్ల అనేక ప్రాంతాలకు మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.
- ఎస్‌ఐ రాత పరీక్షల కుంభకోణంలో విశ్రాంత జడ్జి బీ.వీరప్ప నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయగా, ఆ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులు, దళారులు కలిసి 113 మంది ఈ స్కాంలో పాల్పంచుకున్నారు. కమిటీ సలహా మేరకు సిట్‌తో దర్యాప్తు చేయాలని తీర్మానం.
- కళ్యాణ కర్ణాటక పరిధిలో 7 జిల్లాల్లో కొత్తగా 33 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం. కడబలో వెటర్నరీ కాలేజీ అభివృద్ధి. మైసూరులోని మహరాణి కాలేజీలో కొత్త హాస్టల్ ఏర్పాటు.
- బెంగళూరులో రూ.67 కోట్లతో అగ్రి ఇన్నోవేషన్ సెంటర్ నిర్మాణం. వ్యవసాయ అభివృద్ధికి ఇది దోహదపడుతుంది.
- కేఆర్.పురం ఎన్‌జీఎఫ్‌లో 65 ఎకరాల స్థలం ఉంది. ఆ స్థలంలో రూ. 11 కోట్లతో బృహత్ ఉద్యానవనం, సైకిల్ ట్రాక్, క్రీడా మైదానం ఏర్పాటు.

కెఫే పేలుడుకు నాలుగేళ్ల కిందటే కుట్ర?

బనశంకరి: బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడు కేసులో ముఖ్యమైన సమాచారం వెలుగులోకి వచ్చింది. నగరంలోని సుద్దగుంటెపాళ్య కేసులో అనుమానిత ఉగ్రవాదులే నాలుగేళ్ల క్రితం ఈ పేలుడుకు కుట్ర చేశారని బహిర్గతమైంది. అనుమానితులకు ప్రముఖ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో సంబంధాలు ఉన్నట్లు అనుమానాలున్నాయి. అల్ హింద్ అనే మాడ్యూల్‌లోని ఉగ్రవాదులు ఒక వర్గం నేతలను మట్టుబెట్టాలని, అలాగే రామేశ్వరం కెఫేలో భారీ పేలుడు సృష్టించి ప్రాణనష్టం చేయాలని ప్లాన్ రూపొందించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నాలుగేళ్ల క్రితమే ఈ కుట్రను పోలీసులు పసిగట్టి విఫలం చేశారు. సుద్దగుంటెపాళ్యలో కొందరు అల్ హింద్ మాడ్యూల్ సభ్యులని అరెస్టు చేయగా, మాస్టర్‌మైండ్ మతీన్, సయ్యద్ అలీ పారిపోయారు. ఇంతలో మరో మాడ్యూల్ ఈ పేలుడుకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మరోవైపు రామేశ్వరం కెఫే పేలుడు కేసులో బాంబు పెట్టిన వ్యక్తి కోసం ఎన్‌ఐఏ, పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. బళ్లారిలో అనుమానితులను ఎన్‌ఐఏ ప్రశ్నిస్తోంది.

అభ్యర్థుల ఎంపిక బాగుంది



దావణగెరెలో తమ నేతకు టికెట్ దక్కలేని ఓ అభిమాని డీజిల్ పోసుకోగా, నీళ్లు చల్లిన దృశ్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులను హైకమాండ్‌వారు అందరితో చర్చించి ఎంపిక చేశారు. ఎవరో ఒకరు కూర్చొని ఈ పని చేయలేదు అని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర చెప్పారు. గురువారం నగరంలో బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కోసం నాయకత్వం అన్ని నియోజకవర్గాలకు పరిశీలకులను పంపించి కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను ఆలకించింది. రాష్ట్రంలో కోర్ కమిటీ భేటీలో చర్చించారు. ఒక నియోజకవర్గానికి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల పేర్లను సిఫార్సు చేశాము. ఉత్తమ అభ్యర్థులను ఎంపిక చేయడం సంతోషకరం. అన్ని 28 నియోజకవర్గాల్లో బీజేపీ–జేడీఎస్ మిత్ర కూటమి గెలుస్తుంది అని అన్నారు. కొన్నిచోట్ల కొత్త ముఖాలకు, బీసీలకు ప్రాధాన్యత కల్పించారు. చిన్నపాటి అసంతృప్తులు ఉండవచ్చు. రానున్న రోజుల్లో అవన్నీ కూడా సరిపోతాయి అని అన్నారు. కలసికట్టుగా ఎన్నికల్లో పనిచేస్తామన్నారు. ఈ భేటీలో మాజీ సీఎం బసవరాజ బొమ్మై, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, సీటీ రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇతర పార్టీలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు విశ్వనాథ్ పాటిల్, వై.టీ. రాజేశ్, బాబురావు చౌహాన్, శశిధర్ హిరోగార్‌లు బీజేపీలో చేరారు.

అసంతృప్తి సెగలు

మరోవైపు టికెట్లు ఆశించి భంగపడ్డ నేతలు అసంతృప్తికి లోనయ్యారు. మైసూరులో ప్రతాపసింహ అభిమానులు కినుక వహించారు. దావణగెరెలో మాజీ మంత్రి ఎస్‌ఏ రవీంద్రనాథ్‌కు టికెట్ రాలేదని అభిమాని డీజిల్ పోసుకుని నిప్పంటించుకోబోయాడు.

తల్లి లేని బాలిక, రాకాసి పెద్దమ్మ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక



నంజమ్మ, బసవరాజు, బాధితురాలు

- చెల్లి కూతురికి ఇస్త్రీ పెట్టెతో వాతలు
- బ్యాంకులోని డబ్బు కోసం అకృత్యం

తుమకూరు: తల్లి లేని బాలికను ఆదరించాల్సింది పోయి ఆస్తిపై మోజుతో ఇస్త్రీ పెట్టెతో వాతలు పెడుతూ తీవ్రంగా గాయపరిచిందో కిరాతకురాలు. ఆమె సొంత పెద్దమ్మ కావడం గమనార్హం. బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

వివరాలు.. తుమకూరు తాలూకా దొడ్డేరి దగ్గర పూజారహళ్ళి గ్రామంలో రంగనాథ్ కుమార్తె సరస్వతి (10). బాలిక తల్లి చనిపోవడమంతో పావగడ ఏపీలోని మడకశిర తాలూకాలోని నిద్రఘట్ట గ్రామంలోని పెద్దమ్మ నంజమ్మ (45) ఇంటికి పంపించారు. రంగనాథ్ గతంలో పొలం అమ్మడంతో వచ్చిన డబ్బును భార్య, బాలిక ఇద్దరి పేరుతో బ్యాంకులో జాయింట్ ఖాతాలో ఉంచాడు. నంజమ్మ, కొడుకు బసవరాజు ఆ డబ్బుపై కన్నేసి బాలికను వేధించసాగారు. ఆస్తి పేపర్లపై సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయగా బాలిక ఒప్పుకోలేదు. మా నాన్న, అమ్మమ్మ చెబితేనే సంతకం చేస్తాననడంతో నంజమ్మ, బసవరాజు రగిలిపోయారు. ఇంట్లోని ఇస్త్రీ పెట్టెను తీసుకుని బాలిక కాలు, తొడకు వాతలు పెట్టారు.

మధుగిరి ఆస్పత్రిలో చికిత్స

తీవ్రంగా గాయపడిన బాలికను ఇంట్లో గదిలో బంధించి బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. పాఠశాల ఉపాధ్యాయుడు తండ్రి రంగనాథ్‌కు ఫోన్ చేసి పరీక్షలు జరుగుతున్నాయని, బాలికను పంపాలని చెప్పాడు. బాలిక తండ్రి నంజమ్మకు ఫోన్ చేసి బాలికను ఇంటికి పంపాలని కోరాడు. బాలికకు నడవడానికి కూడా చేతకాకపోవడంతో మధుగిరి ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి సిబ్బంది విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక నుంచి మధుగిరి పోలీసులు ఫిర్యాదు తీసుకుని పెద్దమ్మ, కొడుకుపై కేసు నమోదు చేశారు. జిల్లా శిశుసంక్షేమ సంఘం సభ్యులు బాలికను పరామర్శించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మైసూరు: అప్పుల వారి బాధను తట్టుకోలేక రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లాలోని హెచ్‌డి కోటె తాలూకాలోని యలవత్తూరు గ్రామంలో జరిగింది. గ్రామవాసి మాలెగౌడ (60) ఒకటిన్నర ఎకరా పొలంలో సేద్యానికి, ఇద్దరు కూతుళ్ల పెళ్లికి వివిధ ఫైనాన్స్ సంస్థల్లో లక్షల్లో అప్పులు చేశాడు. పంటల సరిగా పండక, అప్పులు తీర్చలేకపోయాడు. మరోవైపు రుణదాతలు అప్పులు కట్టాలని ఒత్తిడి చేయసాగారు. దీంతో రైతు పురుగల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నారు. అంతరసంత పోలీసులు కేసు నమోదు చేశారు.

దళితుల కాగడాల ర్యాలీ



కాగడాల ప్రదర్శన

గౌరిబిదనూరు: తాలూకాలో హక్కి పిక్కి కాలనీలో నర్లహళ్ళి వాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణంలో ఎంజీ సర్కిల్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో దళితులు పాల్గొన్నారు. తాలూకాలో దళితులను అధికారులు పట్టించుకోవడం లేదని, 5 రోజుల నుంచి ధర్నా చేస్తున్నా తాలూకా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు.

పరీక్షలకు భయపడి యువకుడు బలవన్మరణం

దొడ్డబళ్లాపురం: పరీక్షలకు భయపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దొడ్డ తాలూకా మజరాహొసహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. జగదీష్ (28) ఆత్మహత్య చేసుకున్న యువకుడు. ఈనెల 12న ఇంట్లో జగదీష్ ఒక్కడిని వదిలి కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన వారికి జగదీష్ ఇంట్లో ఒక గదిలో ఉరి వేసుకుని శవంగా కనిపించాడు. జగదీష్ ఎంఎడ్ చదువుతుండగా పరీక్షల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు డెత్‌నోట్ రాశాడు. దొడ్డ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చిక్కమగళూరులో వర్షం



యశవంతపుర: రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కరవు పరిస్థితి ఏర్పడి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ఎండలు మండుతుండగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి అమ్మో అంటున్నారు. ఇంతలో కాఫీనాడు చిక్కమగళూరు జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం జల్లు వర్షం కురిసి చల్లని వాతావారణం ఏర్పడింది. ముత్తోడి, కొళగామె, మేలిన హుళువత్తితో పాటు అనేక గ్రామాలలో వర్షం కురిసింది. మండుతున్న ఎండల మధ్య వర్షం కురవటంతో ప్రజల్లో ఆనందం కలిగించింది.

ఓట్లు చీలకుండా సర్దుబాటు?

- అమిత్ షాతో గాలి జనార్దనరెడ్డి భేటీ



అమిత్‌షాను కలిసిన గాలి జనార్దనరెడ్డి

సాక్షి,బళ్లారి: గురువారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షాతో కేఆర్‌పీపీ అధ్యక్షుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాల్లో పోటీ చేస్తామని జనార్దనరెడ్డి ఇది వరకే ప్రకటించారు. దీని వల్ల ఓట్లు చీలి బీజేపీ నష్టపోయే ప్రమాదం ఉండడంతో అమిత్ షా చర్చలకు పిలిచినట్లు సమాచారం. బళ్లారి, రాయచూరు, కొప్పళ తదితర 8 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి నష్టం జరగకుండా చూడాలని చర్చించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అమిత్‌షాను కలవడం చర్చకు దారి తీసింది. ఢిల్లీలో షాను కలిసిన విషయాన్ని జనార్దన్‌రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మరోవైపు గంగావతి నియోజకవర్గం ఉన్న కొప్పళలో సిట్టింగ్ బీజేపీ ఎంపీ కరడి సంగణ్ణకు టికెట్ నిరాకరించడంతో రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

ఆడ శిశువులను కాపాడాలి





మహిళలను సన్మానించిన దృశ్యం

మండ్య: ఎన్ని చట్టాలు వచ్చినా ఎన్ని కఠినమైన చర్యలు తీసుకున్నా గర్భంలోనే ఆడశిశువులను హత్య చేస్తున్నారు తప్ప సంరక్షించడం లేదు. వీటిని అరికట్టడానికి అందరం కలిసి పోరాటం చేయాలని జిల్లా న్యాయసేవల ప్రాధికార సభ్యురాలు, కార్యదర్శి ఎ. వాణి శెట్టి అన్నారు. మండ్య జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో తాలూకాలోని బీ.హొసూరు కాలనీలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పలురంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. ఆడశిశు భ్రూణ హత్యలు జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆమె వాపోయారు. ఇది చాలా పాపమని, ఆడపిల్లల సంఖ్య చాలా తగ్గిపోతోందని తెలిపారు. దీనివల్ల మనకే ఇబ్బందులని, ఆడ పిల్లల సంఖ్య తగ్గితే సామాజిక సంక్షోభం వస్తుందని చెప్పారు. ఆడ శిశు సంరక్షణ గురించి ప్రజల్లో జాగృతి కలిపించాలని తెలిపారు.

షేర్లు.. రూ.1.29 కోట్లకు తూట్లు

- ఐటీ సిటీలో బడా సైబర్ నేరం
- పోలీసులకు బాధితుని ఫిర్యాదు
- మరో మహిళా టెక్కీకి రూ. 86 లక్షల మోసం





ఆన్‌లైన్ మోసగాళ్ల బారినపడి నగరవాసులు విలవిల

బనశంకరి: సిలికాన్ సిటీలో సైబర్ కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. విద్యావంతులు, ఐటీ బీటీ ఉద్యోగులను టార్గెట్‌గా చేసుకుని భారీ ఎత్తున స్వాహా చేస్తున్నారు. ఇదే పంథాలో షేరు మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభం ఇస్తామని ప్రలోభపెట్టి 37 రోజుల్లో రూ.1.29 కోట్లను సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. ఈ ఘటనలో బాధితుడు నగరంలోని సర్జాపుర చిక్కనాయనహళ్లి వాసి.

వివరాలు.. జనవరి 19 తేదీన బాధితున్ని కేకేఆర్ స్టాక్ ఇన్వెస్టిమెంట్ గ్రూప్ అనే వాట్సాప్ గ్రూప్‌లో దుండగులు చేర్చారు. తరువాత అక్షయ్, అనురాగ్ ఠాగూర్ అనే వ్యక్తులు కేకేఆర్ యాప్ లింక్ పంపించి నమోదు చేసుకోవాలని సూచించారు. అలా బాధితుడు రూ.999 చెల్లించి గ్రూప్‌లో చేరాడు. షేర్లు కొనుగోలు చేస్తుంటే అధిక లాభం వస్తుందని మోసగాళ్లు చెప్పడంతో అలాగేనని యాప్ ద్వారా షేర్లు కొనుగోలు చేశాడు. మీరు కొన్న షేర్లకు దండిగా లాభాలు వచ్చాయని మోసగాళ్లు నకిలీ లెక్కలు చూపించడంతో బాధితుడు పొంగిపోయాడు. పలు విడతల్లో 37 రోజుల్లో రూ.1.29 కోట్లు పెట్టుబడి పెట్టాడు. తరువాత పెట్టుబడి వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో మోసగాళ్లను ప్రశ్నించగా, మరింత పెట్టుబడి పెడితే విత్‌డ్రా చేసుకోవడం సులభమని చెప్పారు. తానిక పెట్టుబడి పెట్టనని, డబ్బులు ఇచ్చేయాలని కోరగా, స్పందన లేదు. వంచనకు గురైనట్లు గుర్తించి వైట్‌ఫీల్డ్ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వంచకుల కోసం గాలిస్తున్నారు.



మహిళా టెక్కీకి భారీగా టోకరా

ఇంటి నుంచి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయవచ్చని మహిళా టెక్కీని నమ్మించిన సైబర్ దొంగలు రూ.86 లక్షలను కొట్టేశారు. మారతహళ్లికి చెందిన 33 ఏళ్ల మహిళా టెక్కీ బాధితురాలు. గత డిసెంబరులో ఆమె మొబైల్‌కు ఒక మెసేజ్ వచ్చింది. గూగుల్‌లో కొన్ని వస్తువులకు లైక్, షేర్ చేస్తే దండిగా డబ్బు వస్తుందని నమ్మించారు. ఆశపడిన టెక్కీ సరేనంది. ఆమె మొబైల్‌కు ఒక లింక్‌ను పంపి నమోదు చేసుకోవాలన్నారు. కొన్ని టాస్కులు చేశాక ఆమె బ్యాంకు ఖాతాలోకి కొంత నగదు పంపించారు. మా కంపెనీలో పెట్టుబడి పెడితే భారీ లాభం వస్తుందని ప్రలోభపెట్టారు. దురాశకు పోయిన మహిళా టెక్కీ దశలవారీగా వంచకుల ఖాతాల్లోకి రూ.86 లక్షలను జమచేసింది. ఆమె ఇటీవల డ్రా చేయడానికి యత్నించగా యాప్ పనిచేయలేదు. దుండగుల ఫోన్లు స్విచాఫ్ అయ్యాయి. బాధితురాలు లబోదిబోమంటూ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పల్టీలు కొట్టిన కారు

- ఐదుగురికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు

మండ్య: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి పల్టీలు కొట్టిన ప్రమాదం మండ్య జిల్లాలోని శ్రీరంగ పట్టణం తాలూకాలోని గణంగూరు వద్ద జరిగింది. గురువారం సాయంత్రం మైసూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు హైవే పక్కన సర్వీస్ రోడ్డులో వేగంగా వెళ్తున్న సమయంలో నియంత్రణ తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. పల్టీలు కొడుతూ గుంతలోకి పడిపోయింది. ఈ ఘటనలో కారు బాగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్న ఐదుమంది చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. స్థానికులు బాధితులను బయటకు తీసి మండ్యలోని మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. శ్రీరంగపట్టణ రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు సింధనూరు రైల్వేస్టేషన్ ప్రారంభం



విద్యుద్దీపాలంకరణలో రైల్వేస్టేషన్

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరు రైల్వేస్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించను న్నారు. రాయచూరు జిల్లా సింధనూరుకు కొప్పళ జిల్లా కారటగి నుంచి ఇటీవల మూడు బోగీలున్న రైలు ఇంజన్‌తో నిర్వహించిన ట్రాక్ పరీక్ష విజయవంతం కావడంతో రైల్వే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ పనులను పూర్తి చేశారు. ప్రతిపాదిత మునిరాబాద్–మహబూబ్ నగర్ మధ్య నిర్మిస్తున్న రైలుమార్గం పనుల్లో ప్రస్తుతం సింధనూరు వరకు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఇకపై కారటగి వరకు నడుస్తున్న రైళ్లను సింధనూరు వరకు పొడిగించారు. ఈనేపథ్యంలో కొత్త రైల్వేస్టేషన్‌ను, రైళ్ల సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా, రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ స్థానికంగా ప్రారంభిస్తారని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబురావ్ వెల్లడించారు.

యువతి అదృశ్యం

హుబ్లీ: ముంబైకు చెందిన యువకుడిని ప్రేమించిన ఓ యువతి లేఖ రాసిపెట్టి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన హుబ్లీ నగరంలోని కమరిపేటలో చోటు చేసుకుంది. ముంబై యువకుడిని ప్రేమిస్తున్నానని, అందుకే ఇల్లు విడిచి వెళుతున్నానని, తనను క్షమించండని లెటర్‌లో రాసి కనబడకుండా పోయిందని, కుమార్తెను వెదికి పెట్టాలని యువతి తండ్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎయిమ్స్ ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తాం



మంత్రులకు ఎయిమ్స్ కావాలంటూ జెండాలు చూపిన ఆందోళనకారులు

రాయచూరు రూరల్: నగరంలో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా చూస్తామని వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆందోళనకు మద్దతు తెలిపారు. గురువారం మహాత్మగాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పంచ గ్యారెంటీల సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించేలా చూస్తామన్నారు. ఆందోళన చేపట్టిన సమితి అధ్యక్షుడు బసవరాజ కళస మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఈ విషయంలో మౌనం వహించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని విన్నవించారు.

విద్యుదాఘాతంతో మిరప లారీ బుగ్గి



మంటల్లో కాలిపోతున్న లారీలోని సరుకు

రాయచూరు రూరల్: మిరప కాయల లోడ్‌తో వస్తున్న లారీకి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి భస్మమైన ఘటన బుధవారం సాయంత్రం దేవదుర్గ తాలూకా యరమనాళ క్రాస్ వద్ద జరిగింది. యరమనాళ నుంచి రాయచూరు మార్కెట్‌కు లారీలో 500 మిరప బస్తాలను తెస్తుండగా లారీకి హైవోల్టేజీ విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. లారీతో పాటు ఎండుమిరప కాయలు కాలిబూడిదయ్యాయి.


కాంగ్రెస్‌తో టచ్‌లోకి ముగ్గురు బీజేపీ ఎంపీలు



మాట్లాడుతున్న శివకుమార్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ముగ్గురు ఎంపీలు కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. గురువారం నగరంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కొంత మంది బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఉత్సుకతతో ఉన్నారన్నారు. పంచ గ్యారెంటీ పథకాల కోసం రూ.52 వేల కోట్ల నిధులు కేటాయించామని వివరించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 28 లోక్‌సభ స్థానాలకు గాను 20 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. భీమా నదికి మహారాష్ట్ర నుంచి నీటిని విడిపించడానికి చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో రాష్ట్ర వైద్యవిద్యా శాఖామంత్రి శరణు ప్రకాష్ పాటిల్, ఎమ్మెల్యే తుకారాంలున్నారు.

భానుడి భగభగ.. జీవాల విలవిల



ఎండల తీవ్రతకు తొట్లి గ్రామ చెరువులో ఇంకిపోయిన నీరు



ఎండ వేడిమికి తాళలేక చల్లటి చెరకు రసం తాగుతున్న విద్యార్థినులు

- చెరువుల్లో నీరంతా ఖాళీ
- పెరుగుతున్న ఎండ వేడిమి
- పశుపక్ష్యాదుల దాహార్తికీ కష్టం
- చల్లని పానీయాల వైపు జనం మొగ్గు

కోలారు: జిల్లాలో వేసవి ఎండ వేడిమి నానాటికీ అధికం అవుతోంది. ఎండ తీవ్రత ఇప్పటికే 37 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ప్రజలు ఎండ తీవ్రతకు తాళలేక ఉదయం 11 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. పిల్లలు, వయోవృద్ధులు ఎండకు జడిసి బయటకు రావడం లేదు. వడదెబ్బ తగులుతుందని భయపడుతున్నారు. నీరు లభించక పశు పక్ష్యాదులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. 10 గంటలకు సూర్యుడి ప్రతాపం మొదలైతే సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతోంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి ఎండ తీవ్రత అధికంగానే ఉందని చెప్పవచ్చు. పగలంతా వేడెక్కిన భూమి రాత్రయితే వేడిమి సెగకు ఇళ్లలోనూ ఉండలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెల ఆరంభంలోనే ఈ విధంగా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలలో మరింత అధికమయ్యే అవకాశం ఉంది. చెరువులు, కుంటల్లో ఇప్పటికే నీరు ఇంకి పోయి అంతర్జలాల స్థాయి కూడా తగ్గుముఖం పడుతోంది.

ఇక తాగునీటికీ తిప్పలే

రాబోయే రోజుల్లో తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉంటాయి. ఉగాది దాటితే ఎండ తీవ్రత మరింత అధికమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈసారి ఖరీఫ్‌లో వర్షపాతం తక్కువగా నమోదైంది. ప్రస్తుతానికి తాగునీటి సమస్య అంతగా లేకున్నా రాబోయే రోజుల్లో తీవ్రమయ్యే అవకాశం ఉంది. దాహం తీర్చుకోవడానికి ప్రజలు చల్లని పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. మధ్యాహ్న సమయంలో చల్లని చెరకు రసం, కూల్ డ్రింకు షాపులు, ఐస్ క్రీం పార్లర్లు కిటకిటలాడుతున్నాయి. నిమ్మకాయ సోడా, జ్యూస్, లస్సీతో పాటు వివిధ రకాల పండ్ల రసాలు, పానీయాలు, చల్లని మజ్జిగ తాగుతున్న దృశ్యాలు కనిపించడం సర్వసాధారణమైంది. ఎండకు అనుగుణంగా చల్లని చెరకు రసం దుకాణాలు వీధి వీధిలో కనిపిస్తున్నాయి. తాగడానికి జనం క్యూ కడుతున్నారు,. పుచ్చకాయలు, కర్బూజాలకు డిమాండ్ పెరిగింది. సీజన్‌కు అనుగుణంగా పుచ్చకాయలు, కర్బూజాల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. గతంలో కిలో రూ.30 ఉన్న ధర నేడు ఏకంగా రూ.50లకు విక్రయిస్తున్నారు.

పేదల ఫ్రిడ్జికి డిమాండ్

ఎండా కాలం వచ్చిందంటే పేదవాడి ఫ్రిడ్జి(కూజా)కి



నగరంలోని కుమ్మర పేటలో విక్రయానికి ఉంచిన మట్టి కుండలు

డిమాండ్ అధికంగా ఉంటుంది. మట్టితో తయారు చేసిన ఈ కుండలు, కూజాలను కొనడానికి పేద, ధనిక తేడా లేకుండా అందరు వస్తున్నారు. మట్టితో తయారు చేసిన వీటిలోని నీరు తాగితే ఆరోగ్యానికి మంచిదని ధనికులు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని కుమ్మర పేటలో వీటిని ఒక్కొక్కటి సైజును బట్టి రూ.250 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. మట్టి బాటిళ్లు, కూజాలను కూడా కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా తయారు చేసి విక్రయిస్తున్నారు.

మూగజీవాల రోదన

ఎండను తాళలేక మూగజీవాలు పడుతున్న రోదన చూడనలవి కాకుండా ఉంది. నీరు లభ్యం కాక గొంతెండి పరితపిస్తున్నాయి. నగర సమీపంలోని అంతరగంగ కొండపై ఉన్న కోతులు ఆలయానికి వచ్చే భక్తుల వద్ద నుంచి ఆహారం మాత్రమే కాకుండా వాటర్ బాటిళ్లు కూడా లాక్కుని దాహం తీర్చుకుంటున్నాయి. వానరాల కష్టాన్ని గుర్తించిన ఎంపీ ఎస్.మునిస్వామి ప్రతియేటా ఎండా కాలంలో పండ్లు, తదితర ఆహార పదార్థాలను అందించే ఏర్పాటు చేశారు. అంతే కాకుండా నీటి కుంటలను తవ్వించి అందులో నీరు వదిలి కోతులు తదితర జీవాలకు తాగు నీటిని అందించే సౌలభ్యం కల్పించారు.

కోలారు నుంచి జేడీఎస్ అభ్యర్థి పోటీ

- ప్రకటించిన హెచ్‌డీ కుమారస్వామి
- టికెట్ కోసం జేడీఎస్‌లో గట్టి పోటీ
- సిట్టింగ్ ఎంపీ మునిస్వామికి నిరాశ



మల్లేష్‌బాబు సమృద్ధి మంజునాథ్ నిసర్గ నారాయణ స్వామి

కోలారు: రాష్ట్రంలో త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో కోలారు లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి స్థానం జేడీఎస్‌కు ఖరారైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినాయకుడు హెచ్‌డీ కుమారస్వామి అధికారికంగా ప్రకటించారు. పొత్తులో కోలారు ఎంపీ స్థానం జేడీఎస్‌కు దక్కడంతో ఆ పార్టీలో టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారిలో టెన్షన్ మొదలైంది. టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ పార్టీలు కలిసి పోటీ చేస్తుండడంతో కోలారు నియోజకవర్గం జేడీఎస్ పాలవుతుందనే ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. కోలారు లోక్‌సభ స్థానానికి బీజేపీ ఎంపీ మునిస్వామి ప్రాతినిధ్యం వహిస్తుండడం వల్ల మునిస్వామికే టికెట్ వస్తుందని అనుకున్నారు. అయితే జేడీఎస్ అధినాయకుడు కుమారస్వామి కోలారు నుంచి జేడీఎస్ అభ్యర్థే పోటీ చేస్తారని స్పష్టం చేయడంతో కోలారు స్థానం జేడీఎస్‌కే ఖరారు అయింది. కోలారు లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ స్థానాలు ఉండగా వీటిలో ముగ్గురు జేడీఎస్ శాసనసభ్యులు ఉన్నారు. 8 శాసనసభ స్థానాలకు గాను కేజీఎఫ్ మినహాయిస్తే మిగిలిన అన్ని స్థానాల్లోను జేడీఎస్ పటిష్టంగా ఉంది. ఓడిన అన్ని స్థానాల్లోను జేడీఎస్ రెండో స్థానంలో ఉండడం విశేషం.

ప్రధానంగా ముగ్గురి మధ్యే పోటీ

కోలారు లోక్‌సభ స్థానం కోసం జేడీఎస్ నుంచి పోటీ చేయడానికి ప్రధానంగా ముగ్గురి మధ్యన పోటీ ఉంది. జేడీఎస్ నాయకుల్లో బంగారుపేట నుంచి పోటీ చేసి ఓడిన మల్లేష్‌బాబు, ముళబాగిలు సిట్టింగ్ ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, దేవనహళ్లి మాజీ ఎమ్మెల్యే నిసర్గ నారాయణ స్వామిలు టికెట్ ఆశిస్తూ పార్టీ హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. వీరి ముగ్గురిలో ఎవరిని బరిలోకి దింపాలనేది పార్టీ అధినేత కుమారస్వామే నిర్ణయిస్తారు. లోక్‌సభ ఎన్నికల్లో కోలారు జేడీఎస్‌కు దక్కుతుందని ముందు నుంచి ఆశిస్తున్న జేడీఎస్ నాయకులు ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. కోలారు లోక్‌సభ స్థానం నుంచి ఇంతవరకు కాంగ్రెస్ అభ్యర్థులే ఎక్కువగా గెలుస్తూ వస్తున్నారు. 1984లో జరిగిన ఎన్నికల్లో మాత్రం జనతా పార్టీ నుంచి పోటీ చేసిన డాక్టర్ జీ.వెంకటేష్ కాంగ్రెస్‌పై అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఈసారి జరిగే ఎన్నికల్లో జేడీఎస్, బీజేపీలు ఉమ్మడిగా పోటీ చేస్తున్నందున పోటీ ఆసక్తికరంగా మారింది. కాగా కాంగ్రెస్ పార్టీ ఇంకా తన అభ్యర్థిని ఖరారు చేయక పోవడం గమనార్హం.

ఎన్నికల విధులకు కేంద్ర బలగాల రాక



నగరంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కోలారు: త్వరలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్నందున జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం 120 మందితో కూడిన సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు వచ్చాయి. రెండు రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉన్న రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ సవాలు వంటిది. అందువల్ల సీఐఎస్ఎఫ్ యోధులు కాకుండా బీఎస్ఎఫ్‌కు చెందిన 240 మందితో కూడిన రెండు ప్లాటూన్లు భద్రత కోసం త్వరలో రానున్నారు. త్రిపుర రాజధాని అగర్తలా నుంచి సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఒక ప్లాటూన్ ఇప్పటికే జిల్లాకు వచ్చారు. నగరంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. యూనిఫాం ధరించిన యోధులు మార్చ్‌ఫాస్ట్ చేస్తూ నగరంలోని ప్రధాన వీధుల్లో సంచరించారు. అన్ని తాలూకాల్లోను రూట్‌మార్చ్ నిర్వహించనున్నారు. ఎన్నికలు ముగిసే వరకు వీరు తమ అతిథులుగా ఇక్కడే ఉంటారని జిల్లా ఎస్పీ నారాయణ తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 12 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ప్రతి చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ పోస్టుల్లో జరిగే కార్యకలాపాలను కార్యాలయంలో నుంచే వీక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో అక్రమ కార్యకలాపాల్లో పాలుపంచుకున్న 40 మందిని జిల్లా సరిహద్దుల నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాపై కూడా నిఘా వహించామని, జిల్లాలోని 612 మంది రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఆయుధాలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు.

చింతామణిలో కరవే అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కరవే కార్యకర్తలు

చింతామణి: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 60 శాతం కన్నడ భాషలో బోర్డులను పెట్టాలని ప్రభుత్వం చట్టం చేసిన నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి గురువారం కరవే కార్యకర్తలు చింతామణి పట్టణంలో ప్రతి దుకాణానికి వెళ్లి కరపత్రాలు అందచేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాలూకా కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. కరవే జిల్లా అధ్యక్షుడు లోకేష్ మాట్లాడుతూ... తాలూకా యంత్రాంగం చట్టాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ సుదర్శన్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో దేవరాజ్, కెంపరెడ్డి, నారాయణస్వామి, షబ్బీర్ నందీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు ట్యాంకర్ల క్యూ



ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

కంప్లి: సండూరు తాలూకాలోని రైతాంగం రబీ సీజన్‌లో తమ పంటల రక్షణకు నీళ్ల ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక వైపు తీవ్రమైన నీటి కొరత, మరో వైపు పుంజుకుంటున్న వేసవి ఎండల వేడి తాపంతో తమ పంటలను రక్షించుకునేందుకు రైతాంగం అల్లాడిపోతున్నారు. సండూరు తాలూకాలోని అరసికెరె పరిధిలోని కంచికెరె, అరసికెరె హొసకోటె, హుచ్చంగిదుర్గ గ్రామ పంచాయతీల పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. రైతాంగం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి 700 అడుగుల లోతు బోరు వేసినా చుక్క నీరు కంటికి కానరావడం లేదు. తమ పెట్టుబడులు కేవలం బోర్లు వేయించేందుకు వాడినా ఫలితం శూన్యమై రైతన్నలు పంటలు వాడిపోతున్నాయి. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

అనంత్‌కుమార్ హెగ్డేపై చర్యలకు డిమాండ్



పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్: దళితుల వ్యతిరేకి, భారత రాజ్యాంగ విరోధి, బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డేపై కఠిన చర్యలు తీసుకోవాలని కర్ణాటక రాష్ట్ర డీఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. డీఎస్ఎస్ రాష్ట్ర సమన్వయ సంచాలకుడు ఎ.మానయ్య మాట్లాడుతూ అనంత్‌కుమార్ హెగ్డే పదే పదే రాజ్యాంగంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారన్నారు. దళితుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. గతంలో దళితులను కుక్కలతో పోల్చి అవమానించారన్నారు. కుక్కలు అనే పదాన్ని ఆయన ఊతపదంగా వాడుతూ అందరినీ కించపరుస్తున్నారన్నారు. బీజేపీ అధిష్టానం అనంత్‌కుమార్ హెగ్డేపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉగ్రపోరాటం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ప్రముఖులే అనంత్ కుమార్ హెగ్డేతో ఇలా మాట్లాడిస్తున్నారా అన్న సందేహం కలుగుతోందని దళిత ప్రముఖులు ఆవేదన చెందారు. ధర్నాలో భాగంగా నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించి జిల్లాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆందోళనలో చలువాది మహాసభ గౌరవాధ్యక్షుడు నరసప్ప, ప్రాంత రైతు సంఘ అధ్యక్షుడు శివశంకర్, రాష్ట్ర ప్రముఖుడు దుర్గప్ప తళవార్, తాయప్ప, జిల్లా సంచాలకులు హెచ్.గంగప్ప, చిన్నగాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

పీడీఓ, అధ్యక్షుడిపై చర్యలకు వినతి



14కేఓఎల్04 వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: తాలూకాలోని బెగ్లిహొసహళ్లి జీపీలో అధికార దుర్వినియోగానికి పాల్పడి నియమాలను ఉల్లంఘించి అదనంగా విడుదల చేసిన పీడీఓ మధుమతి, అధ్యక్షుడు గంగరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ కార్యకర్తలు గురువారం టీపీ ఈఓ జోసెఫ్‌కు వినతిపత్రం సమర్పించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. అంబరీష్ మాట్లాడుతూ బెగ్లిహొసహళ్లి జీపీలోని చౌళఘట్ట గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామ శ్మశానానికి వెళ్లే దారి పక్కన ఉన్న కాలువ అభివృద్ధి, ఫెన్సింగ్ వేసే పనులు, మారెమ్మ గుడి నుంచి గోపాలప్ప పొలం వరకు రహదారి అభివృద్ధి, రమేష్ పొలం నుంచి శ్మశానం వరకు పనులు అసంపూర్ణంగా ఉండడమే కాకుండా నాసిరకంగా పనులను చేసి నిధులు దుర్వినియోగ పరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసే ఉద్దేశంతో పలు నకిలీ దాఖలాలు సృష్టించి ప్రభుత్వాన్ని వంచించారని ఆరోపించారు. దీనిపై ఉపాధి హామి ఒంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేయగా ఒంబుడ్స్‌మెన్ పనుల్లో అక్రమాలు జరిగినట్లు నివేదిక ఇచ్చారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి పీడీఓ, అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నంబిగానహళ్లి నారాయణస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాకు సరైన చికిత్స అవసరం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: గ్లకోమాకు సకాలంలో సరైన అవసరమని, లేకుంటే శాశ్వత అంధత్వం తప్పదని జిల్లా అంధత్వ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌సీ నారాయణస్వామి తెలిపారు. నగరంలోని జెడ్పీ భవనంలో నిర్వహించిన గ్లకోమా సప్తాహ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్లకోమా అనేది నరానికి హాని కలిగించే పరిస్థితుల ఒక సమూహం. గ్లకోమాలో ఆప్టిక్ నరంపై పడే ఒత్తిడి వల్ల కళ్లకు హాని కలుగుతుందన్నారు. అంతిమంగా ఇది అంధత్వానికి దారి తీస్తుందన్నారు. నిరంతరం తలనొప్పి, కళ్లు ఎర్రబడడం, కళ్లలో నొప్పి, కడుపులో వికారం, గ్లకోమా లక్షణాలన్నారు. ప్రతి ఒక్కరు యేడాదికోసారి కంటి ఒత్తిడిని పరీక్షించుకోవాలన్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్న వారిలో కూడా గ్లకోమా లక్షణాలు కనిపిస్తాయన్నారు. జిల్లాలో 40 ఏళ్లు పైబడిన 1470 మందిలో గ్లకోమా కనిపించిందన్నారు. పిల్లల్లో కూడా 163 కేసులు కనిపించాయన్నారు. జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ చందన్‌కుమార్, జిల్లా సర్వేక్షణాధికారి డాక్టర్ చారిణి, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

మద్దతు ధరతో రాగుల కొనుగోళ్లు ప్రారంభం



రాగులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

మాలూరు: తాలూకాలో 2023–24వ సంవత్సరంలో ప్రభుత్వం మద్దతు ధరతో రాగుల కొనుగోళ్లను ప్రారంభించింది. ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న రైతుల నుంచి పట్టణంలో ప్రతియేటా ఆహార గోదాములో కొనుగోళ్లు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రాగుల నాణ్యతను పరిశీలించి రాగుల ఖరీదు ప్రక్రియను ప్రారంభించారు. తాలూకాలో రాగులు పండించిన రైతులు ఫ్రూట్స్ యాప్‌లో రిజిస్టర్ చేసుకుంటే ప్రతి ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున క్వింటాల్ రాగులకు రూ.3846 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. రాగుల్లో నాణ్యత లేకుంటే అక్కడే జల్లెడ పట్టి శుభ్రం చేస్తున్నారు. తాలూకాలో రాగులు పండించిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కేఎఫ్‌సీసీ మేనేజర్ రాజప్ప తెలిపారు.

ఘనంగా పార్వతీదేవి రథోత్సవం



పాల్తూరులో సుంకలా పార్వతీ దేవి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో గురువారం చారిత్రక శ్రీ సుంకలా పార్వతీదేవి రథోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి. అందంగా పూలతో అలంకరించి తేరులో సుంకలా పార్వతీ దేవి ప్రతిమను ఉంచి బసవన్న గుడి వరకు భక్తులు లాగారు. గ్రామ వీధులే కాకుండా మిద్దెలు, మేడలపై నుంచి భక్తజనం వీక్షిస్తూ అరటిపండ్లు, పూల వర్షం కురిపించారు. అనంతపురంతో పాటు బళ్లారి, చిత్రదుర్గ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి పెద్దఎత్తున మహిళలు, భక్తులు పార్వతీ దేవికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించి పూజలు చేశారు.

రూపాయి నాణెం మింగి చిన్నారి మృతి

హుబ్లీ: రూపాయి నాణేన్ని మింగి శిశువు మృతి చెందిన ఘటన ధార్వాడ జిల్లా హొసయల్లాపుర కోళికేరి లేఔట్‌లో గురువారం చోటు చేసుకుంది. లేఔట్‌కు చెందిన మహమ్మద్ జుబేర్ షాలి(2) ఇంట్లో ఆటలాడుతూ రూపాయి నాణేన్ని మింగాడు. అది గొంతులో ఇరుక్కుని ఇబ్బంది పడుతుండగా, కుటుంబ సభ్యులు గుర్తించి తక్షణమే బాలుడిని ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. ఈ మేరకు ధార్వాడ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా చిన్నారి మృతితో బాలుడి ఇంట్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

కోలారు: వ్యక్తి హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.2.32 లక్షల జరిమానా విధిస్తూ 1వ జిల్లా సెషన్స్ కోర్టు తీర్పును వెలువరించింది. వివరాలు..ముళబాగిలు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017 జూన్ 6న ఆవణి గ్రామానికి చెందిన నాగభూషణ్ అనే వ్యక్తి హత్యకు గురయ్యారు. ఈ కేసుకు సంబంధించి అప్పటి సీఐ సుధాకర్‌రెడ్డి విచారణ జరిపి అదే గ్రామానికి చెందిన నారాయణస్వామి, గోపాల్, సురేష్, శివప్ప అనే నిందితులపై కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. కేసు సుదీర్ఘ విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులకు న్యాయమూర్తి జీవితఖైదు శిక్షను విధించారు. నిందితుల్లో వెంకటరమణప్ప అనే వ్యక్తి ఇప్పటికే మరణించగా, వెంకటేశప్ప అనే వ్యక్తి నేరం రుజువు కాకపోవడంతో అతనిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు.

ప్రజాసేవ చేసినందుకే నాకు చాన్స్

- 400కు పైగా సీట్లలో ఎన్‌డీఏ గెలుపు ఖాయం
- బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.శ్రీరాములు



శ్రీరాములును అభినందిస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: తాను గెలిచినా, ఓడినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసినందునే తనకు రెండోసారి బళ్లారి లోక్‌సభ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని, దేశ ప్రధాని మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు తాను కూడా సైనికుడిలా పని చేస్తానని బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో మోదీని మళ్లీ ప్రధానిని చేయడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్‌డీఏ కూటమికి 400కు పైగా సీట్లు వస్తాయన్నారు. స్వంతంగా బీజేపీ 380 సీట్లు గెలుచుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. బళ్లారి నుంచి తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. బళ్లారి లోక్‌సభ నుంచి 1999లో సుష్మస్వరాజ్ ఇక్కడ నుంచి పోటీ చేసినప్పటి నుంచి అప్పట్లో ఆమె ఓడిపోయినా ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా బీజేపీ అభ్యర్థులుగా కరుణాకరరెడ్డి, శాంత, తాను, దేవేంద్రప్ప గెలుపొందామని, ఒకసారి ఉప ఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో కూడా బీజేపీకి జనం బ్రహ్మరథం పడతారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. దేశంలో మోదీ చేపట్టిన అభివృద్ధి పనులు, దేశ భద్రత, రక్షణ తదితర మహత్కార్యాలే బీజేపీ విజయానికి సోపానాలు అవుతాయన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్ సురేష్‌బాబు, కార్పొరేటర్లు ఇబ్రహీంబాబు, గోవిందరాజులు, బీజేపీ నాయకులు రామలింగప్ప, మహిపాల్, ఐనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా శ్రీరాములు పేరును రెండో జాబితాలో ప్రకటించిన నేపథ్యంలో బళ్లారి జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందించారు. బీజేపీ నాయకులు డాక్టర్ బీ.కే.సుందర్, రాజీవ్ తదితరులు శ్రీరాములుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ప్యాలెస్ ఎదుట సంబరాలు



స్వీట్లు పంచుతున్న దృశ్యం

మైసూరు: మైసూరు–కొడగు పార్లమెంట్ అభ్యర్థిగా మైసూరు రాజ వంశానికి చెందిన యదువీర్ శ్రీకృష్ణదత్త చామరాజ ఒడెయార్‌ను బీజేపీ అధిష్టానం ప్రకటించడంతో నగరంలో సంబరాలు మొదలయ్యాయి. అపూర్వ స్నేహ బళగ ఆధ్వర్యంలో గురువారం రాచనగరి ప్యాలెస్ ముందు మైసూరు పాక్ పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఆలయాల్లో చోరీ



చోరీ జరిగిన ఆలయం

మండ్య: మండ్య జిల్లా మళవళ్లి తాలూకా వద్దరహళ్లి గ్రామంలోని మూడు ఆలయాల్లో బుధవారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. ఆలయంలోని హుండీ నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని మెయమ్మ, మారమ్మ, రకసమ్మ అనే మూడు ఆలయాల్లో దొంగలు చొరబడి అమ్మవార్ల తాళిబొట్లు, ఆభరణాలు, హుండీ నగదు ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున విధులకు వచ్చిన పూజారులు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సూలిబెలెను అడ్డుకోవాలి

మండ్య: మండ్య నగరంతో పాటు జిల్లాకు వస్తున్న యువ బ్రిగేడ్ వ్యవస్థాపకుడు, వివాదాస్పద వ్యక్తి చక్రవర్తి సూలిబెలెను జిల్లాకు రాకుండా అడ్డుకోవాలని దళిత సంఘర్ష సమితి ప్రొఫెసర్ కృష్ణప్ప విభాగం కార్యకర్తలు గురువారం మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. గురువారం జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని ధర్నా చేసి చక్రవర్త సులిబెలెకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నెల 16న చక్రవర్తి సులిబెలె నమో భారత్ కార్యక్రమంలో మాట్లాడటానికి ఇక్కడికి వస్తున్నారని, ఇక్కడి యువకుల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తారని, ఆయనను వెంటనే నిలువరించాలని అన్నారు.

ఘనంగా రథోత్సవం



తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా హనుమనహళ్లి గ్రామంలో శ్రీ లక్కవదూత స్వామి జాతర మహోత్సవం, శ్రీ లక్కవ దూత స్వామిజీ 60వ ఆరాధన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవానికి గురువారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

చిరుధాన్యాలు ఆరోగ్యకరం



చిరుధాన్యాల సాగు గురించి వివరిస్తున్న జయానంద్

గౌరిబిదనూరు: చిరుధాన్యాలు ఆరోగ్యపుష్టికి ఎంతో దోహదం చేస్తాయని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి జయానంద్ అన్నారు. గురువారం తాలూకాలోని కురూడి గ్రామంలో చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో చిరుధాన్యాలు విస్తారంగా పండించేవారని, మనుషులు కూడా ఆరోగ్యంగా ఉండేవారని అన్నారు. వర్తమానంలో ఆహార పద్ధతులపై అనూహ్య మార్పులు రావడంతో అనేక మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల సాగు, అధిక దిగుబడికి సంబంధించి వివరాలు రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ ప్రశాంత్, జయరాం, నాగరాజనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఢీ, 15 మందికి గాయాలు



ప్రమాద దృశ్యం

తుమకూరు: రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో 15 మంది ప్రయాణికులు గాయపడిన ఘటన తుమకూరు జిల్లా ఇనకొరటిగెరె పరిధిలో చోటుచేసుకుంది. తుమకూరు నుంచి గౌరిబిదనూరు మార్గంలో వస్తున్న ఆర్టీసీ బస్సు కొరటిగెరె బస్టాండ్ వద్ద నిలిపి ఉన్న మరో ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొంది. దీంతో రెండు బస్సుల్లో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

ఆకర్షణీయం.. వస్త్ర మేళా



- మోడల్స్ హంగామా



ప్రదర్శనలో ఆకట్టుకున్న మోడల్స్





బనశంకరి: ఐటీ నగరిలో సిల్క్ ఇండియా మేళాలో అందాల భామలు సందడి చేశారు. ఉగాది పండుగ సందర్భంగా సిల్క్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న పట్టుచీరలు, నగల ప్రదర్శన నగరవాసులను కనువిందు చేస్తోంది. జేపీ.నగర ఫస్ట్ ఫేజ్ సింధూర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న మేళాలో గురువారం మోడల్ భామలు పట్టుచీరలు ధరించి క్యాట్ వాక్‌తో కనువిందు చేశారు. వైవిధ్యభరిత చీరలు, ఆభరణాలు ధరించి హొయలొలికించారు. ఈ మేళాలో ఒడిస్సీ, సంబల్‌పురి ఇక్కత్ చీరలు, బిహార్ ఆర్గానిక్ టస్సర్ చీరలు, అసోం మూగా ,ఇరిపట్టు చీరలు, కర్ణాటక క్రేప్ సిల్క్, అరణి, కంచి, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి పట్టు, నూలు, ప్రింటెడ్ చీరలు విక్రయిస్తున్నారు. పెద్దసంఖ్యలో వస్త్రాలు, గృహాలంకరణ సామగ్రి స్టాల్స్ వెలిశాయి. ఈ ప్రదర్శన ఈ నెల 25 వరకు జరుగుతుంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

యశవంతపుర: బైక్ బోల్తాపడిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన బీఇఎల్ సర్కిల్‌కు సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. మృతుడిని శివాజీనగరకు చెందిన మహమద్ అలీ (18)గా మృతి చెందారు. బీఈఎల్ వంతెన కింద రోడ్డుపై వెళ్తుండగా బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. అలీకి బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జాలహళ్లి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కారును ఢీకొన్న బైక్ :
కారు బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. హెబ్బాళ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జగిరింది. నాగరాజు (55) అనే వ్యక్తి చిక్కబళ్లాపురకు బైక్‌లో వెళ్తుండగా మార్గం మధ్యలో కోడిగేహళ్లి వంతెన వద్ద కారు వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందారు. హెబ్బాళ ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసుకున్నారు.

బస్సు ఢీ, పాదచారి..

మైసూరు: చామరాజనగర జిల్లా కొళ్ళెగాల పట్టణంలోని కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొని పాదచారి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. తాలూకాలోని తెళ్లనూరు గ్రామానికి చెందిన బసవయ్య (59) నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కొళ్లెగాళ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధికి కృషి : యదువీర్

శివాజీనగర: మైసూరు–కొడగు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మైసూరు బీజేపీ అభ్యర్థి, మైసూరు రాజవంశీకుడు యదువీర్ తెలిపారు. గురువారం నగరంలోని మల్లేశ్వరం బీజేపీ రాష్ట్ర కార్యాలయం జగన్నాథ భవన్‌కు వచ్చిన ఆయన, మీడియాతో మాట్లాడారు. అధికారం ఉన్నపుడు అభివృద్ధి చేసేందుకు అవకాశం లభిస్తుందని ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. ప్రతాపసింహ మైసూరు అభివృద్ధికి శ్రమించారు. వారి సహకారం అవసరమన్నారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు, బీ.వై.విజయేంద్ర, ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి రాజేశ్ జీ.వీ., కోలార్ ఎంపీ ఎస్.మునిస్వామి, ఎమ్మెల్యే శరణు సగలర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రీతమ్‌గౌడ, రాష్ట్ర కార్యదర్శి శరణు తళ్ళికేరి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉన్నా
మైసూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మైసూరు–కొడగు నుంచి పోటీ చేయడానికి బీజేపీ అధిష్టానం తనకు అవకాశం ఇచ్చిందని, ఈ ఎన్నికల్లో విజయం సాధించి మైసూరు–కొడగు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడెయార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను గడచిన తొమ్మిదేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉన్నానని, ప్రజలు ఆశీర్వదించాలని అన్నారు.

జేడీఎస్‌లో సెక్యులర్ అనే పదాన్ని తొలగించాలి

చింతామణి: తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీతో చేతులు కలిపిన మాజీ ప్రధాని దేవెగౌడ తన పార్టీలో సెక్యులర్ అనే పదాన్ని తొలగించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి చింతామణి పట్టణంలో ఐదు గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించి మాట్లాడారు. దేవెగౌడ 2019 ఎన్నికల్లో తనకు మరు జన్మ వుంటే ముస్లింగా పుట్టాలన్న వ్యక్తి ఇప్పుడు మోదీ ఉత్తమ నాయకుడని ప్రశంసించడం ఏమిటని నిలదీశారు. చింతామణిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను మంత్రి సుధాకర్ చేస్తున్నాడని ప్రశంసించారు. తాము చేస్తామన్న ఐదు గ్యారెంటీలను మాట తప్పకుండా చేశామని అన్నారు. మంత్రి సుధాకర్ మాట్లాడుతూ... పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మంత్రులు బైరతి సురేష్, ఎమ్మెల్యేలు ప్రదీప్ ఈశ్వర్, కొత్తూరు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డుల ఎంపిక

తుమకూరు: తుమకూరు నగరంలోని డీఆర్ పోలీసు కవాతు మైదానంలో హోం గార్డుల ఎంపిక నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ స్వయంగా ఎంపికను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివానంద్, జిల్లా హోంగార్డు కమాండెంట్ పాతణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సుమలతకు వ్యతిరేకంగా ధర్నా



ధర్నా చేస్తున్న దృశ్యం

మండ్య: కరువు పరిహారం, ఉద్యోగ ఖాత్రి కూలి నగదు వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేస్తూ మండ్య ఎంపీ సుమలతకు వ్యతిరేకంగా కృషి ప్రాంతాల కూలీల సంఘం ఆధ్వర్యంలో గురువారం మండ్యలో ధర్నా నిర్వహించారు. నగరంలోని జిల్లా అధికారి కార్యాలయం వద్దకు చేరుకున్న ఆందోళనకారులు కొద్దిసేపు అక్కడ ధర్నా చేసి అనంతరం సుమలతకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంపీగా ఉన్న సుమలత ఉద్యోగఖాత్రి పథకంలో వంద రోజుల పని నిధులు మంజూరు చేయించలేదని, కరువు నిధులు కూడా రాలేదని మండిపడ్డారు. కరోనా సమయంలో మండ్య జిల్లాలో ఆమె కనిపించకుండా పోయారని అన్నారు.

ఈశ్వరప్ప కుమారుడికి మొండిచేయి

- హావేరిలోనూ మిస్
- రాఘవేంద్రకు శివమొగ్గ టికెట్



శివమొగ్గ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధిష్టానం అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో కొందరు ఆశావహులు తీవ్ర నిరాశలో ఉన్నారు. శివమొగ్గ పార్లమెంట్ నుంచి మళ్లీ మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు బీవై రాఘవేంద్రకు ఆ పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో ఇదే నియోజకవర్గాన్ని ఆశిస్తున్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప కుమారుడు కేఈ కాంతేశ్‌కు అధిష్టానం మొండిచేయి చూపింది. దీంతో తండ్రి, కుమారుడు తీవ్ర నిరాశలో పడ్డారు. శివమొగ్గ నుంచి లేకపోతే హావేరి టికెట్ ఇవ్వాలని కోరడంతో అక్కడ మాజీ సీఎం బొమ్మైకి ఇవ్వడంతో ఈశ్వరప్ప కుమారుడికి ఎదురుదెబ్బ తగిలింది. అధిష్టానం ఈశ్వరప్పతో పాటు ఆయన కుమారుడిపై కూడా పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. బీవై రాఘవేంద్ర 2009లో, 2017 ఉప ఎన్నికల్లో, 2018లో ఎంపీగా విజయం సాధించారు. తాజాగా మరోసారి టికెట్ దక్కించుకున్నారు.

ఆస్తి గొడవ.. తండ్రి హత్య

యశవంతపుర: భూమి అమ్మగా వచ్చిన డబ్బులు పంపకంలో జరిగిన గొడవలో మొదటి భార్య పిల్లలు తండ్రిని హత్య చేసిన ఘటన గదగలో జరిగింది. వివేకానంద (52) హత్యకు గురయ్యాడు. మొదటి భార్య పిల్లలు ప్రకాశ్, మల్లేశ్‌లు కలిసి తండ్రిని హత్య చేశారు. వివేకానందకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కస్తూరమ్మ మృతి చెందగా, రెండో భార్య రేఖను పెళ్లి చేసుకున్నారు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. యల్లప్ప పేరున ఆరు ఎకరాలుండగా, మూడు ఎకరాల భూమిని అమ్మాడు. వచ్చిన డబ్బుల పంపకంలో గొడవ జరిగింది. ప్రకాశ్, మల్లేశ్‌లు డబ్బులు మొత్తం మాకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేఖ ఇంటిలో లేని సమయంలో లోపలకు దూరి వివేకానందపై మారణాయుధాలతో దాడి చేసి పరారయ్యారు. బయటకు వెళ్లిన రేఖ ఇంటికి వచ్చి విషయం గుర్తించి ఆస్పత్రికి తరలించగా వివేకాంద మార్గం మధ్యలో మృతి చెందాడు. గదగ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇతరుల పాస్‌పోర్టుతో విమాన ప్రయాణం

- నిందితుడు అరెస్టు

దొడ్డబళ్లాపురం: ఇతరుల పాస్‌పోర్టుతో విమానంలో ఢిల్లీ ప్రయాణించాలని యత్నించిన వ్యక్తిని కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 12న శ్రేయస్ రమానంద్ అనే వ్యక్తి ఢిల్లీ వెళ్లడానికి కెంపేగౌడ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అధికారులు పాస్‌పోర్టు పరిశీలించగా అనుమానం వచ్చింది. పాస్‌పోర్టులో ఉన్న వ్యక్తి, ఈ వ్యక్తికి పోలికల్లో తేడా కనిపించింది. దీంతో క్షుణ్ణంగా పరిశీలించగా పాస్‌పోర్టు అతడిది కాదని తేలింది. దీంతో అధికారులు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేఐఏ పోలీసులు శ్రేయస్‌ను అరెస్టు చేసారు.

ప్రేమించాలని మహిళా ఎస్ఐకి బెదిరింపులు

- కర్ణాటక ఇండస్ట్రియల్ ఫోర్స్ ఎస్ఐకి కటకటాలు

బనశంకరి: ప్రేమించాలని ఓ మహిళా ఎస్ఐకి బ్లాక్‌మెయిల్ చేసిన ఎస్ఐ సంజయ్ కుమార్‌ను గురువారం చంద్ర లేఔట్ పోలీసులు అరెస్ట్ చేశారు. సంజయ్‌కుమార్ కర్ణాటక పారిశ్రామికభద్రతా బలగాల్లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఎస్ఐ శిక్షణ సమయంలో సదరు మహిళతో సంజయ్‌కుమార్‌కు పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో ప్రేమిస్తున్నట్లు తెలపగా ఆమె నిరాకరించింది. భవిష్యత్‌లో యూపీఎస్సీ పరీక్ష రాయడానికి డబ్బు అవసరం ఉందని చెప్పి 2020లో ఆమె నుంచి రూ.5.50 లక్షల డబ్బు తీసుకున్నాడు. మాట్లాడే సమయంలో దగ్గరకు వచ్చి ఫొటోలు తీసుకునేవాడు. ఇదే ఫొటోలతో ప్రేమించాలని సంజయ్ కుమార్ బెదిరిస్తున్నారని యువతి ఫిర్యాదు చేసింది. ప్రేమను నిరాకరిస్తే చాకుతో చేతులు కోసుకుంటానని బెదిరించి తనను పిలిపించుకున్నాడు. మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడినట్లు తన దృష్టికి రావడంతో అతన్ని దూరం ఉంచానని, తన ప్రేమను నిరాకరిస్తే కిడ్నాప్ చేస్తానని బెదిరించాడని, ఈనెల 11న ఇంటిలోకి చొరబడి తనపై దాడికి యత్నించాడని బాధిత ఎస్ఐ తన ఫిర్యాదులో పేర్కొంది. చంద్రాలేఔట్ పోలీసులు కేసు తీవ్రంగా పరిగణించి గురువారం సంజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

దుకాణాలకు బీబీఎంపీ తాళం

బనశంకరి: దుకాణాల ముందు ఏర్పాటు చేసే నేమ్ బోర్డుల్లో 60 శాతం కన్నడ భాష వాడాలని తప్పనిసరి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను పట్టించుకోని బెంగళూరు మాల్ ఆఫ్ ఏష్యాలో కొన్ని దుకాణాలకు బీబీఎంపీ తాళం వేసింది. బీబీఎంపీ నోటీస్ ఇచ్చినప్పటికీ మాల్ ఆఫ్ ఏష్యా కొంతమంది దుకాణాలు దారులు కన్నడబోర్డులు అమర్చినప్పటికీ మిగిలినవారు అమర్చలేదు. దీంతో గురువారం పాలికె అధికారులు 60 శాతం కన్నడ భాష బోర్డులు అమర్చని దుకాణాలకు తాళం వేసి ట్రేడ్‌లైసెన్సు రద్దు చేస్తూ నోటీస్ జారీ చేశారు.

ఏడుగురు అరెస్ట్, మారణాయుధాలు స్వాధీనం

కృష్ణరాజపురం: ఓ రౌడీషీటర్ భద్రత కోసం కారులో మారణాయుధాలతో తిరుగుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మహాదేవపుర పరిధిలో జరిగింది. ఈనెల 11న ఉదయం పోలీసులు తనిఖీలు చేస్తుండగా అక్కడికి వచ్చిన కారును పరిశీలించగా అందులో వేటకొడవళ్లు, పెప్పర్ స్ప్రేలు, ఇనుపరాడ్లు బయటపడ్డాయి. దీంతో కారులో ఉన్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వీరు చింతామణికి చెందిన రౌడీషీటర్ శివారెడ్డికి భద్రతగా వచ్చారని పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న నటుడి కారు

- ఆటో డ్రైవర్ మృతి



తుమకురు: హాస్యనటుడు, బిగ్‌బాస్ పార్టిసిపెంట్ తుకాళి సంతోష్ కారులో వెళ్తూ ఆటోను ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా కొత్తెగెరె సమీపంలోని కురుడిహళ్లి చోటు చేసుకుంది. మృతుడిని కొడిహిపాళ్య గ్రామానికి చెందిన జగదీష్ (44)గా గుర్తించారు. తుకాళి సంతోష్ తన భార్యతో కలిసి తుమకూరులో షూటింగ్ ముగించుకుని కారులో హొళెనరిసిపురకు వెళ్తుండగా కుణిగల్ వైపు నుంచి కోడళ్ళి పాళ్య గ్రామానికి వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న జగదీశ్ తీవ్రంగా గాయపడటంతో అతన్ని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కేఎస్ ఆర్టీసీకి పురస్కారాలు

బనశంకరి: కేఎస్ ఆర్టీసీకి ఐదు జాతీయ, ఒక అంతర్జాతీయ పురస్కారం లభించింది. బస్ బ్రాండ్ నిర్వహణకు దక్షిణాఫ్రికా నాయకత్వ పురస్కారం, మానవ వనరుల కోసం పంజాబ్ నాయకత్వ పురస్కారం, అత్యుత్తమ కష్టమర్ల సేవా చర్యల కోసం స్టార్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారం అందాయి. గవర్నెన్స్ నౌ 10వ పురస్కారం, అత్యుత్తమ వినూత్న వాహన సమూహ నిర్వహణ కోసం ఈశాన్య భారత నాయకత్వ పురస్కారానికి ఎంపికైందని ఎండీ అన్బుకుమార్ తెలిపారు.

పాఠశాల గదులకు భూమిపూజ

చింతామణి: పట్టణంలోని హైస్కూల్‌లో అదనపు గదుల నిర్మాణానికి మంత్రి సుధాకర్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓసాట్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్, వన్ స్కూల్ అట్ టైమ్ సహకారంతో రూ 1.25 కోట్లతో అదనపు గదులు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా దాత రంగారెడ్డి కుటుంబానికి కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో తాలూకా పంచాయతీ ఈఓ ఆనంద్, తాలూకా విద్యాధికారి ఉమాదేవి, కౌన్సిలర్లు రెడ్డప్ప, మురళి, జగన్నాథ్ రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

కావేరి నది పరుగులు



హొగేనక్కల్ వద్ద కావేరి నది (ఫైల్)

హోసూరు: కొన్నినెలలుగా కర్ణాటకలో కబిని, క్రిష్ణరాజసాగర్ డ్యాంల నుంచి నీరు రాకపోవడంతో హొగేనకల్ వద్ద కావేరినది ఎండిపోయి గుంటల్లో మాత్రమే నీరు నిలిచి ఉంది. దీంతో పర్యాటకులు బోట్ల సవారీ లేకపోవడంతో నిరుత్సాహపడేవారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కర్ణాటకలోని క్రిష్ణరాజసాగర్ డ్యాం నుంచి నీరు విడుదల చేయడంతో హొగేనకల్ వద్ద కావేరి నదిలోకి నీరు చేరుతోంది. రెండు రాష్ట్రాల సరిహద్దు బిలిగుండ్లు వద్ద జలవనరుల శాఖాధికారులు నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్నారు. హొగేనకల్‌కు వెళ్లుతున్న పర్యాటకులకు బోట్ల సవారీ అందుబాటులోకి వచ్చింది.

పార్క్ పనులు ప్రారంభం

హోసూరు: హోసూరు ఏఎస్‌టీసీ హడ్కో ప్రాంతంలో రూ. 87 లక్షల అంచనాతో నూతన పార్క్ ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కమిషనర్ స్నేహ, మేయర్ సత్య పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మనకు మనమే పథకం ద్వారా దాతల సహాయంతో పార్క్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. హోసూరును గ్రీన్ సిటీగా మార్చేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారి ప్రభాకరన్, రవి, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో కార్మికుడు మృతి

క్రిష్ణగిరి: బైక్ ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన కందికుప్పం పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు పోచ్చంపల్లి తాలూకా బుద్దన్‌కొడై ప్రాంతానికి చెందిన కూలి కార్మికుడు రామలింగం (47), బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో మిట్టపల్లిలోని బంధువుల ఇంటికెళ్లి క్రిష్ణగిరి వైపు వెళుతున్నాడు. ఎదురుగా వెళ్లుతున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన రామలింగం ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కందికుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన ప్రదర్శన



పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజా సంబంధ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంటోంది. క్రిష్ణగిరి కొత్త బస్టాండులో ఫొటో ప్రదర్శన ఏర్పాటైంది. ఇందులో దేవి వరదాలయ సాంస్కృతిక పాఠశాల చిన్నారుల నృత్య ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

బ్యాంక్ ప్రచార వాహనం
ధర్మపురి కేంద్రంగా నిర్వహిస్తున్న డీడీసీసీ బ్యాంకు శాఖలు క్రిష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. ఖాతాదారులకు అందిస్తున్న సౌలభ్యాలను వివరిస్తూ సంచార వాహనాలతో ప్రచారం ప్రారంభించాయి.

నగల దుకాణంలో దుండగుల కాల్పులు



షాపు ముందు గుమిగూడిన జనం, పోలీసులు



షాపు వద్ద వదిలేసిన నాటు పిస్టల్

- సినీఫక్కీలో దోపిడీకి యత్నం
- అడ్డుకున్న యజమానులకు బుల్లెట్ గాయాలు
- బెంగళూరులో పట్టపగలే దారుణం

దొడ్డబళ్లాపురం: పట్టపగలు నగల దుకాణంలోకి జొరబడ్డ దుండగులు దోపిడీకి యత్నించి, అడ్డుకున్న దుకాణం యజమానులపై కాల్పులు జరిపి పరారైన సంఘటన లొట్టెగొల్లహళ్లి దేవినగర్‌లో చోటుచేసుకుంది. దుండగుల కాల్పుల్లో దుకాణం యజమానులు అందారాజ్, ఆపురామ్ ఇద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిలో ఒకరి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. దేవినగర్‌లోని లక్ష్మి జ్యువెలరీ దుకాణంలోని గురువారం ఉదయం నలుగురు దుండగులు హెల్మెట్, ముసుగులు ధరించి వచ్చారు. వారిలో ఇద్దరు దుకాణంలోకి జొరబడి రివాల్వర్‌లతో బెదిరించి నగలు దోచుకోవడానికి ప్రయత్నించారు. దీంతో దుకాణంలో ఉన్న యజమానులు అందారాజ్, ఆపురామ్ అడ్డుకున్నారు. దుండగులు ఇద్దరిపై కాల్పులు జరిపి రివాల్వర్ అక్కడే వదిలేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న కొడిగేహళ్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రల నిపుణులు, శ్వానదళం సిబ్బంది సాక్ష్యాధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించి నిందితుల కోసం వేట మొదలెట్టారు.

ఈ బావి వృథాయేనా?



సూళగిరి దొరచెరువులోని బావి

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి దొర చెరువులో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బావి నిరుపయోగంగా మిగిలింది. అధికారులు 2018–2019 ఆర్థిక సంవత్సరంలో సూళగిరి ప్రాంతవాసులకు తాగునీరు అందించాలని రూ. 30 లక్షల ఖర్చుతో దొరచెరువులో పెద్ద బావిని ఏర్పాటు చేశారు. కానీ నేటికీ దానిని వినియోగంలోకి తీసుకురాలేదు. కరువు రావడంతో జిల్లాలో నీటి కొరత ఏర్పడింది. బోరు బావుల్లో నీరు అడుగంటిపోయింది. సూళగిరి సమీపంలోని వడ్రపాళ్యం, పిండేగానపల్లి, పులియరసి గ్రామాల్లో తాగునీటి కొరత పీడిస్తోంది. దొరచెరువు బావి నుంచి ప్రజలకు తాగునీరందజేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భగ్గుమన్న పొత్తు బంధం

టీడీపీ రెండో జాబితా ప్రకటన వెలువడగానే రాష్ట్ర వ్యాప్తంగా దుమారం


కొవ్వూరులో జవహర్ ఇంటి వద్ద టైర్లు తగులబెడుతున్న టీడీపీ కార్యకర్తలు


పెందుర్తిలో రాజీనామా పత్రాలను ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు


బి.కొత్తకోటలో రాస్తారోకో చేస్తున్న శంకర్ వర్గీయులు

సాక్షి నెట్‌వర్క్: పొత్తులతో ఎన్నికల గోదారి ఈదాలన్న చంద్రబాబు ఎత్తుగడ టీడీపీ పుట్టి ముంచుతోంది. ఇప్పటికే మూడు గ్రూపులు ఆరు కుంపట్లుగా రచ్చ రచ్చగా ఉన్న టీడీపీ పరిస్థితి తాజాగా మిత్రపక్షాలు జనసేన, బీజేపీలకు సీట్ల కేటాయింపుతో పూర్తిగా రోడ్డున పడింది. చంద్రబాబు గురువారం తమ పార్టీ అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించగానే భగ్గుమన్న టీడీపీ తమ్ముళ్లు అధినేతపై నిప్పులు చెరిగారు. పార్టీ కోసం శ్రమించిన వారిని పక్కనపెట్టి డబ్బు మూటలతో దిగిన ప్యారాచూట్ నాయకులకు టికెట్లు కేటాయించారని మండిపడ్డారు. పార్టీకోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి కేవలం డబ్బులకే ప్రాధాన్యత ఇచ్చారని టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై దుమ్మెత్తిపోశారు. టికెట్ల కేటాయింపులో మరోసారి పునరాలోచించాలని లేనిపక్షంలో పార్టీని ఓడించేందుకైనా వెనుకాడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు చించివేసి ర్యాలీలు నిరసనలు తెలిపారు. కొందరు నాయకులు రాజీనామాలు చేశారు. చంద్రబాబు చేసిన మోసానికి ఆగ్రహించిన కార్యకర్తలు రోడ్లపై టైర్లను కాల్చి ఆందోళనలు నిర్వహించారు. మొత్తంగా టీడీపీ రెండో జాబితా ప్రకటించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం చెలరేగింది.

పిఠాపురంలో అసమ్మతి సెగ

కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు జనసేన అధినేత పవన్ ప్రకటించిన పది నిమిషాలకే అక్కడ టీడీపీలో అసమ్మతి అగ్గి రగిలింది. మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మకు టికెట్టు నిరాకరించడంపై ఆ పార్టీ వర్గాలు పిఠాపురంలో గురువారం తీవ్ర స్థాయి ఆందోళనకు దిగాయి. పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద వర్మ అనుచరులు, ఆ పార్టీ నేతలు చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీడీపీ జెండాలు, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పత్రికలు తగులబెట్టారు. వర్మకు టికెట్టు ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపి, రెబల్‌గా పోటీ చేయిస్తామని గతంలోనే వారు ప్రకటించారు. అధిష్టానం తన నిర్ణయం మార్చుకోపోతే టీడీపీకి మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని, సానుకూల నిర్ణయం ప్రకటించేంత వరకూ టీడీపీ జెండాలు సైతం పట్టుకోబోమని ఇటీవల చెప్పారు. తామంతా రాజీనామాలకు సిద్ధంగా ఉన్నామంటూ సంతకాలు సేకరించారు. ఈ నేపథ్యంలో పవన్ ప్రకటనతో భగ్గుమన్న టీడీపీ నేతలు చంద్రబాబును, పవన్ కళ్యాణ్‌ను తీవ్ర పదజాలంతో దూషించారు. ఇప్పటి వరకూ సీటు వర్మదే అంటూ నమ్మబలికిన చేతకాని లోకేశ్ ఇప్పుడు మాట మార్చి తమను మోసం చేశాడంటూ పలువురు మహిళా నేతలు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండు రోజుల్లో క్యాడర్‌తో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని వర్మ ప్రకటించారు. పార్టీని నమ్ముకుని ఇప్పటి వరకూ సేవ చేస్తే తనకు కాకుండా ఎవరో స్థానికేతరుడికి సీటు కేటాయించడం దారుణమంటూ పవన్ కల్యాణ్‌ను స్థానికేతరుడని పరోక్షంగా విమర్శించారు. తాను స్థానికుడినని పవన్ స్థానికేతరుడని చెబుతూ ఎవరి కోసమో తన సీటును బదలాయించడం చంద్రబాబు తీసుకున్న తప్పుడు నిర్ణయమని అన్నారు.

కొవ్వూరులో జవ'హరీ'

టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు అధిష్టానం మొండిచెయ్యి చూపించింది. కొవ్వూరు టికెట్టు తనకే కేటాయిస్తారని ఇన్నాళ్లూ ధీమాగా ఉన్న ఆయనకు పరాభవం తప్పలేదు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు కొవ్వూరు టికెట్టు ఖరారు చేయడం ఆయన కంగు తిన్నారు. కొవ్వూరులోని జవహర్ నివాసానికి ఆయన వర్గీయులు గురువారం పెద్ద ఎత్తున చేరుకున్నారు. చంద్రబాబుతో ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు చించివేసి నిరసన తెలిపారు. కొవ్వూరు సహా 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమంటూ పలువురు టీడీపీ పార్టీ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రోడ్డుపై టైర్లు తగులబెట్టారు. సీటు దక్కకపోవడంతో జవహర్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. కనీసం జిల్లాలో ఎక్కడో ఒకచోట సర్దుబాటు చేస్తారన్న ఆశ కూడా పోయింది. దీంతో జవహర్ వర్గీయులు అధిష్టానం తీరుపై అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. టికెట్‌పై ఎటువంటి సానుకూల స్పందనా రాకపోవడంతో జవహర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అనంతరం జవహర్ మీడియాతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ తాను కొవ్వూరు నుంచే పోటీ చేస్తానని ప్రకటించడం టీడీపీలో ప్రకంపనలు రేపుతోంది. గత ఎన్నికల్లో గోపాలపురంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు చేతిలో ఘోర ఓటమి పాలైన ముప్పిడి వెంకటేశ్వరరావుకు కొవ్వూరు టికెట్టు ఖరారు చేసిన అధిష్టానంపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. కొవ్వూరు టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించిన తొలి రోజే గ్రూపు రాజకీయాలు భగ్గుమనడం, జవహర్ వర్గీయులు నిరసనలకు దిగడంతో టీడీపీ శ్రేణుల్లో అయోమయంలో పడ్డారు. టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణలు చంద్రబాబును మంగళవారం రాత్రి కలిసి, అభ్యర్థిని ఖరారు చేశారు. డబ్బు మూటలకు అధిష్టానం అమ్ముడుపోయిందని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు నాయకులు ఇప్పటికే పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారు.

భగ్గుమన్న కొమ్మాలపాటి వర్గం

పల్నాడు జిల్లా పెదకూరపాడు స్థానం భాష్యం ప్రవీణ్‌కు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. టికెట్ కొమ్మాలపాటికే కేటాయిస్తారని ముందుగా గుంటూరులోని ఆయన నివాసానికి గురువారం ఉదయం అనుచరులు భారీగా చేరుకుని స్వీట్లు, బాణసంచా సిద్ధం చేసుకున్నారు. చివరికి టికెట్ భాష్యం ప్రవీణ్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు ఆందోళన చేపట్టారు. ఈ సమయంలో భాష్యం ప్రవీణ్ కొమ్మాలపాటి ఇంటికి చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అచ్చంపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రవీణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించకముందే నియోజకవర్గంలో ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లుతో హడావుడి ఎందుకు చేశారు అని ప్రశ్నించారు? స్థానికేతరుడు అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రవీణ్ కూడా టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకెందుకు ఏమైనా ఉంటే మేము మేము చూసుకుంటాం.. మీరెవ్వరు అంటూ గట్టిగా అరవడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. టికెట్ దక్కకపోవడం పట్ల కొమ్మాలపాటి తన ముఖ్య అనుచరుల వద్ద జరిగిన అన్యాయంపై వాపోయారట. వరుసగా నాలుగు పర్యాయాలు పెదకూరపాడులో టీడీపీ ఓడిపోతూ అభ్యర్థులు కరువైన సమయంలో 2009లో అభ్యర్థిగా పోటీ చేసి గెలిచానని, పార్టీ కోసం 18 సంవత్సరాలు కష్టపడితే ఇదేనా నాకు దక్కిన గౌరవం అంటూ ఆవేదన చెందారట. పార్టీ కోసం ఎంతో డబ్బు ఖర్చు చేసినా చంద్రబాబు కనీసం పిలిచి మాట్లాడకపోవడం అన్యాయమన్నారట. నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపి శ్రీధర్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

పెనమలూరు టీడీపీలో టికెట్ రచ్చ

కృష్ణా జిల్లా పెనమలూరు టీడీపీలో టికెట్ రచ్చ తార స్థాయికి చేరింది. అక్కడ టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్‌కు సీటు నిరాకరించడంపై ఆ పార్టీ శ్రేణులు అధిష్టానాన్ని దుమ్మెత్తి పోశాయి. అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మండల పార్టీ అధ్యక్షులు నుంచి బూత్ కన్వీనర్ల వరకూ రాజీనామాలు చేస్తామని ప్రకటించారు. ఓ కార్యకర్త ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేశాడు. సీటు బోడెకు కాని పక్షంలో స్థానికులకు ఇవ్వాలని, దిగుమతి నేతలను ఒప్పుకునేది లేదంటున్నారు. చంద్రబాబు కుటుంబం మినహా వేరెవరు పోటీ చేసినా తాను కూడా పోటీ చేస్తానని కరాఖండీగా చెప్పారు. ఈ విషయంపై అధిష్టానంతో తేల్చుకుందామని శ్రేణులకు సూచించారు. తాను టీడీపీ పార్టీకి ఎనలేని కృషి చేశానని, తనకు అసెంబ్లీ టికెట్ ఇవ్వనందున టీడీపీ బీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ సర్వేలో తనకు అనుకూలంగా ఉన్న టికెట్ ఇవ్వకుండా ఎందుకు నిరాకరించారో తెలియటం లేదన్నారు. నాలుగున్నర ఏళ్లుగా పార్టీ కార్యక్రమాలు అన్నీ విజయవంతం చేశానని, తనను మేకను బలిచ్చినట్లు బలిస్తే ఊరుకునేది లేదన్నారు. తనను టీడీపీ బహిష్కరించినా చంద్రబాబునాయుడు ఫోటో పెట్టుకోని టీడీపీ బీ అభ్యర్థిగా పోటీ చేస్తానని అన్నారు. చివరి వరకు చంద్రబాబు, లోకేశ్ ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. సీటు తనకే వస్తుందన్న ధీమాతో ఉన్న బోడెకు సీటు లేదని అధిష్టానం తేల్చి చెప్పేసింది. బోడె ఇసుక అక్రమ తవ్వకాలు, మట్టి విక్రయాలను ప్రోత్సహించారనే అభియోగాలున్నాయి. దొంగ పరీక్ష కేసులు, కాల్‌మనీ, సెక్స్‌రాకెట్ విమర్శలు బురదలా అంటుకున్నాయి. వీటికి తోడు కార్యకర్తలను కలుపుకుని వెళ్లటంలో వైఫల్యం చెందారన్నది మరో కారణం. ప్రధానంగా పార్టీలో నెలకొన్న వర్గపోరు గెలుపు ఓటములపై ప్రభావం పడుతుందని టీడీపీ అధిష్టానం గుర్తించింది. మిత్ర పక్షమైన జనసేనలోని వర్గాలతోనూ సఖ్యత లేదన్న ప్రచారం లేకపోలేదు.111

పెందుర్తిలో కార్యకర్తల తీవ్ర నిరసన

పెందుర్తిలో బండారుకు టీడీపీ టికెట్ కేటాయించకపోవడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో వెన్నలపాలెంలోని బండారు ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజీనామా చేస్తామని ప్రకటించారు.

తీవ్ర మనస్తాపంలో గండి బాబ్జీ

విశాఖ దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిసింది. రెండో జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. బాబ్జీ విశాఖ దక్షిణ లేదా మాడుగుల నుంచి టికెట్ ఆశించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడం, మాడుగుల టికెట్‌ను తెలుగుదేశం పార్టీ పైల ప్రసాద్‌కు కేటాయించడంతో గండి బాబ్జీకి అవకాశం దక్కలేదు. త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం.

రంపచోడవరంలో ఆగ్రహ జ్వాలలు

రంపచోడవరం టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవి పేరు ప్రకటించడంతో టీడీపీ నాయకులు వర్గాలుగా విడిపోయారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి కాకుండా పైరవీలు చేసిన వారికి టికెట్ ఇవ్వడం అన్యాయమని వారంతా ధ్వజమెత్తారు. గురువారం రంపచోడవరంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి నివాసంలో టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. అనంతరం వంతల రాజేశ్వరికి టీడీపీ టికెట్ ఇవ్వాలని రోడ్డుపై నిరసనకు దిగారు. టికెట్ విషయంలో నియోజకవర్గంలో ఎవరిని సంప్రదించకుండా ఆమెకు టికెట్ ఏవిధంగా ఇచ్చారని మండిపడ్డారు. ఐదేళ్లపాటు కష్టపడి తిరిగిన వంతల రాజేశ్వరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. అభ్యర్థి ఎంపికలో టీడీపీతో సంబంధం లేని మాజీ ఎంపీ పెత్తనమేంటని వారు ధ్వజమెత్తారు. టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి న్యాయం జరగదు అనడానికి ఈ పరిణామమే ఒక ఉదాహరణ అన్నారు. పార్టీ అధిష్టానంతో అమీతుమీ తేల్చుకునేందుకు వంతల రాజేశ్వరి నాయకత్వంలో పార్టీ శ్రేణులు శుక్రవారం విజయవాడ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. టికెట్ విషయంలో మార్పు లేకపోతే పార్టీ కోసం పని చేసేది లేదని వారు బహిరంగంగా చెబుతున్నారు. మరోవైపు శిరీషా దేవి పేరు ప్రకటించిన వెంటనే రంపచోడవరం నుంచి గెద్దాడ వరకు ఉన్న ఆమె ఫ్లెక్సీలను కొంతమంది చింపేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్ స్తబ్దతగా ఉన్నారు. వీరు టికెట్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

బీసీలకు చంద్రబాబు ద్రోహం

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ నేతలు మండిపడ్డారు. టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గీయుల వ్యతిరేకత తీవ్రస్థాయికి చేరుకుంటోంది. పదిరోజులుగా ఆందోళనలతో నిరసనలు వ్యక్తం చేస్తున్న శంకర్ వర్గం టీడీపీ శ్రేణులు గురువారం చంద్రబాబుకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో గళమెత్తారు. నియోజకవర్గంలోని బి.కొత్తకోట, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో రోడ్లపైకి వచ్చిన టీడీపీ నేతలు, కార్యకర్తలు చంద్రబాబుపై మండిపడ్డారు. రోడ్లపై రాస్తారోకోలు నిర్వహించి అభ్యర్థి జయచంద్రారెడ్డిని తప్పించాలని, శంకర్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. బీసీలపై మాటలకే పరిమితమని చంద్రబాబు నిర్ణయం బట్టి స్పష్టమైందని నాయకులు పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఐదేళ్లు పార్టీకోసం శ్రమించిన శంకర్‌ను నమ్మించి నట్టేట ముంచేసిన చంద్రబాబు తప్పును సరిదిద్దుకోవాలని కోరారు. లేనిపక్షంలో తంబళ్లపల్లెలో టీడీపీకి పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడిచిత్తూరుజిల్లాలో ఉన్న ఏకైక బీసీ నాయకుడు శంకర్‌కు టికెట్ లేకుండా చేయడం బీసీలకు ద్రోహం చేయడమేనని ప్రశ్నించారు. సర్వేల్లో పదిశాతానికి మించి మద్దతు పొందని జయచంద్రారెడ్డిని ఎలా ఎంపిక చేసారని నిలదీశారు. బీసీలకు న్యాయం చేసేలా శంకర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించకపోతే పార్టీని ఓడించి సత్తా చాటుతామని హెచ్చరించారు. పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు, పెద్దమండ్యం మండల కన్వీనర్ జిట్టా వెంకటరమణ, పెద్దతిప్పసముద్రంలో కట్టా సురేంద్రనాయుడు, ఈశ్వరప్ప, కురబలకోటలో లక్ష్మణ్, తిమ్మయ్య ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు జరిగాయి.

తిరుపతిలో లోకల్.. నాన్ లోకల్ వార్!

రెండు రోజుల క్రితం తిరుపతి అభ్యర్థిగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ పేరును ఖరారు చేసినట్లు పవన్ కళ్యాణ్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈ పరిణామాన్ని తిరుపతి టీడీపీ, జనసేన నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. చిత్తూరుకు చెందిన నాన్ లోకల్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు సీటు ఇవ్వడానికి వీల్లేదంటున్నారు. ఆరు నెలల కిందటే జనసేనతో పొత్తు ఉంటుందన్న సమాచారంతో తిరుపతి సీటును జనసేనకే కేటాయిస్తారనే అంచనాలు మొదలయ్యాయి. అయితే తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిని జనసేన నాయకులు ఢీ కొనలేరన్న అభిప్రాయం వ్యక్తం అయ్యింది. ఈ పరిస్థితుల్లో తిరుపతి సీటు టీడీపీకే దక్కుతుందనే ప్రచారం జరిగింది. ఈలోపు సీట్ల సర్దుబాటు జరగడంతో తిరుపతి సీటు జనసేనకు కేటాయించారు. ఎలాగైనా చిత్తూరు నుంచే పోటీ చేయాలని భావించిన ఆరణి టీడీపీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడ టికెట్ నిరాకరించడంతో జనసేన కండువా కప్పుకుని తిరుపతి టికెట్ కోసం భారీగా ముడుపులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే పవన్ ఆరణిని తిరుపతి జనసేన అభ్యర్థిగా ఖరారు చేశారని ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీ, జనసేన నాయకులు ఏకమై జనసేన అధినేతకు హెచ్చరికలు పంపారు.


గుంటూరు తన నివాసం వద్ద ఆందోళన చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు


పెనమలూరు టీడీపీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న కార్యకర్త


రంపచోడవరంలో చింపేసిన శిరీష ఫ్లెక్సీలు

రగులుతున్న మంత్రాలయం

మంత్రాలయం టికెట్ తిక్కారెడ్డికి కాకుండా ఇటీవలే పార్టీలోకి వచ్చిన ఎన్.రాఘవేంద్రరెడ్డికి ప్రకటించడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కోసిగి మండల కేంద్రంలో తిక్కారెడ్డి అనుచరులు టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. పన్నెండేళ్లు శ్రమించినా తిక్కారెడ్డికి టిక్కెట్ కేటాయించలేదని వారు వాపోతున్నారు. టికెట్ కేటాయింపులో అన్యాయం జరిగిందని నాయకుల్లో అసంతృప్తి జ్వాలలు ఎగసి పడుతున్నాయి. చంద్రబాబు నిర్ణయంపై అనుచరవర్గం మండిపడుతున్నారు. బాలనాగిరెడ్డి టీడీపీని వీడిన తర్వాత పార్టీకి నాయకత్వం కరువైన సమయంలో తిక్కారెడ్డి పార్టీ బాధ్యతలు చేపట్టారు. టీడీపీ క్యాడర్, కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ కోసం శక్తివంచన లేకుండా శ్రమించారు. దాదాపు 12 ఏళ్లుగా పార్టీ మనుగడకు తనవంతు కృషి చేశారు. 2019 ఎన్నికల్లోనూ ఖగ్గల్ గ్రామంలో ప్రవేశించగా సొంత గన్‌మెన్ల కాల్పుల్లో కాలి తొడ భాగంలో బుల్లెట్లు దిగి గాయపడ్డారు. స్ట్రెచర్ పైనే ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు మొండి చేయి ఎదురవడంతో పార్టీ శ్రేణులు రగిలిపోతున్నారు.

పొత్తులే కత్తులై..

- మునుగుతున్న టీడీపీ నావ
- రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాల

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్ : పొత్తుల కోసం వెంపర్లాడిన తెలుగుదేశం పార్టీ పుట్టి మునుగుతోంది. పొత్తుల పోటు గట్టిగా తగలడంతో సీనియర్ల సీట్లకు అధిష్టానం ఎసరుపెట్టింది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. సీనియర్లు బజారుకెక్కి పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం టికెట్ వసంత కృష్ణప్రసాద్‌కేనని అధిష్టానం చెప్పడంతో ఉమా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు తెలిసింది. పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కూ టికెట్ లేదని పార్టీ సంకేతాలిచ్చింది. దీంతో ఆయన తన అనుచరులతో సమావేశమయ్యారు. రాజీనామాకు సిద్ధమవుతున్నారు. తనను కాదని పార్టీ ఎలా గెలుస్తుందో చూస్తానని సవాల్ విసిరారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ హెచ్చరించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని తొలుత జనసేనకు కేటాయించినట్టు పార్టీ సమాచారం ఇవ్వడంతో బుద్ధా వెంకన్న, జలీల్‌ఖాన్, ఎంకే బేగ్ ఖంగుతిన్నారు. బుద్ధా వెంకన్న అనుచరులతో సమావేశం నిర్వహించి మరీ పార్టీకి పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. జలీల్‌ఖాన్ పార్టీ వీడతానని బెదిరించారు. ఇప్పుడు ఈ సీటును బీజేపీ కోరుతున్నట్టు తెలియడంతో సీటుపై ఆశలు పెట్టుకున్న జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్‌కూ షాక్ తగిలింది. అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించడంతో మండలి బుద్ధప్రసాద్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

బండారుకు చుక్కెదురు

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి గట్టి షాక్ తగిలింది. విశాఖ జిల్లా పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడంతో ఆయన రగిలిపోతున్నారు. ఈ సీటును పంచకర్ల రమేష్‌బాబుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించడంతో బండారు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంటికే పరిమితమయ్యారు. దీంతో పంచకర్లను ఓడిస్తామని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. టీడీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి కళావెంకట్రావుకు ఎచ్చెర్ల సీటు ఖరారు చేయకుండా ఇంకా గాల్లోనే పెట్టారు. వయసు రీత్యా ఆయనను పక్కనపెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రకు చెందిన మరో కీలక నేత గంటా శ్రీనివాసరావు సీటును ఇంకా ఖరారు చేయలేదు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు సీటు నిరాకరించి ఆ స్థానాన్ని జనసేనకు ఇవ్వడంపై ఆయన రంకెలు వేస్తున్నారు. మైలవరం సీటు గందరగోళంగా మారింది.



తిరుపతిలో ఆరణికి వ్యతిరేకంగా గో బ్యాక్ అంటూ టీడీపీ, జనసేన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పల్నాడు జిల్లాలో ఆశావహుల దీలా

పల్నాడు జిల్లాలో సైకిల్ పార్టీ డీలా పడింది. నరసరావుపేట అసెంబ్లీ సీటుపై ఇంకా సందిగ్ధం వీడలేదు. టీడీపీ నేత చదలవాడ అరవిందబాబు ఆందోళన చెందుతున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తనకు సీటు దక్కకుండా చేస్తున్నారని ఆయన సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. మరోవైపు ఈ సీటులో బీజేపీ పోటీ చేస్తుందన్న ప్రచారం ఊపందుకుంది. గురజాల అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు పేరు ఖరారు కావడంతో వైఎస్సార్‌సీపీకి దూరం జరిగి టీడీపీతో సన్నిహితంగా ఉంటున్న జంగా కృష్ణమూర్తి డైలమాలో పడ్డారు.

జవహర్‌కు అవమానం

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సీటు కోసం ఆశలు పెట్టుకున్న మాజీ మంత్రి కేఎస్ జవహర్‌ను ఆ పార్టీ అధిష్టానం ఘోరంగా అవమానించింది. ఈ సీటును గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు కేటాయించింది. దీంతో జవహర్ వర్గీయులు అధిష్టానం తీరుపై మండిపడుతున్నారు. నిడదవోలు సీటు ఆశిస్తున్న శేషారావుకు శరాఘాతం తగిలింది. ఈ సీటును జనసేనకు కేటాయించడంతో ఆయన వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. గోపాలపురం సీటును మద్దిపాటి వెంకట్రాజుకు కేటాయించడంతో అక్కడ పార్టీ శ్రేణుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం వెంట్రాజు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తోంది.

పరిటాలకు బాబు ఝలక్

అనంతపురం జిల్లా ధర్మవరం సీటు ఆశించిన పరిటాల శ్రీరామ్ చతికిలపడ్డారు. సీటును బీజేపీకి కేటాయించడంతో వరదాపురం సూరి ఎగరేసుకుపోయారు. దీంతో ఏం చేయాలో పాలుపోక శ్రీరామ్ తల్లడిల్లుతున్నారు. పుట్టపర్తి సీటును పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరరెడ్డికి కేటాయించడంతో బీసీ వర్గాలు భగ్గుమంటున్నాయి. ఇక్కడ వడ్డెర సామాజికవర్గ నేతలు టికెట్ ఆశించారు. కదిరిలో 2009లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన కందికుంట వెంకట ప్రసాద్‌కు డీడీల కేసులో శిక్ష పడింది. ఆయన భార్యకు ఇప్పుడు పార్టీ టికెట్ ఇవ్వడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అనంతపురం, గుంతకల్లు సీట్లపై టీడీపీ ఇంకా సస్పెన్స్ కొనసాగిస్తోంది.

జనసేనకు అన్ని టికెట్లా.. తీవ్ర అసంతృప్తి

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేనకు ఆరు టికెట్లు కేటాయించడంపై టీడీపీ కేడర్ రగిలిపోతోంది. ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పోలవరాన్ని కూడా జనసేనకు కేటాయిస్తున్నట్టు సమాచారం.
- ఉమ్మడి నెల్లూరు జిల్లా ఆత్మకూరు, కోవూరు, కావలి, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో టీడీపీ శ్రేణులు ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో సీనియర్‌నేతలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కన్నబాబు అసంతృప్తితో ఉన్నారు. ఇక్కడ వలస నేత ఆనం రామనారాయణరెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, కావలిల్లోనూ ఆ పార్టీ ఆశావహులు టికెట్ల కేటాయింపుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోవూరు సీటును ఇటీవలే టీడీపీలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డికి ఇవ్వడంతో ఇన్నాళ్లూ అక్కడ పార్టీ కోసం పనిచేసిన పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి కుటుంబం రగిలిపోతోంది. సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పార్టీ అధిష్టానం పూర్తిగా పక్కన పెట్టేసింది.
- ఉమ్మడి చిత్తూరులో చిచ్చు రేగింది. సత్యవేడు సీటును టీడీపీలో కూడా చేరని ఆదిమూలంకు ఇవ్వడంపై తెలుగుదేశం ఆశావహుల్లో ఆగ్రహ జ్వాలలు రేగాయి. గతంలో బాబు నుంచి హామీ పొందిన మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్, జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరు స్థానాన్ని వరదరాజులరెడ్డికి కేటాయించడం పట్ల లింగారెడ్డి, సురేష్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
- తిరుపతి సీటును ఆరణి శ్రీనివాసులుకు జనసేన కేటాయించడంపై ఆ పార్టీలో అసంతృప్తి రగులుతోంది. దీంతో 'ఆరణి' గో బ్యాక్' అనే నినాదాలతో నగరంలో ఫ్లెక్సీలు వెలిశాయి. చంద్రగిరి సీటును పులవర్తి నానికి కేటాయించడంతో రియల్టర్ డాలర్ దివాకర్‌రెడ్డి నీరుగారారు.
- వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నుంచి ప్రతిసారీ ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉంటావని నారాయణరెడ్డి తనయుడు, పార్టీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిని ఊరించి, చివరికి జమ్మలమడుగు సీటు బీజేపీ(ఆదినారాయణరెడ్డి)కి కేటాయించినట్లు వెల్లడించడంతో నారాయణరెడ్డి కుటుంబం సంకట స్థితిలో పడింది.

టీడీపీ సీట్లు మరో 34 ఖరారు

- రెండో జాబితా విడుదల చేసిన చంద్రబాబు
- రెండు జాబితాల్లో 128 సీట్లలో అభ్యర్థుల ప్రకటన
- మరో 16 సీట్లు పెండింగ్
- ఎంపీ సీట్లపై ఇంకా నాన్చుడే

సాక్షి, అమరావతి : తీవ్రంగా కసరత్తులు చేసి, 34 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రెండో జాబితాను ప్రకటించారు. ఈ జాబితాను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తొలి జాబితాలో చోటు సంపాదించలేకపోయిన పలువురు నేతలకు ఈ జాబితాలో చోటు కల్పించారు. రాజమండ్రి రూరల్ స్థానాన్ని ఎట్టకేలకు సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికే ఖరారు చేశారు. అక్కడి జనసేన నేత కందుల దుర్గేష్‌ను నిడదవోలు పంపడంతో బుచ్చయ్యకు లైన్ క్లియర్ అయింది. చింతమనేని కుటుంబంలో మరికరికి సీటు ఇవ్వాలని చూసిన చంద్రబాబు మనసు మార్చుకుని చివరికి ప్రభాకర్‌కు ఒక్కరికే సీటు ఖరారు చేశారు. రెండో జాబితాలోనూ చంద్రబాబు ధన బలమున్న వారికే ప్రాధాన్యం ఇచ్చారు.

మొత్తం 128 సీట్ల ఖరారు

టీడీపీ మొదటి జాబితాలో 94, రెండో జాబితాలో 34 సీట్లలో అభ్యర్థులను ప్రకటించడం ద్వారా మొత్తం 128 సీట్లను ఖరారు చేసినట్లయింది. పొత్తులో మిగిలిన మరో 16 ఎమ్మెల్యే సీట్లకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జనసేనకు 21, బీజేపీకి 10 ఎమ్మెల్యే స్థానాలు పోగా, 144 స్థానాల్లో టీడీపీ పోటీ చేస్తోంది. ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన చంద్రబాబు ఎంపీ సీట్లపై ఇంకా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారు.

రెండో జాబితా సీట్లు

పార్లమెంటు పరిధి	నియోజకవర్గం	అభ్యర్థి పేరు
శ్రీకాకుళం	నరసన్నపేట	బొగ్గు రమణమూర్తి
విశాఖపట్నం	గాజువాక	పల్లా శ్రీనివాసరావు
అనకాపల్లి	చోడవరం	కేఎస్ఎన్ఎస్ రాజు
అనకాపల్లి	మాడుగల	పైలా ప్రసాద్
కాకినాడ	ప్రత్తిపాడు	వరుపుల సత్యప్రభ
అమలాపురం	రామచంద్రపురం	వాసంశెట్టి సుభాష్
రాజమండ్రి	రాజమండ్రి రూరల్	గోరంట్ల బుచ్చయ్యచౌదరి
అరకు	రంపచోడవరం (ఎస్టీ)	మిర్యాల శిరీష
రాజమండ్రి	కొవ్వూరు (ఎస్సీ)	ముప్పిడి వెంకటేశ్వరరావు
ఏలూరు	దెందులూరు	చింతమనేని ప్రభాకర్
రాజమండ్రి	గోపాలపురం (ఎస్సీ)	మద్దిపాటి వెంకటరాజు
నరసరావుపేట	పెదకూరపాడు	భాష్యం ప్రవీణ్
గుంటూర	గుంటూరు వెస్ట్	పిడుగురాళ్ల మాధవి
గుంటూరు	గుంటూరు ఈస్	మహమ్మద్ నజీర్
నరసరావుపేట	గురజాల	యరపతినేని శ్రీనివాసరావు
నెల్లూరు	కందుకూరు	ఇంటూరి నాగేశ్వరరావు
ఒంగోలు	మార్కాపురం	కందుల నారాయణరెడ్డి
ఒంగోలు	గిద్దలూరు	అశోక్‌రెడ్డి
నెల్లూరు	ఆత్మకూరు	ఆనం రాంనారాయణరెడ్డి
నెల్లూరు	కోవూరు	వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
తిరుపతి	వెంకటగిరి	కురుగొండ్ల లక్ష్మీప్రియ
కడప	కమలాపురం	పుత్తా చైతన్యరెడ్డి
కడప	ప్రొద్దుటూరు	వరదరాజులరెడ్డి
నంద్యాల	నందికొట్కూరు (ఎస్సీ)	గిత్తా జయసూర్య
కర్నూలు	ఎమ్మిగనూరు	జయనాగేశ్వర్‌రెడ్డి
కర్నూలు	మంత్రాలయం	రాఘవేంద్రరెడ్డి
హిందూపురం	పుట్టపర్తి	పల్లె సింధూరారెడ్డి
హిందూపురం	కదిరి	కందికుంట యశోదాదేవి
రాజంపేట	మదనపల్లి	షాజహాన్ బాషా
రాజంపేట	పుంగనూరు	చల్లా రామచంద్రారెడ్డి (బాబు)
చిత్తూరు	చంద్రగిరి	పులివర్తి వెంకట మణి ప్రసాద్
తిరుపతి	శ్రీకాళహస్తి	బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి
తిరుపతి	సత్యవేడు (ఎస్సీ)	కోనేటి ఆదిమూలం
చిత్తూరు	పూతలపట్టు (ఎస్సీ)	డాక్టర్ కలికిరి మురళీమోహన్

ఫ్యాషన్



వసంతకాలం గులాల్

ప్రతి కుట్టు ఒక కథ చెబుతుంది
ప్రతి దారం పోగు మన దేశీయ సంప్రదాయపు సొగసును కళ్లకు కడుతుంది.
ప్రతి డిజైన్ సృష్టిలోనూ అసమానమైన నైపుణ్యం కనిపిస్తుంది.
కళా నైపుణ్యంతో రూపొందించిన ప్రతి డ్రెస్ ఓ కళాఖండమే అనిపిస్తుంది.
భారతీయ వస్త్రాలు, ఫ్యాషన్ వారసత్వం
ప్రపంచాన్ని అబ్బుర పరుస్తూ స్ఫూర్తిని కలిగించేలా
ఇండియన్ డిజైనర్ గౌరంగ్ షా
'గులాల్' పేరుతో ఈ వసంతకాలానికి అందమైన
కలెక్షన్‌ని మన ముందుకు తీసుకువచ్చారు.



ఫ్యాషన్ డిజైనర్
గౌరంగ్ షా

ముంబై వేదికగా జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్ స్ప్రింగ్/ఫెస్టివ్ కలెక్షన్ 2024 లో భాగంగా 'గులాల్' పేరుతో గులాబీ రంగులో మెరుస్తున్న డిజైన్స్‌ని ఇండియన్ డిజైనర్ గౌరంగ్ షా ప్రదర్శించారు. ఖాదీ, పట్టు మెటీరియల్‌తో రూపొందించిన డిజైన్స్‌తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు.

ఈ డిజైన్స్ గురించి గౌరంగ్ షా మాట్లాడుతూ – ''సాంస్కృతిక సొబగులతో పాటు ఆధునికత కూడా మేళవించి 40 డిజైన్స్ రూపొందించాం. వాటిలో 30 లెహంగాలు, 10 చీరలు ఉన్నాయి. ప్రతి డ్రెస్‌లో మన చేనేతల్లోని కళాత్మకత భాసిల్లుతుంది. 'గులాల్' స్వచ్ఛత, చిత్తశుద్ధి, శాంతిని సూచిస్తుంది. జమదానీ, జ్యాక్వర్, డోబీ అనేవి చరఖా ఖాదీ, మట్కా సిల్క్, ఇతర పట్టు వస్త్రాలను రూపొందించడానికి ఉపయోగించే డైనమిక్ నేత పద్ధతులు. ప్రతి వస్త్రాన్ని చేతితో నేసేటప్పుడు ఆ చేనేతకారుడి భావోద్వేగాలు, లక్షణాలు ప్రతి వరసలోనూ జోడించినట్టు అనిపిస్తాయి.

సంగీత నృత్యాలు

గుజరాతీ జానపద సంగీతం, కేరళ కథాకళీ నృత్య సమ్మేళనంతో కూడిన ఆకర్షణీయత ఈ దుస్తుల ద్వారా మన హృదయాలను చేరుతుంది. వీటితోపాటు ఉల్లాసభరితమైన రాధా కృష్ణుల హోలీ కథ, నృత్యం ప్రదర్శనలో అదనపు ఆకర్షణగా నిలిచాయి. .

సాధారణంగా హోలీ వేడుకలను తెలుపు రంగు డ్రెస్సులు ధరించి జరుపుకుంటారు. ఈ వసంతకాలం మన మానసిక స్థితిని ప్రతిబింబించేలా లేత, గాఢమైన గులాబీ రంగుల కాంబినేషన్‌లో ఈ డ్రెస్సులను రూపొందించాం. ఈ కలెక్షన్ ఇలా వేదికపైన మెరిసిపోవడానికి ఆరు నెలల కన్నా ఎక్కువ సమయమే పట్టింది. స్కెచ్ నుండి నేత వరకు, ఆ తర్వాత మరుగునపడిన ఎంబ్రాయిడరీలను హైలైట్ చేస్తూ లెహంగాలు, చీరలను డిజైన్ చేశాం. గులాల్ కలెక్షన్‌లో పటాన్ పటోలా, పార్సీ గారా ఎంబ్రాయిడరీతో అలంకరించిన లెహంగా, కర్నాటకలో చేతితో నేసే క్రేప్ సిల్క్ దుపట్టాలు ఉన్నాయి. పటాన్‌పటోలా దుపట్టాతో పాటు కోటా జమదానీ, బనారస్ సిల్క్ బార్డర్‌తో ఉన్న లెహంగాలు వినూత్నంగా మెరిసిపోయాయి.

అరుదైన ఎంబ్రాయిడరీ

ఈ కలెక్షన్లో మోచి, పార్సీగారా, కుసుతి, కాశ్మీరీ, కచ్ వంటి క్లిష్టమైన ఎంబ్రాయిడరీ స్టైల్స్‌తో లెహంగాలు, చీరలు రూపొందించాం. ముఖ్యంగా అహ్మదాబాద్‌లోని మరొడి, కేరళలోని పెటిట్ పాయింట్ వంటి అరుదైన ఎంబ్రాయిడరీలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

వస్త్ర శిల్పకళ

చేనేతలో జ్యార్డ్, డోబీ, జమదానీ టెక్నిక్స్ మాత్రమే కాదు ప్రతీ డిజైన్ వస్త్ర శిల్పకళగా కనిపిస్తుంది. మన దేశ కళా నైపుణ్యం ఈ డిజైన్స్‌లో కనువిందు చేస్తాయి. ప్రతి కుట్టు ఒక కథ చెబుతుంది' అని వివరించారు గౌరంగ్ షా.

కిచెన్ టిప్స్

గరం రుచి కోసం

● కూరల్లో గరం మసాలా పొడులు మోతాదు మించితే కూర రుచి మారిపోతుంది, చేదు వస్తుంది. అలా చేదు వచ్చినప్పుడు కూరల్లో అర కప్పు చిక్కటి పాలు లేదా టేబుల్ స్పూన్ మీగడ కలపాలి. పాలు, పాల ఉత్పత్తులు ఇష్టపడని వాళ్లు జీడిపప్పు పొడి లేదా వేరుశనగపప్పు పొడి కూడా కలుపుకోవచ్చు. ఇలా చేస్తే చేదు తగ్గడంతో పాటు కూర రుచి ఇనుమడిస్తుంది కూడా.

● మార్కెట్‌లో కొన్న మసాలా పొడుల్లో ప్యాకెట్ సీలు విప్పినప్పుడు ఉన్నంత సువాసన ఆ తర్వాత ఉండదు. కాబట్టి చిన్న చిన్న ప్యాకెట్‌లు కొనుక్కుని తెరిచిన వెంటనే మొత్తం వాడేయడం ఒక పద్ధతి. పెద్ద ప్యాకెట్ కొన్నప్పుడు కొద్దిగా వాడిన తర్వాత ప్యాకెట్‌లోకి గాలి దూరకుండా క్లిప్ పెట్టాలి.



● గరం మసాలా పొడులను ఇంట్లోనే ఎక్కువ మోతాదులో చేసి నిల్వ ఉంచుకోవాలంటే... పొడిని తేమలేని సీసాలో పోసి గాలి చొరకుండా మూతపెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇలా చేసిన పొడి ఏడాదంతా నిల్వ ఉంచినా తాజాదనం తగ్గదు.

బామ్మ మాట.... బిజినెస్ బాట

పెద్దల మాట పెరుగన్నం మూట
అని ఊరికే అనలేదు.
పెద్దల మాట నెలకు
లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఆర్జించే
పెద్ద వ్యాపార సూత్రంగా మారింది.



ముంబైకి చెందిన రజని, నిధి 'గ్రాండ్‌మా సీక్రెట్' పేరుతో సరదాగా ప్రారంభించిన హోమ్ మేడ్ హెయిల్ ఆయిల్ బిజినెస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఉద్యోగంలో వచ్చే జీతం కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ ఆదాయాన్ని చేకూర్చుతోంది. దీనిని బట్టి ఏదైనా పాతకాలం నాటి కబుర్లు చెప్పినా, పాతపద్ధతులు పాటించినా, అంతా పాత చింతకాయ పచ్చడిలే అని తేలిగ్గా తీసేసే వారు ఇకపై ఆచితూచి మాట్లాడాలేమో! ఎందుకంటే

అప్పటి పాత ఫార్ములానే కదా... ఇప్పుడు సక్సెస్ సూత్రంగా మారిపోయింది.

నిధి టుటేజాకి ఆదివారం సెలవును అమ్మమ్మ ఇంటిలో సరదాగా గడపటం అలవాటు. నిధి అమ్మమ్మ రకరకాల ఔషధ మూలికలను మేళవించి ఒక విధమైన తలనూనెను తయారు చేసేది. అలా ఆమె సొంతంగా తయారు చేసిన ఆయిల్‌తో నిధి తలకు మర్దనా చేసి కాసేపటి తర్వాత తలస్నానం చేయించేది. అమ్మమ్మ చేతి నూనె మహాత్మ్యం వల్ల నిధికి తోటి విద్యార్థినులందరూ కుళ్లుకునేంత నల్లటి ఒత్తైన కేశ నిధి ఉండేది. చదువు తర్వాత అమ్మమ్మ ఊరికి వెళ్లడం బాగా తగ్గిపోయింది. ఇంతలో దేశాన్నంతటినీ కుదిపేస్తున్న కోవిడ్ మహమ్మారి గురుగ్రామ్‌ను కూడా వదల్లేదు. అక్కడే ఉన్న నిధిని కూడా అసలు వదల్లేదు. ఫలితంగా నిధి జుట్టు కుచ్చులు కుచ్చులుగా ఊడటం మొదలు పెట్టింది. క్రమంగా ఆమెను ఇతరులెవరూ పోల్చుకోలేనట్లు తయారైంది. అది చూసిన నిధి తల్లికి చాలా బాధ వేసింది. తన అమ్మ నుంచి ఆ నూనె తయారీ ఫార్ములాను తెలుసుకుని, తన అత్తగారు ఈ విషయంలో ఏమైనా సాయం చేయగలరా అని అడిగింది. కోడలు చెప్పిన ఫార్ములాను ప్రయత్నించింది అత్తగారైన రజని. ఎట్టకేలకు తయారైన ఆ ఆయిల్‌ను నిధి తలకు రాసి మర్దనా చెయ్యడం మొదలు పెట్టారు ఆ అత్తాకోడళ్లు.

ఆశ్చర్యం! కొద్దిరోజుల్లోనే ఆ నూనె మంచి ఫలితాన్నిచ్చింది. పోయిన జుట్టు స్థానంలో కొత్త జుట్టు రావడం మొదలైంది. ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని ఇతర ఫ్లాట్ల వాళ్లు అది గమనించి, ఎలా సాధ్యమైంది ఇదంతా అని అడిగి విషయాన్ని తెలుసుకున్నారు. తమకు కూడా అలాంటి ఆయిల్ తయారు చేసి ఇమ్మని అడగడమే కాదు, అడ్వాన్స్‌గా కొంత మొత్తాన్ని చేతిలో పెట్టడం మొదలు పెట్టారు. ఇదేదో బాగుంది అనిపించింది నిధికి. దాంతో తన నానమ్మ రజని సాయంతో, అమ్మ సహకారంతో ఆయిల్ తయారీ ఆరంభించింది. వీరి ఆయిల్ గురించి ఆ నోటా ఈ నోటా కాదు... కొన్ని డజన్ల వాట్సాప్ గ్రూపులలో పడి మొదట్లో కొద్ది లీటర్లకే పరిమితం అయిన ఆయిల్ తయారీ పెద్దఎత్తున తయారు చేయాలన్న నిర్ణయం తీసుకునేలా చేసింది. దాంతో గత సంవత్సరం మార్చిలో నిధి, రజిని దువా కలిసి 'నిధిస్ గ్రాండ్ మా సీక్రెట్' పేరుతో ఒక సరికొత్త ఆయిల్ బ్రాండ్ ఉత్పత్తిని ప్రారంభించారు. ఫలితంగా అందరి జుట్టు పెరగడం మాట ఎలా ఉన్నా, వీరి ఆదాయం మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది.

ఇప్పుడు నిధి, రజని తయారు చేస్తున్న ఈ ఆయిల్ 67,000 ఇళ్లకు చేరింది. నెలకు లక్ష బాటిళ్ల తయారీతో నెలకు సుమారు యాభై లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది.

అమ్మమ్మ ఫార్ములా ప్రకారం ఇప్పుడు నిధి, ఆమెతో పాటు ఆమె నానమ్మగారు... స్వచ్ఛమైన కొబ్బరి నూనెలో 13 రకాల వనమూలికల కలగలుపుతో పెద్ద ఇనుప మూకుడులో కొన్ని గంటలపాటు మరగబెడుతూ, కలుపుతూ తయారు చేసిన ఈ హోమ్ మేడ్ ఆయిల్ ఇప్పుడు పెద్దపెద్ద యంత్రాలతో లక్షల బాటిళ్ల తయారీ లక్ష్యాన్ని చేరుకుంది.

పాత కాలం నాటి ఫార్ములాను తేలికగా చూసే వాళ్లు ఇకనైనా ఇలాంటి విద్యను అందిపుచ్చుకుంటే ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడటం సాధ్యం అవుతుందేమో!

వంటిల్లు

చలికాలం...
సగ్గుబియ్యం హల్వా తింటే
జలుబు చేస్తోందా!
అయితే... ఇదే మంచి సమయం.
ఎండల్లో వండుకుందాం.
సగ్గుబియ్యం చలవ చేస్తుంది...
ఎండ తాపాన్ని తగ్గిస్తుంది.
దహీ... కేసర్... కోవాతోపాటు
పొటాటోతోనూ కలిసిపోతుంది.
ఈవెనింగ్ స్నాక్ అవుతుంది...
లంచ్‌లో మెయిన్ కోర్స్ అవుతుంది.
భోజనం తర్వాత డెజర్ట్ గానూ సర్దుకుపోతుంది.

సగ్గుబియ్యం వేసవిలో తిందాం



దహీ సాబుదానా

కావలసినవి: సగ్గుబియ్యం – అరకప్పు; పెరుగు – రెండున్నర కప్పులు; పచ్చిమిర్చి – 3; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; క్యారట్ తురుము – 2 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – 3 టీ స్పూన్‌లు; కరివేపాకు – 2 రెమ్మలు; ఇంగువ – చిటికెడు.

తయారీ: ● స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి వేడెక్కిన తర్వాత మంట తగ్గించి, బాణలిలో సగ్గుబియ్యం వేసి వేయించాలి. సగ్గుబియ్యం చిటపట పేలడం మొదలైన తర్వాత బాణలిని స్టవ్ మీద నుంచి దించి పక్కన పెట్టాలి ● పెరుగును పెద్ద పాత్రలో వేసి ఉప్పు కలిపి చిలకాలి. పెరుగు మరీ చిక్కగా ఉంటే చిలికేటప్పుడు కొద్దిగా నీటిని వేయవచ్చు. చల్లారిన సగ్గుబియ్యాన్ని పెరుగులో వేసి కలిపి నాలుగు గంటల సేపు కదిలించకుండా పక్కన పెట్టాలి. పెరుగును పీల్చుకుని సగ్గుబియ్యం మెత్తబడుతుంది. లోపల ఇంకా గట్టిగా ఉన్నట్లనిపిస్తే మరో గంట సేపు నాననివ్వాలి ● ఇప్పుడు బాణలిలో నూనె వేసి వేడి చేసి ఆవాలు, పచ్చి శనగ పప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి, అల్లం, పసుపు, క్యారట్ వేసి అవి వేగిన తరవాత ఇంగువ, కరివేపాకు వేసి దించేయాలి. ఈ పోపును పెరుగులో నానిన సగ్గుబియ్యంలో వేసి కలపాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే దహీ సాబుదానా... అదే సగ్గుబియ్యం పెరుగు పచ్చడి రెడీ. పెరుగన్నం తినడానికి ఇష్టపడని పిల్లలకు ఇది పెట్టండి. ఇష్టంగా తింటారు. ఎండకు వడదెబ్బ తలగకుండా హాయిగా ఆడుకుంటారు.



సాబుదానా కిచిడీ

కావలసినవి: సగ్గుబియ్యం – కప్పు; నీరు – ముప్పావు కప్పు; వేరుశనగపప్పు – అర కప్పు; చక్కెర – టీ స్పూన్ (ఇష్టమైతేనే); ఉప్పు – ముప్పావు టీ స్పూన్; నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; అల్లం – అంగుళం ముక్క (తరగాలి); పచ్చిమిర్చి– 2 (తరగాలి); బంగాళాదుంప– ఒకటి (ఉడికించి, తొక్కతీసి, తరగాలి); నిమ్మకాయ – ఒక ముక్క; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి మంచినీటిలో ఆరు గంటల సేపు నానబెట్టాలి. సగ్గుబియ్యాన్ని రెండు వేళ్లతో పట్టుకుని నొక్కినప్పుడు పూర్తిగా నానిందా లేక లోపల గట్టిగా ఉందా అనేది తెలుస్తుంది. గట్టిగా ఉంటే మరికొన్ని నీటిని పోసి పూర్తిగా నానే వరకు పక్కన ఉంచాలి ● మందపాటి బాణలి వేడి చేసి వేరుశనగపప్పు వేయించాలి. పప్పులు చల్లారిన తర్వాత మిక్సీలో మెత్తగా పొడి చేయాలి ● నానిన సగ్గుబియ్యంలో వేరుశనగపప్పు పొడి, ఉప్పు, చక్కెర వేసి కలపాలి ● బాణలి వేడి చేసి నెయ్యి వేసి, వేడెక్కిన తర్వాత ఆవాలు, జీలకర్ర, అల్లం, పచ్చిమిర్చి, కరివేపాకు, బంగాళాదుంప ముక్కలు వేసి దోరగా వచ్చే వరకు వేయించాలి. ఇప్పుడు సగ్గుబియ్యం మిశ్రమాన్ని వేసి పోపు మొత్తం సమంగా కలిసేటట్లు చెక్క అట్లకాడతో కలపాలి. చివరగా నిమ్మరసం, కొత్తిమీర కలిపి వడ్డించాలి. ఇది వేడిగా తినడానికి బాగుంటుంది. వేడి తగ్గిన తర్వాత కూడా రుచిగానే ఉంటుంది. కాబట్టి లంచ్‌బాక్సు కోసం కూడా చేసుకోవచ్చు.



కేసర్ సాబుదానా

కావలసినవి: సగ్గుబియ్యం– కప్పు; చక్కెర – కప్పు; ఏలకుల పొడి– టీ స్పూన్; కుంకుమ పువ్వు – ఆరు రేకలు; జీడిపప్పు – టేబుల్ స్పూన్; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు; వేడి పాలు – టేబుల్ స్పూన్.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి ఆరు గంటల సేపు నానబెట్టాలి. పట్టుకుని చూసి పూర్తిగా నానినట్లు నిర్ధారించుకుని మిగిలిన నీటిని వడపోసి సగ్గుబియ్యాన్ని ఒక వస్త్రంలో వేసి మూట గట్టాలి ● పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన పెట్టాలి ● పెనంలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేయించాలి. అందులో పసుపు, చక్కెర, కుంకుమ పువ్వు కలిపిన పాలు వేసి ఐదు నిమిషాల సేపు మరగనివ్వాలి. ఇప్పుడు సగ్గుబియ్యం వేసి కలిపితే కేసర్ సాబుదానా రెడీ.

సాబుదానా హల్వా



కావలసినవి: సగ్గుబియ్యం– కప్పు; చక్కెర – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు; ఫుడ్ కలర్– చిటికెడు; ఏలకుల పొడి– అర టీ స్పూన్; జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; పాల కోవా– 2 టేబుల్ స్పూన్‌లు లేదా చిక్కటి పాలు కప్పు; నీరు – 2 కప్పులు.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి నీరు పోసి ప్రెషర్ కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేయించాలి. వేగిన జీడిపప్పు, కిస్‌మిస్‌ను తీసి పక్కన పెట్టి అదే బాణలిలో ఉడికిన సగ్గుబియ్యం, చక్కెర, ఫుడ్ కలర్ వేసి కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం దగ్గరయ్యేటప్పుడు పాల కోవా వేసి కలపాలి. కోవా లేకపోతే పాలు పోసి, ఏలకుల పొడి వేసి దగ్గరయ్యే వరకు కలుపుతూ ఉడికించాలి. చివరగా వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి కలిపితే సాబుదానా హల్వా రెడీ.

యువర్స్

● గేమింగ్



ఏ చీకట్లో ఏ శక్తి దాగుందో!

సర్వైవల్ హారర్ గేమ్ 'ఎలోన్ ఇన్ ది డార్క్' ఈ నెల 20న విడుదల కానుంది. 'ఎలోన్ ఇన్ ది డార్క్' వీడియో సిరీస్‌లో భాగంగా వస్తున్న 7వ ఇన్‌స్టాల్ ఇది. గేమ్ కథ విషయానికి వస్తే... గత గేమ్‌లలోలాగే ఈ గేమ్‌లో కూడా ఎడ్వర్డ్ కార్న్‌బీ, ఎమిలీ హార్ట్‌వర్డ్‌లు ప్లేబుల్ క్యారెక్టర్స్. ఎమిలీ హార్ట్‌వుడ్ అంకుల్ జెర్మీ హార్ట్‌వుడ్ అదృశ్యమైపోతాడు. అతడి జాడను కనుగొనడానికి ప్రైవేట్ డిటెక్టివ్ ఎడ్వర్డ్ కార్న్‌బీతో కలిసి బయలుదేరుతాడు, ఈ ప్రయాణంలో ఎన్నిప్రమాదాలు ఎదురయ్యాయి, ఎలాంటి సవాళ్లు చుట్టుముట్టాయి అనేదే గేమ్ స్టోరీ. 'న్యూ ఎలోన్ ఇన్ ది డార్క్ సస్పెన్స్‌ఫుల్ ఎక్స్‌ప్లోరేషన్, ఇంటెన్స్ కంబాట్‌తో, చాలెంజింగ్ పజిల్స్‌తో అడుగడుగునా ఆసక్తి రేపుతుంది' అంటున్నారు గేమ్ మేకర్స్.

తేనె పాటల హనియా

● మ్యూజిక్ వరల్డ్


● హనియా

లాక్‌డౌన్ కాలంలో దొరికిన విరామంలో ఎంతోమంది తమలోని క్రియేటివ్ టాలెంట్స్‌ను మెరుగు పరుచుకున్నారు. అలాంటి వారిలో హనియా ఒకరు. కేరళలోని కోచికి చెందిన హనియా నసిఫా లాక్‌డౌన్‌లో ఖాళీ సమయం దొరకడంతో సంగీతం నేర్చుకోవడం ప్రారంభించింది. 'నాకు ఎలాంటి సంగీత నేపథ్యం లేదు. అయితే పాటలను రాసి ట్యూన్ చేస్తున్నప్పుడు ఎంతో సంతోషంగా అనిపించేది. అలా పాటలనేవి నా దిన్యచర్యలో భాగం అయ్యాయి' అంటుంది హనియా. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ట్రాక్స్ వైరల్ అయ్యాయి. ఇది హనియాను లైమ్‌లైట్‌లోకి తీసుకువచ్చింది. 'నా షార్ట్ మ్యూజిక్ క్లిప్స్‌కు వేలల్లో వ్యూస్ రావడం మొదలు కావడంతో మరింత ఉత్సాహం వచ్చింది. ఇక అప్పటి నుంచి పాటలను ప్రొఫెషనల్‌గా రికార్డ్ చేయడం ప్రారంభించాను. మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను అప్‌గ్రేడ్ చేశాను' అంటుంది ఇరవై సంవత్సరాల హనియా. హనియా తన టాలెంట్‌తో సోషల్ మీడియా నుంచి ఫిల్మ్ ఇండస్ట్రీకి రావడానికి ఎంతో కాలం పట్టలేదు. మన తెలుగు సినిమా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'లో 'జిందగీ' అనే పాటను పాడింది.

త్రో ఇన్ ది టవల్



పోరాటాన్ని విరమించడం, ఓటమి, లొంగిపోవడం మొదలైన సందర్భాల్లో ఉపయోగించే మాట...త్రో ఇన్ ది టవల్.

ఉదా: ఆఫ్టర్ హవర్స్ ఆఫ్ స్ట్రగులింగ్ విత్ ది కాంప్లెక్ మ్యాథ్స్ ప్రాబ్లం జాన్ డిసైడెడ్ టు త్రో ఇన్ ఇది టవల్. మూలం: 19వ శతాబ్దంలో బాక్సింగ్ నుంచి పుట్టిన మాట ఇది. బాక్సర్ ఓటమిని అంగీకరించాడని తెలియజేయడానికి ఇన్‌స్ట్రక్టర్లు టవల్‌ను రింగ్‌లోకి విసిరేసేవారు. ఈ ఫ్రేజ్‌కు 'టాస్ ఇన్ ది టవల్' 'ఫ్లింగ్ ఇన్ ది టవల్'లాంటి వేరియేషన్స్ కూడా ఉన్నాయి.

● ఇన్నోవేషన్


● అద్రిత్

లోకం మెచ్చిన కోడింగ్ మాంత్రికుడు

'అబ్బ...ఖాళీ సమయం దొరికింది. ఎంజాయ్ చేయాలి' అనుకునేవారు కొందరు. 'ఖాళీ సమయం దొరికింది....ఏదైనా నేర్చుకోవాలి' అనుకునే వారు మరికొందరు. అద్రిత్‌రావు రెండో కోవకు చెందిన కుర్రాడు.

కోవిడ్ మహమ్మారి సమయంలో దొరికిన విరామంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఎన్నో సాంకేతిక విషయాలను స్వయంగా నేర్చుకున్నాడు. కోడింగ్ మాంత్రికుడిగా పేరు తెచ్చుకున్నాడు...

'కోడింగ్ మేధావి'గా పేరుగాంచిన ఇండియన్-అమెరికన్ అద్రిత్‌రావు యాప్ డెవలప్‌మెంట్ వరల్డ్, డిజిటల్ హెల్త్ ఇన్నోవేషన్‌లో తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. కాలిఫోర్నియాకు చెందిన పదహారు సంవత్సరాల అద్రిత్ ఎన్నో యాప్‌లను రూపొందించి టెక్ దిగ్గజం యాపిల్ ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో హెల్త్‌కేర్‌కు సంబంధించిన కట్టింగ్-ఎడ్జ్ రిసెర్చ్‌లో భాగం అయ్యాడు.

ఎనిమిదేళ్ల వయసులో కోడింగ్‌తో ప్రయాణం ప్రారంభించాడు అద్రిత్. 'బ్లాక్ ప్రోగ్రామింగ్'తో కంప్యూటర్ సైన్స్‌తో పరిచయం అయింది. ఆ పరిచయం ఇష్టం అయింది. ఆ ఇష్టం శోధనకు మూలం అయింది.

కంప్యూటర్ సైన్స్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన అద్రిత్ ట్రెడిషనల్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లను గురించి ఆసక్తిగా తెలుసుకోవడం ప్రారంభించి ఆ తరువాత వాటిపై పట్టు సాధించాడు. కోవిడ్ మహమ్మారి సమయంలో అద్రిత్‌కు బోలెడు ఖాళీ సమయం దొరికింది. ఈ ఖాళీ సమయంలో యూట్యూబ్, ఇతర ఆన్‌లైన్ వనరుల ద్వారా యాప్ డెవలప్‌మెంట్ నేర్చుకున్నాడు. పన్నెండేళ్ల వయసులో ఆపిల్ వరల్డ్ వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ సిఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్‌లో అద్రిత్‌రావు విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆపిల్ సీఈవో టిమ్ కుక్‌ను కలిసే అరుదైన అవకాశం లభించింది.

'అదొక ఉత్తేజకరమైన అనుభవం. యాప్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి నా ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రేరణ ఇచ్చింది' కుక్‌తో జరిగిన మీటింగ్ గురించి చెబుతాడు అద్రిత్.

సినిమాలు, టీవీ షోలను చూడడానికి ప్రేక్షకులకు సహాయపడే యాప్‌ల నుంచి ఆరోగ్య సంరక్షణలో ఉపయోగపడే యాప్‌ల వరకు...అద్రిత్ ఖాతాలో వినూత్న యాప్‌లు ఎన్నో ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది బధిరులు ఉన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఇతరులతో వారికి ఎదురవుతున్న సమస్యల గురించి అధ్యయనం చేసిన అద్రిత్‌కు వారి హావభావాలను ఐఫోన్ కెమెరా ద్వారా స్పీచ్‌గా మార్చాలనే ఆలోచన వచ్చింది. ఆ తరువాత 'సిగ్నర్' అనే యాప్ ద్వారా తన ఆలోచనను నిజం చేసుకున్నాడు.

పదమూడు సంవత్సరాల వయసులో చదివిన ఒక వ్యాసం ద్వారా అద్రిత్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తి పెరిగింది. ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉయోగించాలనే ప్రయత్నంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో రిసెర్చ్ ఇంటెర్న్‌షిప్ ప్రారంభించాడు అద్రిత్.

వ్యాధులను గుర్తించే, స్టాండ్‌ఔట్ ఇన్నోవేషన్‌గా చెప్పబడుతున్న 'ఆటోఏబీఐ'లాంటి ఐఫోన్ యాప్‌లు క్లినికల్ ట్రయల్స్, పేటెంట్ ప్రాసెస్‌లో ఉన్నాయి. పది సైంటిఫిక్ రిసెర్చ్ పేపర్‌లను ప్రచురించిన అద్రిత్ డిజిటల్ హెల్త్ సోల్యూషన్స్‌కు సంబంధించి క్రియాశీల పాత్ర పోషిస్తున్నాడు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్‌లపై పని చేయడానికి సిలికాన్ వ్యాలీలో ఎక్కువ సమయం గడిపినప్పటికీ 'సాంకేతిక సహాయంతో ఆరోగ్య సంరక్షణ' అంశంపై ఎక్కువ దృష్టి పెట్టాడు అద్రిత్. 'వైద్యుల స్థానాన్ని ఏఐ భర్తీ చేయాలని నేను అనుకోవడం లేదు. అయితే అది వైద్యులకు సహాయపడుతుంది' అంటున్నాడు.

ఈ కోడింగ్ మాంత్రికుడిలోని మరో కోణం...లాభాపేక్ష లేకుండా యంగ్ ఇన్నోవేటర్స్ కోసం పాఠాలు బోధిస్తున్నాడు. ఎంతోమందికి విలువైన సలహాలు ఇస్తున్నాడు.

వయసు అడ్డంకి కాదు...



కొత్త ఆవిష్కరణలకు వయసు అనేది అడ్డు కాదు. అభిరుచి అనేది ఆవిష్కరణకు ప్రమాణం. మనం ఇష్ట పడుతున్న సబ్జెక్ట్‌పై ఎంత ఎక్కువ సమయాన్ని కేటాయిస్తే అంత విజయం సాధించగలం. కాలం అనేది విలువైనది. విలువైన కాలాన్ని వృథా చేయకుండా విలువైన విషయాలపై దృష్టి పెడితే అద్భుతాలు సాధించగలం. మార్పును తీసుకురాగలం.

\- అద్రిత్

● టెక్... టాక్

గూగుల్ ఫోటోస్ మ్యాప్ వ్యూ



మోస్ట్ పాపులర్ అప్లికేషన్ 'గూగుల్ ఫొటోస్'లో 'మ్యాప్ వ్యూ' సహాయంతో ఫోటోను ఎక్కడ కాప్చర్ చేశారో తెలుసుకోవచ్చు. దీని కోసం...

- గూగుల్ ఫోటోస్-ఓపెన్ * బాటమ్ బార్‌లోని 'సెర్చ్ సెక్షన్'లోకి వెళ్లాలి.
- 'ప్లేసెస్'లో 'యువర్ మ్యాప్'ను ట్యాప్ చేయాలి.
- మీ ఫోటోల టైమ్‌లైన్, ఎక్కడి నుంచి ఫోటోలు తీసుకున్నారు అనేదానికి సంబంధించి హీట్‌మ్యాప్ కనిపిస్తుంది
- బ్లూ బబుల్స్ పై క్లిక్ చేస్తే ఏ లొకేషన్‌లో ఫోటోలు కాప్చర్ చేశారో తెలుస్తుంది.
- పర్టిక్యులర్ లొకేషన్‌కు సంబంధించి జూమ్ ఔట్ అండ్ జూమ్ ఇన్ చేయవచ్చు.

వివో వి 30



డిస్‌ప్లే	:	6.78 అంగుళాలు
రిజల్యూషన్	:	1260X2800 పిక్సెల్స్
మెమోరీ	:	128జీబి 8జీబి ర్యామ్/ 256 జీబీ 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
ఓఎస్	:	ఆండ్రాయిడ్ 14
బ్యాటరీ	:	5000 ఎంఏహెచ్

3డీ హెచ్‌డీ ఫోన్ హోల్డర్



డ్రీమ్‌స్టోన్ స్క్రీన్ ఎక్స్‌పాండర్స్ అండ్ స్క్రీన్ మాగ్నిఫైయర్, 3డీ హెచ్ ఫోన్ హోల్డర్

బ్రాండ్: డ్రీమ్‌స్టోన్

కలర్: మల్టీ కలర్

మోడల్: న్యూ.3డీ. మ్యాగ్నిఫైయర్- 599

ప్యాకేజ్ డైమెన్షన్స్: 23.3X21.6X1 సీఎం 150 గ్రా.

పోకో ఎక్స్6 నియో



సైజ్	:	6.67 అంగుళాలు
స్టోరేజ్	:	12జీబి ర్యామ్ అండ్ 256 జీబి
రిఫ్రెష్‌రేట్	:	120 హెచ్‌జడ్
సెల్ఫీ కెమెరా	:	16 ఎంపీ
బ్యాటరీ	:	5, 000 ఎంఏహెచ్
కలర్స్	:	ఆస్ట్రాల్ బ్లాక్, బ్లూ, మార్టియన్ ఆరేంజ్

సినిమా

తంగలాన్ రెడీ


● విక్రమ్

విక్రమ్ హీరోగా నటించిన 'తంగలాన్' సినిమా కోసం ఆయన అభిమానులతో పాటు సగటు సినీ ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో పార్వతి, మాళవికా మోహన్, పశుపతి, హాలీవుడ్ నటుడు డేనియల్ కాల్టాగిరోన్ కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో విక్రమ్ ఓ గిరిజన తెగ నాయకుడి పాత్రలో నటించారని సమాచారం. ఆ మధ్య విడుదలైన టీజర్‌తో 'తంగలాన్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఏడాది జనవరి 26న తప్పకుండా రిలీజ్ అవుతుందనుకున్నారంతా. కానీ 'తంగలాన్' అప్పుడు వెండితెరపైకి రాలేదు. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'తంగలాన్' విడుదలపై క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు చిత్రదర్శకుడు పా. రంజిత్. ''తంగలాన్' అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సెన్సార్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేశాం. ప్రస్తుతం ఎన్నికల తేదీల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాం. ఎన్నికలు పూర్తయ్యాక ఈ మూవీ రిలీజ్ చేస్తాం. మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది '' అన్నారు పా. రంజిత్. ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ,

పుట్టినరోజుకి జరగండి!


● రామ్‌చరణ్

వైజాగ్ వెళ్లాడు గేమ్‌చేంజర్. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ వైజాగ్‌లో ప్రారంభం కానుంది. ఈ వారంలో ఆరంభం కానున్న ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్ పాల్గొంటారు. రామ్‌చరణ్ పాల్గొనగా కొన్ని ముఖ్య సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట మేకర్స్. అలాగే ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'గేమ్‌చేంజర్' సినిమాలోని 'జరగండి..' పాట లిరికల్ వీడియో విడుదల కానుంది. అంజలి, నవీన్‌చంద్ర, శ్రీకాంత్, సునీల్, జయరాం, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ స్వరకర్త.

చెన్నైకి వేటగాడు


● రజనీకాంత్

హైదరాబాద్‌లో పని ముగించుకుని చెన్నైకు వెళ్లాడు వేటగాడు. హీరో రజనీకాంత్ టైటిల్ రోల్‌లో టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, రితికా సింగ్, దుషారా విజయన్, మంజు వారియర్ కీలక పాత్రధారులు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన 'వేట్టయాన్' సినిమా షెడ్యూల్ ముగిసింది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, రానా, రితికా సింగ్ ఈ షెడ్యూల్‌లో పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగిందని తెలిసింది. ఓ యాక్షన్ సీక్వెన్స్, ఓ పాటను కూడా చిత్రీకరించారని సమాచారం. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రజనీకాంత్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదలవుతుంది.

గుడ్... బ్యాడ్... అగ్లీ


● అజిత్

అజిత్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' టైటిల్ ఖరారైంది. తమిళంలో 'భగీర', 'మార్క్ ఆంటోనీ' వంటి సినిమాలను తీసిన అధిక్ రవి చంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. అజిత్ కెరీర్‌లో 63వ చిత్రంగా రానున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు. ఈ సినిమాను గురువారం అధికారికంగా ప్రకటించి, 2025 సంక్రాంతికి విడుదల చేస్తామని మేకర్స్ వెల్లడించారు. జూన్‌లో షూటింగ్ ఆరంభిస్తామని, యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందించనున్నామని కూడా తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

యమధీర ముస్తాబు


● శ్రీశాంత్

భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ నెగిటివ్ రోల్‌లో నటించిన చిత్రం 'యమధీర'. కోమల్ కుమార్, రిషికా శర్మ జంటగా శంకర్ .ఆర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వేదాల శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సినిమా టీజర్‌ని నటుడు, నిర్మాత అశోక్ కుమార్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''నా స్నేహితుడు వేదాల శ్రీనివాస్ నిర్మాతగా మారి, నిర్మించిన తొలి చిత్రం 'యమధీర' బాగా ఆడాలి'' అన్నారు. ''సినిమాలపై ప్యాషన్‌తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ ఆరంభించి, 'యమధీర' నిర్మించా. త్వరలోనే మా సినిమా రిలీజ్ కానుంది.. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు వేదాల శ్రీనివాస్. అలీ, సత్యప్రకాశ్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రోష్ మోహన్ కార్తీక్, సంగీతం: వరుణ్ ఉన్ని.

నెల ముందే వెనోమ్ 3


● వెనోమ్ 3 పోస్టర్

హాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ 'వెనోమ్' మూడో భాగం 'వెనోమ్ 3' రెడీ అవుతోంది. ఈ సినిమాకు 'వెనోమ్: ది లాస్ట్ డ్యాన్స్' టైటిల్ ఖరారైంది. ఈ సూపర్ హీరో మూవీని ఈ ఏడాది అక్టోబరు 24న రిలీజ్ చేస్తున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. 'వెనోమ్' ఫ్రాంచైజీలోని తొలి రెండు భాగాలు 'వెనోమ్', 'వెనోమ్: లెట్ దేర్ బీ కార్నేజ్'లకు రచయితగా పని చేసిన కెల్లీ మార్సెల్ మూడో భాగంతో దర్శకురాలిగా మారారు. తొలి రెండు భాగాల్లో హీరోగా నటించిన టామ్ హార్డీయే 'వెనోమ్: ది లాస్ట్ డ్యాన్స్'లోనూ నటిస్తున్నారు. జూనో టెంపుల్, చివెటిల్ ఎజియోఫర్, క్లార్క్ బాకో ఇతర లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. ఈ సినిమా దర్శకురాలు కెల్లీ మార్సెల్, హీరో టామ్ హార్డీలు 'వెనోమ్: ది లాస్ట్ డ్యాన్స్'కు కథా రచయితలుగా ఉండటంతో పాటు నిర్మాతలుగా కూడా వ్యవహరిస్తుండటం విశేషం. తొలుత ఈ చిత్రాన్ని ఈ ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. తాజాగా ఓ నెల ముందే... అక్టోబరుకి ప్రీ పోన్ చేశారు.

మూడోసారి ఆ హీరోతో జోడీ?


● పూజ

హీరో అల్లు అర్జున్, హీరోయిన్ పూజా హెగ్డే ముచ్చటగా మూడోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననంటోంది ఫిల్మ్‌నగర్ సర్కిల్. ఈ ఇద్దరూ 'డీజే దువ్వాడ జగన్నాథమ్' (2019), 'అల వైకుంఠపురములో' (2020) వంటి చిత్రాల్లో జంటగా నటించి, హిట్ పెయిర్‌గా నిలిచారు. ఇక 2002లో విడుదలైన 'ఆచార్య' తర్వాత మరో తెలుగు చిత్రంలో హీరోయిన్‌గా నటించలేదు పూజా హెగ్డే. అయితే 'ఎఫ్ 3' సినిమాలో వెంకటేశ్, వరుణ్ తేజ్‌లతో కలిసి ప్రత్యేక పాటలో కనిపించారు. ఇప్పుడు కథానాయికగా అల్లు అర్జున్ సినిమాకి చాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప 2: ది రూల్' సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఆ తర్వాత ఆయన పని చేయనున్న దర్శకుల జాబితాలో త్రివిక్రమ్, బోయపాటి శ్రీను, అట్లీ కుమార్, సందీప్ రెడ్డి వంగా పేర్లు వినిపిస్తున్నాయి. అయితే అట్లీతోనే తన తర్వాతి చిత్రం చేయనున్నారట అల్లు అర్జున్. ఈ చిత్రంలోనే పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించనున్నట్లు సమాచారం. మరి.. అల్లు అర్జున్‌తో మూడోసారి హీరోయిన్‌గా నటించే అవకాశం పూజా హెగ్డేకి దక్కిందా అనే విషయంపై స్పష్టత రావాలంటే వేచి చూడాలి.

చరిత్ర తెలియజేసే రజాకార్


● బాబీ సింహా

''రజాకార్' ముస్లింలకు వ్యతిరేకమైన సినిమా కాదు. మన చరిత్ర గురించి తెలియజేసే చిత్రం. నాటి కాలంలో జరిగిన దుర్మార్గాలను ప్రజలకు తెలియజేసేలా తెరకెక్కించిన మూవీ. ఇలాంటి సినిమా తీయాలంటే ధైర్యం కావాలి. దర్శకుడు సత్యనారాయణ, నిర్మాత నారాయణ రెడ్డిలకు ధన్యవాదాలు'' అని నటుడు, దర్శక-నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. బాబీ సింహా, వేదిక, అనుష్యా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే నటీనటులుగా యాటా సత్యనారాయణ దర్శకత్వం వహించిన చిత్రం 'రజాకార్'. గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. గురువారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో యాటా సత్యనారాయణ మాట్లాడుతూ- ''తెలంగాణ చరిత్రపై 'రజాకార్' చేసే చాన్స్ ఇచ్చిన నారాయణరెడ్డిగారికి ధన్యవాదాలు'' అన్నారు. ''మన పోరాట యోధుల గురించి రాబోయే తరాలకు చెప్పాలనే 'రజాకార్' నిర్మించాను'' అన్నారు గూడూరు నారాయణ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	335	73,097
నిఫ్టీ ▲	149	22,146

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి మూడు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,092	▽	84
డోజోన్స్	38,802	▽	241
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,743	▽	29
డాక్స్	17,942	▽	19
షాంఘై	3,038	▽	5
నికాయ్	38,807	△	111

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	65,523
బంగారం (99.5 స్వచ్ఛత)	65,261
వెండి (కేజీ)	73,781

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.88	108.12
€	యూరో	ఒకటి	88.12	91.990
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.13	64.88
SAR	సౌదీ రియాల్	ఖాతావిలువ	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతావిలువ	21.65	23.43
¥	చైనా యువాన్	ఖాతావిలువ	10.28	12.29



ఫిబ్రవరిలో 0.2 శాతం టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో స్వల్పంగా తగ్గి, 0.2 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్‌లో ఈ రేటు 0.27 శాతంగా ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ టోకు ధరల సూచీ మైనస్ (ప్రతి ద్రవ్యోల్బణం)లో ఉంది. నవంబర్‌లో ప్లస్‌లోకి మారి 0.26 శాతంగా నమోదయ్యింది. అయితే ఆహార ధరలు మాత్రం ఫిబ్రవరిలో స్వల్పంగా పెరిగాయి. జనవరిలో 6.85 శాతంగా ఉన్న ఆహార టోకు ధరల స్పీడ్, ఫిబ్రవరిలో 6.95 శాతానికి ఎగసింది. ఇదే సమయంలో కూరగాయల ధరలు 19.71 శాతం (జనవరి) నుంచి 19.78 శాతానికి ఎగశాయి. పప్పు దినుసుల ధరలు 16.06 శాతం నుంచి 18.48 శాతానికి చేరాయి. ఫ్యూయల్ అండ్ లైట్ విభాగానికి వస్తే, రేటు 0.51 శాతం నుంచి 1.59 శాతానికి ఎగసింది. సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ ఉత్పత్తుల ధరలు జనవరిలో 1.13 శాతం తగ్గితే, ఈ తగ్గుదల ఫిబ్రవరిలో 1.27 శాతంగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-3-2024	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	418-00
విజయవాడ	418-00
రిటైల్ ధర (డజను)	72.00
14-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు

- చిన్న, మధ్య స్థాయి షేర్లలో రికవరీ
- రాణించిన ఐటీ, ఇంధన రంగ షేర్లు
- మెప్పించిన ద్రవ్యోల్బణ డేటా
- మళ్లీ 73 వేలపైకి సెన్సెక్స్

ముంబై: వాల్యుయేషన్ ఆందోళనలను విస్మరిస్తూ ఇన్వెస్టర్లు కనిష్ట స్థాయిల వద్ద చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు ఆసక్తి చూపడంతో స్టాక్ సూచీలు గురువారం లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 335 పాయింట్లు పెరిగి 73 వేల స్థాయి పైన 73,097 వద్ద నిలిచింది. నిఫ్టీ 149 పాయింట్లు బలపడి 22,100 స్థాయిపైన 22,146 వద్ద ముగిసింది. సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. హోల్‌సేల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 4 నెలల కనిష్టానికి దిగివచ్చినట్లు డేటా వెల్లడి కావడంతో బుధవారం ట్రేడింగ్‌లో పతనమైన షేర్లకు దిగువ స్థాయి లో కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సూచీలు క్రమంగా పుంజుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 602 పాయింట్లు పెరిగి 73,364 వద్ద, నిఫ్టీ 207 పాయింట్లు బలపడి 22,205 వద్ద గరి ష్టాలను అందుకున్నాయి. ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు మాత్రమే నష్టపోయాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ట్రేడవు తున్నాయి.

- కనిష్ట స్థాయిల్లో చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 3.11%, మిడ్ క్యాప్ ఇండెక్సు 2.28% చొప్పున రాణించాయి. రంగాల వారీగా సర్వీసెస్, టెలికం సూచీలు 4%, యుటిలిటీ, ఆయిల్‌అండ్ గ్యాస్, విద్యుత్, పారిశ్రామిక ఇండెక్సులు 3%, కమోడిటీ సూచీ 2.50% చొప్పున లాభపడ్డాయి.
- భారత సైన్యం, తీర రక్షక దళం కోసం 34 తేలికపాటి హెలికాప్టర్లు, అనుబంధ పరికరాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖతో రూ.8,073 కోట్ల ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ కంపెనీ షేరు 4.2% లాభపడి రూ.3,167 వద్ద స్థిరపడింది.
- సెన్సెక్స్ 335 పాయింట్లు పెరగడంతో బీఎస్‌ఈలో రూ.7.81 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపద బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 379 లక్షల కోట్లకు చేరింది.
- అదానీ గ్రూప్ షేర్లు ముందడుగేశాయి. అదానీ టోటల్ గ్యాస్, అదానీ గ్రీన్ సొల్యూషన్స్ 11%, అదానీ గ్రీన్ ఎనర్జీ 10%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6%, అదానీ పోర్ట్స్, ఎన్‌డీటీవీ 5% చొప్పున లాభపడ్డాయి. అదానీ విల్మార్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్‌లు 4%, అదానీ పవర్ 2% రాణించాయి. గ్రూప్‌లో కంపెనీల మార్కెట్ క్యాపిటలేషన్ రూ.15.66 లక్షల కోట్లు పెరిగింది.



గోపాల్ స్నాక్స్ లిస్టింగ్ మెప్పించలేదు. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.401)తో పోలిస్తే 13% డిస్కౌంట్‌తో రూ.350 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. దాదాపు 15% క్షీణించి రూ.342 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 10% నష్టంతో రూ.342 వద్ద ముగిసింది.

ఏపీలో అరబిందో ప్లాంటు సిద్ధం

- వచ్చే నెలలోనే ట్రయల్ రన్
- రూ.2,400 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద కొత్తగా నిర్మిస్తున్న పెన్-జి (పెన్సిలిన్) ప్లాంటు ఏప్రిల్‌లో ట్రయల్ రన్‌కు సిద్ధం అయింది. జూన్‌లోగా వాణిజ్యపరంగా తయారీ కార్యకలాపాలు మొదలవుతాయని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి వెల్లడించారు. పెన్సిలిన్-జి ధర విషయంలో చైనాతో పోటీపడాలన్నది తమ లక్ష్యం అని చెప్పారు. పూర్తిగా దేశీయంగా పెన్సిలిన్ ఉత్పత్తి చేస్తున్నట్టు వివరించారు. ఏటా 15,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఈ కేంద్రం కోసం సంస్థ రూ.2,400 కోట్లు వెచ్చిస్తోంది. ఈ ప్లాంటు జూలై-సెప్టెంబర్ కాలంలో పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకోనుంది. 80-90 శాతం పెన్సిలిన్‌ను కంపెనీ దేశీయంగా విక్రయించనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం కింద పెన్సిలిన్ ప్లాంటు ఆమోదం పొందింది.

మరో రూ.1,000 కోట్లు..

అరబిందో ఫార్మా 8-10 ప్లాంట్ల ఏర్పాటుకు గడిచిన మూడు నాలుగేళ్లలో రూ.5,000 కోట్లు ఖర్చు చేసింది. వచ్చే రెండేళ్లలో మరో రూ.1,000 కోట్ల పెట్టుబడి చేయనుంది. చైనాలో ఏర్పాటు చేస్తున్న ఓరల్ సాలిడ్స్ తయారీ ప్లాంటులో వచ్చే త్రైమాసికంలో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని సంస్థ సీఎఫ్‌వో శాంతారామ్ సుబ్రమణియన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అరబిందో టర్నోవర్ 3.4-3.5 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనాగా పేర్కొన్నారు. డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలంలో టర్నోవర్ 2.6 బిలియన్ డాలర్లు నమోదైంది. అరబిందో ప్రస్తుతం అంటువ్యాధుల విభాగంలో ఐదు వ్యాక్సిన్ల తయారీలో నిమగ్నమైంది. సంస్థ ఖాతాలో 25 తయారీ, ప్యాకింగ్ కేంద్రాలు ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న 10 ప్లాంట్లు ఒకట్రెండేళ్లలో కార్యరూపం దాల్చనున్నాయి.

పీఎస్‌యూ బ్యాంకుల్లో వాటా విక్రయం

- 75 శాతం దిగువకు చేరనున్న ప్రభుత్వ వాటా
- పబ్లిక్‌కు కనీస వాటా నిబంధన అమలుపై దృష్టి
- జాబితాలో ఐవోబీ, యుకోసహా ఐదు బ్యాంకులు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వం కొంతమేర వాటాలను విక్రయించనుంది. పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా నిబంధన(ఎంపీఎస్) అమలులో భాగంగా ఐదు బ్యాంకుల్లో వాటాలను ఆఫర్ చేయనుంది. ఈ జాబితాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ), యుకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్(పీఎస్‌బీ) ఉన్నట్లు ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ వివేక్ జోషీ పేర్కొన్నారు. 2023 మార్చి 31కల్లా మొత్తం 12 పీఎస్‌యూ బ్యాంకుల్లో 4 ఎంపీఎస్ నిబంధనలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మరో 3 ప్రభుత్వ రంగ బ్యాంకులు 25 శాతం ఎంపీఎస్‌ను సాధించినట్లు పేర్కొన్నారు. ఇకపై మిగిలిన 5 బ్యాంకులు సైతం నిబంధనలను అందుకునే కార్యాచరణకు తెరతీయనున్నట్లు తెలియజేశారు.

ప్రస్తుత తీరిలా: ప్రస్తుతం పీఎస్‌బీలో కేంద్ర ప్రభుత్వం 98.25 శాతం వాటాను కలిగి ఉంది. ఈ బాటలో ప్రభుత్వానికి ఐవోబీలో 96.38 శాతం, యుకో బ్యాంక్‌లో 95.39 శాతం, సెంట్రల్ బ్యాంక్‌లో 93.08 శాతం, బ్యాంక్ మహారాష్ట్రలో 86.46 శాతం చొప్పున వాటాలున్నాయి.


పారామౌంట్ గ్లోబల్‌తో రిలయన్స్ డీల్

వయాకామ్ 18లో పారామౌంట్ వాటాల కొనుగోలు • 13 శాతానికి రూ. 4,286 కోట్లు

న్యూఢిల్లీ: పారామౌంట్ గ్లోబల్ సంస్థ భారత్‌లోని టీవీ వ్యాపార విభాగం వయాకామ్ 18లో తమకున్న 13.01 శాతం వాటాలను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి విక్రయించనుంది. ఇందుకు సంబంధించి పారామౌంట్ గ్లోబల్‌కి చెందిన రెండు అనుబంధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు రిలయన్స్ తెలిపింది. ఈ డీల్ విలువ రూ. 4,286 కోట్లుగా ఉంటుందని వివరించింది. రిలయన్స్‌కి చెందిన టీవీ18 బ్రాడ్‌కాస్ట్‌కి వయాకామ్18 అనుబంధ సంస్థ. కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్ల ద్వారా అందులో రిలయన్స్‌కి 57.48 శాతం వాటా ఉంది. పారామౌంట్ గ్లోబల్‌తో ఒప్పందం పూర్తయ్యాక ఇది 70.49 శాతానికి పెరుగుతుంది. తమ కంటెంట్‌కి సంబంధించి వయాకామ్18కి లైసెన్సును ఇకపైనా కొనసాగిస్తామని పారామౌంట్ వెల్లడించింది. నియంత్రణ సంస్థల అనుమతులు, రిలయన్స్-స్టార్ డిస్నీ జాయింట్ వెంచర్ పూర్తి కావడం తదితర అంశాలకు లోబడి ఈ ఒప్పందం ఉంటుందని పేర్కొంది.

మీడియాలో రిలయన్స్ మరింత పటిష్టం..

2014లో నెట్‌వర్క్18లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసిన రిలయన్స్ ఆ తర్వాత నుంచి మీడియా రంగంలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. భారత్‌లో తమ మీడియా కార్యకలాపాలను విలీనం చేసుకునేందుకు వాల్ట్ డిస్నీ, రిలయన్స్ కుదుర్చుకున్న ఒప్పందం ఇందుకు దోహదపడనుంది. సదరు జాయింట్ వెంచర్‌లో రిలయన్స్ రూ. 11,500 కోట్లు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సోనీ, నెట్‌ఫ్లిక్స్‌కు గట్టి పోటీనిచ్చేందుకు రిలయన్స్ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం రిలయన్స్‌కి చెందిన మీడియా వెంచర్స్ అన్నీ నెట్‌వర్క్18 కింద ఉన్నాయి. ఇది టీవీ18 బ్రాండ్ పేరిట న్యూస్ చానళ్లు, ఇతరత్రా స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ చానల్స్‌ని నిర్వహిస్తోంది. అలాగే, మనీకంట్రోల్‌డాట్‌కామ్, బుక్‌మైషో వంటి సంస్థల్లోనూ నెట్‌ వర్క్18కి వాటాలు ఉన్నాయి. వీటితో పాటు రిలయన్స్‌కి జియోస్టూడియోస్ అనే సినిమా నిర్మాణ సంస్థ ఉంది. రెండు లిస్టెడ్ కేబుల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో (డెన్, హాథ్‌వే) మెజారిటీ వాటాలు ఉన్నాయి.





సింగిల్స్ క్వార్టర్స్‌లో రష్మిక... డబుల్స్ సెమీస్‌లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణులు శ్రీవల్లి రష్మిక సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి, డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా... సహజ యామలపల్లి సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయి, డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇండోర్‌లో జరుగుతున్న ఈ టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో రష్మిక 6-1, 2-6, 6-1తో మర్యాయోవా (స్లొవేకియా)పై గెలిచింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-3, 6-4తో అకికో ఒమాయి-మె యామగుచి (జపాన్) జోడీపై నెగ్గింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 1-6, 4-6తో మనన్‌చాయ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ-జీల్ దేశాయ్ (భారత్) జోడీ 6-1, 6-2తో సౌమ్య (భారత్)-మె హసెగావ (జపాన్) జంటపై గెలిచింది.



ఢిల్లీని 'ఢీ' కొట్టేదెవరు?

- నేడు ముంబై, బెంగళూరు మధ్య ఎలిమినేటర్ పోరు
- రాత్రి గం. 7:30 నుంచి 'స్పోర్ట్స్-18'లో ప్రత్యక్ష ప్రసారం



హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అమీతుమీకి అర్హత సాధించేందుకు ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు సమరానికి సిద్ధమయ్యాయి. శుక్రవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఇరుజట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ ముంబై టైటిల్ నిలబెట్టుకునే పనిలో ఉండగా, గత సీజన్‌లో నిరాశపరిచిన బెంగళూరు కొత్తగా ఫైనల్ చేరేందుకు తహతహలాడుతోంది. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన బృందం గెలిస్తే గత రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. ముంబై గెలిస్తే మాత్రం 2023 సీజన్ ఫైనల్ పునరావృతం అవుతుంది. ఇక ఈ సీజన్ విషయానికొస్తే బెంగళూరు మెరుగుపడింది. లీగ్ ఆరంభ దశలో యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్‌లపై వరుస విజయాలతో టచ్‌లోకి వచ్చింది. అయితే గత ఫైనలిస్టులతో తలపడిన మ్యాచ్‌ల్లో ఓటమి పాలైనప్పటికీ అడపాదడపా విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానాన్ని పదిలపర్చుకుంది. దీంతో పాటు ఆఖరి మ్యాచ్‌లో ముంబైలాంటి ప్రత్యర్థిని చిత్తుగా ఓడించడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆర్‌సీబీ స్టార్ ఎలీస్ పెరీ ఆల్‌రౌండ్ షో ముంబైని ముంచేసింది. కీలకమైన పోరులో ఓపెనర్లు స్మృతి, సోఫీలు విఫలమైనా బ్యాట్‌తోనూ పెరీ జట్టును నడిపించింది. హిట్టింగ్‌తో రిచా ఘోష్ జట్టులో కీలకపాత్ర పోషిస్తోంది. సోఫీ డివైన్, జార్జియా వేర్‌హామ్‌లు కూడా ధాటిగా ఆడితే ముంబై బౌలర్లకు కష్టాలు తప్పవు. ఈ సీజన్‌లో ఆఖరి లీగ్ మ్యాచ్‌ను మినహాయించి ఓవరాల్‌గా చూసుకుంటే ముంబై డిఫెండింగ్ చాంపియన్ పాత్రకు న్యాయం చేసేలా ఆడింది. హేలీ మాథ్యూస్, సజన, నటాలీ సీవర్ బ్రంట్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, అమెలియా కెర్‌లతో కూడిన బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. బౌలింగ్ విభాగంలో స్పీడ్‌స్టర్ షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, అమెలియాలు రాణిస్తే బెంగళూరును ఓడించడం ఏమంత కష్టం కానేకాదు. ఐదు జట్లు పోటీపడ్డ డబ్ల్యూపీఎల్‌లో లీగ్ దశలో 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంది.

'రంజీ' రారాజు ముంబై...

42వసారి టైటిల్ సొంతం

- ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ విజేత
- ఫైనల్లో 169 పరుగులతో విదర్భపై ఘన విజయం



విదర్భ ఇన్నింగ్స్‌లో 135వ ఓవర్... అప్పటికే 9 వికెట్లు పడ్డాయి... కెరీర్‌లో చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడుతున్న ముంబై పేసర్ ధవల్ కులకర్ణి ఇంత సుదీర్ఘ ఇన్నింగ్స్‌లో 8 ఓవర్లే వేశాడు... ఒక్కసారిగా ధవల్ చేతికి కెప్టెన్ రహానే బంతిని అందించాడు... మూడో బంతికి ఉమేశ్ యాదవ్ క్లీన్‌బౌల్డ్... ముంబై శిబిరంలో సంబరాలు షురూ... వెరసి దేశవాళీ క్రికెట్ దిగ్గజం ఖాతాలో మరో రంజీ ట్రోఫీ చేరింది. ముంబై జట్టు ఏకంగా 42వ సారి రంజీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఎనిమిదేళ్ల తర్వాత టీమ్ ఖాతాలో మరో కప్ చేరగా... ధవల్ ఐదో రంజీ విజయంలో భాగంగా నిలిచి సగర్వంగా ఆటకు వీడ్కోలు పలికాడు.

ముంబై: భారత దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీని ముంబై జట్టు సొంతం చేసుకుంది. గురువారం ముగిసిన ఐదు రోజుల ఫైనల్లో ముంబై 169 పరుగుల తేడాతో రెండుసార్లు చాంపియన్ విదర్భపై ఘన విజయం సాధించింది. విదర్భ చివరి రోజు వరకు పోరాడినా అసాధ్యమైన లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైంది. 538 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 248/5తో ఆట కొనసాగించిన విదర్భ 368 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (199 బంతుల్లో 102; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ పూర్తి చేసుకోగా... హర్ష్ దూబే (128 బంతుల్లో 65; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. అక్షయ్, హర్ష్ చాలాసేపు ముంబై బౌలర్లకు లొంగకుండా ఇబ్బంది పెట్టారు. అయితే ఎట్టకేలకు తనుష్ బౌలింగ్‌లో అక్షయ్ వికెట్ల ముందు దొరికిపోవడంతో ముంబై గెలుపు బాట పట్టింది. మిగిలిన నాలుగు వికెట్లను 15 పరుగుల వ్యవధిలోనే తీసి ముంబై చాంపియన్‌గా అవతరించింది. సెంచరీ సాధించడంతో పాటు 2 వికెట్లు తీసిన ముషీర్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అతనికి రూ. 50 వేలు ప్రైజ్‌మనీ దక్కింది. టోర్నీ మొత్తంలో 502 పరుగులు, 29 వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన ముంబై ఆటగాడు తనుష్ కొటియన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. తనుష్‌కు రూ. 2 లక్షల 50 వేలు ప్రైజ్‌మనీ లభించింది. 1934-35 సీజన్‌లో తొలిసారి విజేతగా నిలిచిన ముంబై (బాంబే) జట్టు ఈ టైటిల్‌కు ముందు 2015-16 సీజన్‌లో చివరిసారి ట్రోఫీని అందుకుంది.


తనుష్ కొటియన్


ముషీర్ ఖాన్

ఆటగాళ్లపై కోట్లాభిషేకం...

ప్రైజ్‌మనీలో ముంబై డబుల్ ధమాకా కొట్టింది. సీజన్ విజేతకు బీసీసీఐ రూ. 5 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వగా... ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) తమ క్రికెటర్లకు ప్రత్యేకంగా రూ.5 కోట్ల నజరానా ప్రకటించింది. దీంతో తాజా రంజీ విజేతకు వచ్చిన ప్రైజ్‌మనీ రెట్టింపైంది. 'ఈ సీజన్‌లో మా జట్లు బాగా ఆడాయి. బీసీసీఐ నిర్వహించిన వయో విభాగాల టోర్నీలన్నింటిలోనూ ఫైనల్ చేరాయి. దీంతో ఎంసీఏ ప్రోత్సాహకంగా రూ. 5 కోట్ల బహుమతి ఇస్తోంది' అని కార్యదర్శి అజింక్య నాయక్ తెలిపారు.

సింధు ఏడో'సారీ'...

ఆన్ సె యంగ్ చేతిలో మళ్లీ ఓటమి



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. గత ఐదేళ్లుగా తనకు కొరకరాని కొయ్యగా మారిన దక్షిణ కొరియా ప్లేయర్ ఆన్ సె యంగ్ చేతిలో సింధు వరుసగా ఏడోసారి ఓడిపోయింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ సింధు 19-21, 11-21తో ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్, డిఫెండింగ్ చాంపియన్ ఆన్ సె యంగ్ చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 80 నిమిషాల పాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 24-22, 11-21, 21-14తో ప్రపంచ 3వ ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)ను ఓడించాడు.

శరత్ కమల్ జోరు

సింగపూర్: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) దిగ్గజ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 41 ఏళ్ల శరత్ కమల్ గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 88వ ర్యాంకర్ శరత్ కమల్ 11-4, 11-8, 12-10తో ప్రపంచ 22వ ర్యాంకర్ ఒమర్ అసర్ (ఈజిప్ట్)పై గెలుపొందాడు. శరత్ క్వార్టర్ ఫైనల్లో ఫెలిక్స్ లుబ్రాన్ (ఫ్రాన్స్)తో తలపడతాడు.





సబలెంకాకు షాక్

కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ డబ్ల్యూటీఏ-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంకర్, బెలారస్ స్టార్ సబలెంకాకు ఊహించని పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ సబలెంకా 3-6, 6-3, 2-6తో ప్రపంచ 23వ ర్యాంకర్ ఎమ్మా నవారో (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

గుజరాత్‌పై తెలంగాణ ఘనవిజయం

పుణే: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు తొలి విజయం నమోదు చేసింది. పూల్ 'హెచ్'లో భాగంగా గుజరాత్‌తో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 12-0 గోల్స్ తేడాతో జయభేరి మోగించింది. తెలంగాణ తరఫున కెప్టెన్ ఈదుల జ్యోతి (24వ, 26వ, 27వ ని.లో) 'హ్యాట్రిక్' సాధించగా... గంధపు శ్రీచందన (9వ, 37వ ని.లో), హర్లీన్ కౌర్ సర్దాని (14వ, 47వ ని.లో), ప్రీతి దార్ల (25వ, 57వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. చెక్కల అనూష (44వ ని.లో), అఖిల మాండ్లా (45వ ని.లో), ముప్పాల వర్షిత (56వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. తమిళనాడుతో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 1-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది.



కోహ్లి లేకుండా ఆర్‌సీబీ శిబిరం



బెంగళూరు: ఐపీఎల్ టోర్నీ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ గురువారం శిబిరానికి శ్రీకారం చుట్టింది. అయితే జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కాస్త ఆలస్యంగా శిబిరానికి హాజరు కానున్నాడు. ఫ్రాంచైజీల వ్యవహారాల్ని పరిశీలిస్తున్న బీసీసీఐ... వ్యక్తిగత కారణాలతో ఆటకు దూరంగా ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్న కోహ్లి త్వరలోనే జట్టుతో కలుస్తాడని వెల్లడించింది. కొత్త హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్, క్రికెట్ డైరెక్టర్ మో బొబట్‌లు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నారు.

విశ్వసనీయత కలిగిన నాయకుడు సీఎం జగన్

ఆయన బాగా కష్టపడి పనిచేస్తున్నారు

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉంది
- చంద్రబాబు గతంలో కాంగ్రెస్‌తోనూ పొత్తు పెట్టుకున్నారు
- బీజేపీ నేత, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి వ్యాఖ్యలు



తిరుపతి లీగల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి విశ్వసనీయత కలిగిన నాయకుడిగా ప్రజల్లో పేరు తెచ్చుకున్నారని బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రమణ్యస్వామి చెప్పారు. ఆంధ్రజ్యోతి పత్రికపై తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) దాఖలు చేసిన కేసులో వాదనలు వినిపించేందుకు గురువారం తిరుపతి వచ్చిన సుబ్రమణ్యస్వామి... కోర్టు సముదాయం ప్రధాన ద్వారం వద్ద మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికలపై తన అభిప్రాయం చెప్పాలని మీడియా ప్రతినిధులు కోరగా... 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టపడి పనిచేస్తున్నారు. ప్రజల్లో మంచి విశ్వసనీయత గల నాయకుడిగా గుర్తింపు పొందారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి' అని సుబ్రమణ్యస్వామి తెలిపారు. అదేవిధంగా బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తుల గురించి కూడా ఆయన స్పందన కోరగా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో కాంగ్రెస్ పార్టీతోనూ పొత్తు పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు.

ఆంధ్రజ్యోతిపై టీటీడీ పరువు నష్టం కేసు విచారణ 27కి వాయిదా

ఆంధ్రజ్యోతి పత్రికపై టీటీడీ దాఖలు చేసిన రూ.వంద కోట్లు పరువునష్టం దావా కేసు విచారణను కోర్టు ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఈ కేసు విచారణ గురువారం జరిగింది. ఈ కేసులో టీటీడీ తరఫున గతంలో దాఖలైన రెండు పిటీషన్లపై బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రమణ్యస్వామి వాదనలు వినిపించారు. టీటీడీ దాఖలు చేసిన పత్రాలను కోర్టు స్వీకరించాలని, అలాగే టీటీడీ తరఫున సాక్ష్యం ఇవ్వడానికి అనుమతిపత్రాన్ని కోర్టు స్వీకరించాలని ఆయన కోరారు. వాదనల సమయంలో ఆంధ్రజ్యోతి తరఫు న్యాయవాది లేకపోవడంతో వారి వాదనలు వినడానికి జడ్జి కేసును వాయిదా వేస్తూ డాకెట్‌పై రాశారు. అయితే కొద్దిసేపటి తర్వాత ఆంధ్రజ్యోతి తరఫు న్యాయవాది వచ్చి... ఈ కేసును కొంతసేపు పక్కన పెట్టాలని, ఆంధ్రజ్యోతి తరఫున పిటిషన్ దాఖలు చేస్తామని కోరారు. అయితే అప్పటికే కేసును వాయిదా వేయడంతో ఈ నెల 27న ఆంధ్రజ్యోతి తరఫున వాదనలు వినిపించాలని, అలాగే పిటిషన్ కూడా అదేరోజు దాఖలు చేయాలని జడ్జి సూచించారు.

వాయిదాలు తీసుకుంటున్నారు...

తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా, టీటీడీ పరువుకు భంగం వాటిల్లేలా ఆంధ్రజ్యోతి పత్రిక 2019, డిసెంబరు ఒకటో తేదీన ప్రచురించిన కథనంపై టీటీడీ దాఖలు చేసిన కేసును తాను వాదించడానికి అర్హత లేదంటూ ఆంధ్రజ్యోతి కోర్టుల్లో వాయిదాలపై వాయిదాలు తీసుకుంటూ వచ్చిందని సుబ్రమణ్యస్వామి మీడియాతో చెప్పారు. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టులోనూ తాను వాదించడానికి వీల్లేదని పిటిషన్ వేయగా, న్యాయస్థానం కొట్టివేసిందని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా తాను పలు కేసులను వాదించానని సుబ్రమణ్యస్వామి చెప్పారు. అయితే, తనకు వాదనలు వినిపించడానికి అర్హత లేదంటూ ఆంధ్రజ్యోతి యాజమాన్యం వాదించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. సుబ్రమణ్యస్వామితోపాటు టీటీడీ న్యాయ సలహాదారుడు యుగంధర్‌రెడ్డి, న్యాయవాది దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల వీరంగం

- మద్యం మత్తులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై బీరు సీసాలు విసిరి హంగామా
- ఎన్టీఆర్ జిల్లా షేర్‌మహ్మద్‌పేటలో ఘటన

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీ, జనసేన కార్యకర్తలు మద్యం మత్తులో రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై ఖాళీ బీరు సీసాలు విసిరి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే... షేర్‌మహ్మద్‌పేటలో ఇటీవల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు విజేతగా నిలిచారు. వారికి బహుమతి ప్రదానం చేసేందుకు నిర్వాహకులు బుధవారం రాత్రి టీడీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోదరుడు చినబాబును ఆహ్వానించారు. ఆయనకు స్వాగతం పలుకుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఆ క్రమంలో గ్రామంలోని సైదిరెడ్డి బజారుకు వచ్చేసరికే టీడీపీ, జనసేన కార్యకర్తలు గుంటుపల్లి పవన్, గడ్డం సిద్దూ, దేవరశెట్టి అజయ్, తులసి, చిన్న బ్రహ్మం, షేక్ బాజీ, షేక్ బాజీబాబా, చింతల నరేంద్ర, షేక్ మదార్‌షా, సయ్యద్ బాషా, షేక్ నాగులు మద్యం మత్తులో బైక్‌లతో ఫీట్లు చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై ఖాళీ బీరుసీసాలు, రాళ్లు విసిరారు. స్థానిక మహిళలు ప్రశ్నించడంతో వారిని దుర్భాషలాడుతూ ముందుకుసాగారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్లకల్లు పోలీసులకు సమాచారం అందించారు. అయినా టీడీపీ, జనసేన కార్యకర్తలు మరోసారి ఆ బజారుకు వచ్చేందుకు ప్రయత్నించగా, అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిని మందలించారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టి పంపించేశారు. అయితే, తమపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ షేర్‌మహ్మద్‌పేట గ్రామ టీడీపీ నాయకులు గురువారం ఉదయం రహదారిపై బైఠాయించారు. చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ వచ్చి వారిని పంపించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. బీరు సీసాలు పగలగొట్టి ఇళ్లపై విసరడంతోపాటు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. కాగా.. శ్రీరాం చినబాబు సహకారంతోనే స్థానిక టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. టీడీపీ నాయకుడు జాన్‌బాషా, తదితరులు ముందస్తు ప్రణాళికతోనే అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించారని చెప్పారు.

ఎమ్మెల్సీ మాతృమూర్తికి సీఎం జగన్ నివాళి

శివరామిరెడ్డి తల్లి లలితమ్మ అనారోగ్యంతో మృతి

ఆమె కుటుంబ సభ్యులకు సీఎం జగన్ పరామర్శ



లలితమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి తదితరులు

వజ్రకరూరు/ఉరవకొండ: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మ(85) భౌతిక కాయానికి గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం కర్నూలు జిల్లా ఆదోనిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. దీంతో కుటుంబీకులు ఆమె భౌతిక కాయాన్ని స్వగ్రామం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం కొనకొండ్లకు తీసుకొచ్చారు. సీఎం జగన్ గురువారం బనగానపల్లిలో ఈబీసీ నేస్తం కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం రెండు గంటలకు హెలికాప్టర్‌లో కొనకొండ్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా లలితమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఎంతో పాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఉషశ్రీచరణ్, అనంతపురం కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు లలితమ్మకు నివాళులర్పించారు.

ఆ బాలుడి గొంతు పలికింది

సీఎం వైఎస్ జగన్ చొరవతో తొమ్మిదేళ్ల బాలుడికి శస్త్రచికిత్స



బాలుడు మహ్మద్‌తో కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ గురు ఎన్ రెడ్డి, తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్/అమరావతి: ప్రమాదవశాత్తు స్వరపేటిక పూర్తిగా చితికిపోయి క్లిష్టపరిస్థితుల్లో చికిత్స కోసం ఎదురు చూస్తున్న తొమ్మిదేళ్ల బాలుడికి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసాతో పునర్జన్మ లభించింది. మాట కోల్పోయిన అతడు ఇప్పుడు గలగలా మాట్లాడగలుగుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని నకరికల్లుకు చెందిన షేక్ ఖాజాబీ, బాజీ దంపతులకు తొమ్మిదేళ్ల కొడుకు మహ్మద్ ఉన్నాడు. ఫిబ్రవరి 29న స్కూల్‌కి వెళ్లిన బాలుడు తోటి పిల్లలతో ఆడుకుంటూ ఇనుప చువ్వ మీద జారిపడ్డాడు. ఆ చువ్వ గొంతులో బలంగా గుచ్చుకోవడంతో అతడి శ్వాసనాళం, స్వరపేటిక పూర్తిగా చితికిపోయాయి. దీంతో మాట నిలిచిపోయి, శ్వాస పీల్చుకోవడానికి సైతం ఇబ్బందిగా మారింది. బాలుడిని నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం వెంటిలేటర్ సహాయంతో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. మహ్మద్‌ను పరిశీలించిన నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు శ్వాస తీసుకోవడానికి తాత్కాలికంగా ఒక కృత్రిమ పైప్ అమర్చి, మరింత మెరుగైన వైద్యం కోసం కాంటినెంటల్ హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించారు.

అరుదైన శస్త్రచికిత్సతో..

కాంటినెంటల్ హాస్పిటల్స్ లేరింగాలజిస్ట్ స్పెషలిస్ట్ దుష్యంత్ బృందం మహ్మద్‌ను పరిశీలించి అతడికి అతికష్టమైన, అరుదైన లెరింగోట్రెకెల్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయాలని నిర్ధారించారు. లెరింగాలజీలో ఫెలోషిప్ చేసిన నిష్ణాతులైన వైద్యులు మాత్రమే ఈ సర్జరీ చేయగలరని, ఏ మాత్రం తేడా వచ్చిన తీవ్ర నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకు రూ.6లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. అంత ఖర్చు భరించే స్తోమత లేని ఆ పేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. సోషల్ మీడియా ద్వారా బాలుడి ఆరోగ్య స్థితిని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతడి ఆరోగ్యాన్ని చక్కదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సీఎంవో అధికారులు కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు ఫోన్‌చేసి.. బాలుడికి చికిత్సతోపాటు ఆరోగ్యం చక్కబడటానికయ్యే ఖర్చంతా ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు. వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో వైద్యులు బాలుడికి విజయవంతంగా శస్త్రచికిత్స చేసి శ్వాసనాళాన్ని పునరుద్ధరించి.. స్వరపేటికను బాగు చేశారు.

సీఎం జగన్ ఆదుకున్నారు

మా అబ్బాయి వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అంత ఖర్చు పెట్టే స్తోమత మాకు లేదు. మా బిడ్డకు సీఎం జగన్ పునర్జన్మ ఇచ్చారు. లేదంటే మా బిడ్డ జీవితాంతం మూగవాడిగా ఉండేవాడు.

– షేక్ ఖాజాబీ, బాలుడి తల్లి

18 నుంచి ఒంటిపూట బడులు

ఉదయం 7.45 నుంచి 12.30 వరకు తరగతులు

సాక్షి అమరావతి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోను ఈనెల 18 నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 9 తరగతులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరం చివరి తేదీ ఏప్రిల్ 23 వరకు ఒక్కపూట మాత్రమే తరగతులు నిర్వహించాలన్నారు. అలాగే పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఏడు రోజులు ఇతర తరగతులు జరగవని, ఈ పాఠశాలలు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 వరకు... ఆదివారంతోసహా ప్రభుత్వ సెలవు దినాల్లో తప్పనిసరిగా ఇతర తరగతులకు క్లాసులు నిర్వహించాలన్నారు. ఈమేరకు జిల్లాల్లో చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించారు. ఒంటిపూట బడులు జరిగే కాలంలో అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు వేసవి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలోను తగినంత తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, స్థానికులు లేదా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మధ్యాహ్న భోజన సమయంలో మజ్జిగ అందించాలని సూచించారు. పాఠశాల ముగిసే సమయానికి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా పెట్టి తర్వాత ఇళ్లకు పంపించాలని కమిషనర్ సురేశ్ కుమార్ ఆదేశించారు.

నేడు, రేపు తెలంగాణలో మోదీ ఎన్నికల ప్రచారం

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... తెలంగాణలో బీజేపీ తరఫున శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వరుసగా శుక్ర, శని, సోమవారాల్లో వివిధ చోట్ల బహిరంగసభలు, రోడ్‌షోలో పాల్గొంటారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి రాజ్‌భవన్‌లో మోదీ బసచేయనున్నారు. శనివారం ఉదయం ఇక్కడి నుంచే నాగర్‌కర్నూల్‌లో బహిరంగసభలో పాల్గొనేందుకు వెళతారు. మళ్లీ 18న జగిత్యాలలో ఏర్పాటుచేసిన పబ్లిక్ మీటింగ్‌లో ప్రసంగిస్తారు. శుక్ర, శనివారాల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చుననే అంచనాల మధ్య ప్రధాని సభలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇప్పటికే ఈ నెల 4న ఆదిలాబాద్‌లో, 5న పటాన్‌చెరువులో కలిపి ప్రధాని మోదీ రూ.15వేల కోట్ల పైచిలుకు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు విడిగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో రాజకీయప్రసంగాలు చేసిన విషయం తెలిసిందే. షెడ్యూల్ వెలువడుతుందా లేదా అన్న దానితో నిమిత్తం లేకుండా మోదీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయని పార్టీ వర్గాల సమాచారం.

కర్నూలులో ఓరియంట్ ఫ్లైట్స్ పైలెట్ శిక్షణ కేంద్రం

మూడు సంస్థలతో పోటీ పడి బిడ్డు దక్కించుకున్న ఓరియంట్

ఏడాదికి కనీసం 80 నుంచి 100 మందికి శిక్షణ



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో తొలి పైలెట్ శిక్షణ కేంద్రం కర్నూలు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఏర్పాటవుతోంది. ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడానికి ఓరియంట్ ఫ్లైట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతిస్తూ రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ఉత్తర్వులిచ్చింది. పైలెట్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఏడీసీఎల్) టెండర్లు పిలవగా మూడు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో రిత్విక్ ఏవియేషన్, ధిల్లాన్ ఏవియేషన్ లిమిటెడ్‌లు నిర్దేశిత నిబంధనల అర్హతలను అందుకోలేకపోయాయి. ఏపీఏడీసీఎల్ ప్రతీ విమానానికి గంటకు కనీస ఆదాయంగా రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్న నిబంధన విధిస్తే.. ఓరియంట్ ఏవియేషన్ దానికి అదనంగా రూ.750 చెల్లించడానికి ముందుకొచ్చింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నాక ఓరియంట్ ఏవియేషన్ ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటుకు అనుమతిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

సంవత్సరానికి 100 మంది వరకు శిక్షణ

రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా రూ.155 కోట్లతో ఓర్వకల్లు వద్ద ఏర్పాటు చేస్తున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంలో సుమారు రూ.30 కోట్లతో పైలెట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. దీర్ఘకాలిక లీజు విధానంలో తొలుత 20 ఏళ్లకు ఆ తర్వాత పరస్పర అంగీకారంతో మరో పదేళ్లు పొడిగించుకునేలా ఈ ఎఫ్‌టీవోని ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదికి కనీసం 80 నుంచి 100 మందికి పైలెట్ శిక్షణ ఇచ్చేలా ఈ ఎఫ్‌టీవోని ఏర్పాటు చేస్తున్నారు. కేవలం విమాన సర్వీసులే కాకుండా కర్నూలు ఎయిర్‌పోర్టును ఆధారం చేసుకుని పైలెట్ శిక్షణ, పారాగ్లైడింగ్, ఎంఆర్‌వో యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా విమానాశ్రయ ఆదాయం పెంచే మార్గాలను ఏపీఏడీసీఎల్ పరిశీలిస్తోంది.

యునెస్కోలో 'మన బడి'పై చర్చ

ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణలపై ప్రశంసలు



ప్యారిస్‌లోని యునెస్కో కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ పాఠశాల మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరిసింది. విద్యపై ప్రభుత్వం చూపిన శ్రద్ధ, సంస్కరణలు మారిన పరిస్థితులు, సాధించిన ఫలితాలు ఇప్పటికే ఐక్యరాజ్య సమితి వరకు చేరగా..తాజాగా ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో మనబడి నాడు–నేడుపై చర్చ జరిగింది. ఈనెల 13న యునెస్కో ఆధ్వర్యంలో ప్యారిస్‌లోని ప్రధాన కార్యాలయంలో 'గ్లోబల్ ఇంక్లూజివ్ స్కూల్స్ ఫోరమ్' సదస్సు ప్రారంభమైంది. 90కి పైగా దేశాల నుంచి 400 మంది విద్యా శాఖ ముఖ్య అధికారులు, స్పెషలిస్టులు ఈ సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో ఐక్యరాజ్యసమితి స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ ఏపీ ప్రతినిధిగా గురువారం పాల్గొని రాష్ట్రంలో అమలు చేస్తోన్న మనబడి నాడు–నేడుపై వివరించారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ అసమానతలు లేని అన్ని సదుపాయాలతో సమగ్ర విద్య అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఏపీ విద్యా సంస్కరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పేదింటి పిల్లలు చదువుకునే బడుల్లో ఇంగ్లిష్ మీడియం అమలు, విభిన్న భాషలు మాతృభాషగా ఉన్న విద్యార్థులు కూడా సులభంగా ఇంగ్లిష్ నేర్చుకునేందుకు వీలుగా బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, ప్రతి విద్యార్థి కార్పొరేట్ స్థాయిలో గౌరవంగా చదువుకునేలా యూనిఫాం, బూట్లు అందజేత, పోషక విలువలతో కూడిన గోరుముద్ద, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు, విద్యార్థులకు ట్యాబ్స్ వంటి అంశాలు అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకున్నాయని షకిన్ కుమార్ 'సాక్షి'కి తెలిపారు. సమగ్ర విద్య మూలస్తంభాల్లో 'మనబడి నాడు–నేడు'తో వచ్చిన మార్పు ఒకటి అని యునెస్కో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ వివిఎన్ గైరిస్, ఎడ్యుకేషన్ ఫర్ ఇంక్లూజన్ అండ్ జెండర్ ఈక్వాలిటీ చీఫ్ జస్టిన్ సాస్ అభివర్ణించినట్లు షకిన్ తెలిపారు.

మద్దతు ధరకు కొంటే విమర్శలా?

ఐదేళ్లలో రూ. 7,757.87 కోట్ల విలువైన 21.61 లక్షల టన్నులు సేకరణ

- రబీ సీజన్‌లో 3.88 లక్షల టన్నుల పంట ఉత్పత్తుల సేకరణకు ప్రభుత్వం అనుమతి
- పంట ఉత్పత్తుల సేకరణకు రుణాలు తీసుకోవడం ఎప్పుడూ జరిగేదే
- రైతులకు సకాలంలో చెల్లింపుల కోసమే ఈ ఏర్పాటు
- ఈనాడు కథనాన్ని ఖండించిన మార్క్‌ఫెడ్ ఎండీ శేఖర్‌బాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పండిన పంటలను రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నా విమర్శించడం సరికాదని మార్క్‌ఫెడ్ ఎండీ గెడ్డం శేఖర్‌బాబు చెప్పారు. పంట ఉత్పత్తుల కొనుగోలుపై ఈనాడు పత్రిక రాసిన కథనాన్ని ఆయన ఖండించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా సీఎం యాప్ ద్వారా గ్రామాలవారీగా పంట ఉత్పత్తుల మార్కెట్ ధరలను పర్యవేక్షిస్తూ, మద్దతు ధర దక్కని పంటలను ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్) ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ 57 నెలల్లో 6.18 లక్షల రైతుల నుంచి రూ.7,757.87 కోట్ల విలువైన 21.61 లక్షల టన్నుల పంట ఉత్పత్తులను సేకరించామన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో శనగలు, మినుములు, పెసలు, వేరుశనగలు, జొన్నలు, మొక్కజొన్నలు కలిపి 3.88 లక్షల టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. మొక్కజొన్న క్వింటాలు రూ.2,090 చొప్పున 85 వేల టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ 57 నెలల్లో రూ.1,648 కోట్ల విలువైన 9.10 లక్షల టన్నుల మొక్కజొన్నను సేకరించామన్నారు. ఫలితంగా మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. మొక్కజొన్న గతేడాది రూ. 2 వేల నుంచి రూ.2,400 వరకు పలికిందన్నారు. ప్రస్తుతం మొక్కజొన్నకు పౌల్ట్రీతో పాటు ఇథనాల్ పరిశ్రమల నుంచి మంచి డిమాండ్ ఏర్పడటంతో మార్కెట్‌లో ఈ పంట ధరలు నిలకడగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రధాన మార్కెట్లలో క్వింటాలు రూ.2 వేల నుంచి రూ. 2,600 వరకు పలుకుతోందన్నారు. మార్కెట్ సదుపాయం లేని చోట్ల చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం మొక్కజొన్న సేకరణకు అనుమతినిస్తుందని తెలిపారు. ప్రతి ఏటా మద్దతు ధర దక్కని పంటలకు రైతుకు మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద మార్కెట్లలో జోక్యం చేసుకుంటుందని చెప్పారు. అదే రీతిలో ఈ ఏడాది కూడా 85 వేల టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. సకాలంలో చెల్లింపుల కోసం రుణాలు తీసుకోవడం ఏటా జరిగే ప్రక్రియేనని చెప్పారు. సేకరించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించగా వచ్చే సొమ్ముతో రుణాలు సర్దుబాటు చేసుకుంటామని, అవసరమైతే పంట ఉత్పత్తుల సేకరణకు తీసుకునే రుణాలను వడ్డీతో సహా ధరల స్థిరీకరణ నిధి నుంచి ప్రభుత్వం సర్దుబాటు చేస్తుందన్నారు. ఇందులో తప్పేమిటని ప్రశ్నించారు. సన్న, చిన్నకారు రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుంటే పనిగట్టుకొని విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు.

ఏయూలో క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సులు



కోర్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం, లైఫ్ ఫెర్టిలిటీ సంస్థతో సంయుక్తంగా రెండేళ్ల కాల వ్యవధి గల మాస్టర్ ప్రోగ్రాం ఇన్ క్లినికల్ ఎంబ్రియాలజీ, ఏడాది కాల వ్యవధితో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ క్లినికల్ ఎంబ్రియాలజీ కోర్సులను నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు. గురువారం ఈ కోర్సులు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో ఇటువంటి కోర్సులను అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు అనుసంధానం చేసిన కోర్సులుగా ఇవి ఎంతో ప్రత్యేకంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా కోర్సు వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. విద్యా విధానంలో గడచిన నాలుగేళ్లుగా సీఎం జగన్ సమూల మార్పులు తీసుకువచ్చారని ఆయన తెలిపారు. లైఫ్ ఫెర్టిలిటీ సెంటర్ వైద్యుడు డాక్టర్ కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఆరుగురిలో ఒకరు సంతానలేమితో ఇబ్బంది పడుతున్నారన్నారు. పరిశ్రమ, విద్యా రంగం కలిసి ఇటువంటి కోర్సులను ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. నాలుగు సెమిస్టర్లలో అత్యధిక భాగం ప్రాక్టికల్‌గా నేర్చుకోవాల్సి ఉంటుందని, ఒక పూర్తి సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌కు కేటాయించామని కోర్సు విధివిధానాలను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ నూతన జ్ఞానాన్ని పొందడం, ఆచరణలో చూపడం, అన్వయించడం ఎంతో ప్రధానమన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఆర్వోలకు ప్రొబేషన్ ప్రకటన

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే వీఆర్ఏల నుంచి వీఆర్వోలుగా పదోన్నతి పొంది సర్వే పరీక్ష పాస్ కాని 600 మంది వీఆర్వోలకు ప్రొబేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏడాదిలోగా సర్వే పరీక్ష పాస్ అవ్వాలనే నిబంధనతో రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 600 మంది వీర్వోలకు ప్రొబేషన్ ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గీతం వర్సిటీ వీసీ, చైర్మన్‌పై కేసు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు శివార్లలోని గీతం యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న కర్నూలు విద్యార్థి దాసరి బ్రహ్మసాయిరెడ్డి (19) మంగళవారం రాత్రి హాస్టల్ బిల్డింగ్ పై నుంచి పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటనపై విద్యార్థి తండ్రి దొడ్డబళ్లాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు హాస్టల్‌లో కనీస జాగ్రత్త చర్యలు తీసుకోలేదని, యాజమాన్యం నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని పేర్కొంటూ వైస్ చాన్సలర్ ఆచార్య, వర్సిటీ చైర్మన్ భరత్, హాస్టల్ కాంట్రాక్టర్ మునిక్రిష్ణ, ఆపరేషనల్ కాంట్రాక్టర్ విజయ్‌భాస్కర్, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ విజయ్ గజ్జి రాఘవేంద్ర, వార్డెన్ ఇన్‌చార్జ్ టింటూ, కొప్పస్వామిపై కేసు నమోదు చేశారు.

'హలో కిడ్నీ' యాప్ ఆవిష్కరణ

మంగళగిరి: బీపీ, షుగర్ రోగులు కిడ్నీ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ రూపొందించిన 'హలో కిడ్నీ' యాప్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళగిరి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం జరిగింది. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. శ్యామల యాప్‌ను ఆవిష్కరించి అభినందనలు తెలిపారు.

సూళ్లూరుపేట, గూడూరు ప్రాంతాల్లో స్వల్ప భూప్రకంపనలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, పెళ్లకూరు మండలంతోపాటు గూడూరు నియోజకవర్గం వాకాడు ప్రాంతాల్లో గురువారం రాత్రి దాదాపు ఐదు సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించింది. వెంటవెంటనే రెండు దఫాలుగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. అపార్ట్‌మెంట్లు, పెద్ద భవనాల్లో ఉన్నవారు సైతం భయపడి కిందకి వచ్చేశారు. దొరవారి సత్రం మండలంలోని ఏకొల్లు, కొత్తపల్లి, నేలపట్టు తదితర గ్రామాల్లో పెద్దఎత్తున శబ్దాలు వచ్చి భవనాలు సైతం ఊగిపోయినట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.8గా నమోదైనట్టు జాతీయ భూకంప కేంద్రం తెలిపింది.

సహారా రీజనల్, బ్రాంచ్ మేనేజర్‌లకు అరెస్ట్ వారెంట్

నెల్లూరు (దర్గామిట్ట): కోర్టు ధిక్కరణ కింద సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ రీజనల్ మేనేజర్, నెల్లూరు బ్రాంచ్ మేనేజర్లకు గురువారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. 2022 ఏప్రిల్ 19న కోవూరు మండలం పెద్దపడుగుపాడుకు చెందిన మొహమ్మద్‌పర్వీన్‌కు 24 శాతం వడ్డీతో రూ.65,100 తీర్పు వెలువడిన 45 రోజుల్లోగా చెల్లించాలని కోర్టు తీర్పు వెలువరించింది. సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఆదేశాలు పాటించకపోవడంతో సహారా సొసైటీ చెన్నై రీజనల్ మేనేజర్, నెల్లూరు బ్రాంచ్ మేనేజర్‌లకు అరెస్ట్ వారెంట్లు జారీ చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

నేడు సింధనూరు రైల్వేస్టేషన్ ప్రారంభం



విద్యుద్దీపాలంకరణలో రైల్వేస్టేషన్

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరు రైల్వేస్టేషన్‌నుశుక్రవారం ప్రారంభించనున్నారు. రాయచూరు జిల్లా సింధనూరుకు కొప్పళ జిల్లా కారటిగి నుంచి ఇటీవల మూడు బోగీలున్న రైలు ఇంజన్‌తో నిర్వహించిన ట్రాక్ పరీక్ష విజయవంతం కావడంతో రైల్వే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ పనులను పూర్తి చేశారు. ప్రతిపాదిత మునిరాబాద్–మహబూబ్ నగర్ మధ్య నిర్మిస్తున్న రైలుమార్గం పనుల్లో ప్రస్తుతం సింధనూరు వరకు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఇకపై కారటగి వరకు నడుస్తున్న రైళ్లను సింధనూరు వరకు పొడిగించారు. ఈనేపథ్యంలో కొత్త రైల్వేస్టేషన్‌ను, రైళ్ల సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా, రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ స్థానికంగా ప్రారంభిస్తారని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబురావ్ వెల్లడించారు.

యువతి అదృశ్యం

హుబ్లీ: ముంబైకు చెందిన యువకుడిని ప్రేమించిన ఓ యువతి లేఖ రాసిపెట్టి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన హుబ్లీ నగరంలోని కమరిపేటలో చోటు చేసుకుంది. ముంబై యువకుడిని ప్రేమిస్తున్నానని, అందుకే ఇల్లు విడిచి వెళుతున్నానని, తనను క్షమించండని లెటర్‌లో రాసి కనబడకుండా పోయిందని, కుమార్తెను వెదికి పెట్టాలని యువతి తండ్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎయిమ్స్ ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తాం



మంత్రులకు ఎయిమ్స్ కావాలంటూ జెండాలు చూపిన ఆందోళనకారులు

రాయచూరు రూరల్: నగరంలో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా చూస్తామని వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆందోళనకు మద్దతు తెలిపారు. గురువారం మహాత్మగాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పంచ గ్యారెంటీల సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించేలా చూస్తామన్నారు. ఆందోళన చేపట్టిన సమితి అధ్యక్షుడు బసవరాజ కళస మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఈ విషయంలో మౌనం వహించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని విన్నవించారు.

విద్యుదాఘాతంతో మిరప లారీ బుగ్గి



మంటల్లో కాలిపోతున్న లారీలోని సరుకు

రాయచూరు రూరల్: మిరప కాయల లోడ్‌తో వస్తున్న లారీకి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి భస్మమైన ఘటన బుధవారం సాయంత్రం దేవదుర్గ తాలూకా యరమనాళ క్రాస్ వద్ద జరిగింది. యరమనాళ నుంచి రాయచూరు మార్కెట్‌కు లారీలో 500 మిరప బస్తాలను తెస్తుండగా లారీకి హైవోల్టేజీ విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. లారీతో పాటు ఎండుమిరప కాయలు కాలిబూడిదయ్యాయి.

కాంగ్రెస్‌తో టచ్‌లోకి ముగ్గురు బీజేపీ ఎంపీలు



మాట్లాడుతున్న శివకుమార్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ముగ్గురు ఎంపీలు కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. గురువారం నగరంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కొంత మంది బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఉత్సుకతతో ఉన్నారన్నారు. పంచ గ్యారెంటీ పథకాల కోసం రూ.52 వేల కోట్ల నిధులు కేటాయించామని వివరించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 28 లోక్ సభ స్థానాలకు గాను 20 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. భీమా నదికి మహారాష్ట్ర నుంచి నీటిని విడిపించడానికి చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో రాష్ట్ర వైద్యవిద్యా శాఖామంత్రి శరణు ప్రకాష్ పాటిల్, ఎమ్మెల్యే తుకారాంలున్నారు.

భానుడి భగభగ.. జీవాల విలవిల



ఎండల తీవ్రతకు తొట్లి గ్రామ చెరువులో ఇంకిపోయిన నీరు



ఎండ వేడిమికి తాళలేక చల్లటి చెరకు రసం తాగుతున్న విద్యార్థినులు

- చెరువుల్లో నీరంతా ఖాళీ
- పెరుగుతున్న ఎండ వేడిమి
- పశుపక్ష్యాదుల దాహార్తికీ కష్టం
- చల్లని పానీయాల వైపు జనం మొగ్గు

కోలారు: జిల్లాలో వేసవి ఎండ వేడిమి నానాటికీ అధికం అవుతోంది. ఎండ తీవ్రత ఇప్పటికే 37 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ప్రజలు ఎండ తీవ్రతకు తాళలేక ఉదయం 11 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. పిల్లలు, వయోవృద్ధులు ఎండకు జడిసి బయటకు రావడం లేదు. వడదెబ్బ తగులుతుందని భయపడుతున్నారు. నీరు లభించక పశు పక్ష్యాదులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. 10 గంటలకు సూర్యుడి ప్రతాపం మొదలైతే సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతోంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి ఎండ తీవ్రత అధికంగానే ఉందని చెప్పవచ్చు. పగలంతా వేడెక్కిన భూమి రాత్రయితే వేడిమి సెగకు ఇళ్లలోనూ ఉండలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెల ఆరంభంలోనే ఈ విధంగా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలలో మరింత అధికమయ్యే అవకాశం ఉంది. చెరువులు, కుంటల్లో ఇప్పటికే నీరు ఇంకి పోయి అంతర్జలాల స్థాయి కూడా తగ్గుముఖం పడుతోంది.

ఇక తాగునీటికీ తిప్పలే

రాబోయే రోజుల్లో తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉంటాయి. ఉగాది దాటితే ఎండ తీవ్రత మరింత అధికమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈసారి ఖరీఫ్‌లో వర్షపాతం తక్కువగా నమోదైంది. ప్రస్తుతానికి తాగునీటి సమస్య అంతగా లేకున్నా రాబోయే రోజుల్లో తీవ్రమయ్యే అవకాశం ఉంది. దాహం తీర్చుకోవడానికి ప్రజలు చల్లని పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. మధ్యాహ్న సమయంలో చల్లని చెరకు రసం, కూల్ డ్రింకు షాపులు, ఐస్ క్రీం పార్లర్లు కిటకిటలాడుతున్నాయి. నిమ్మకాయ సోడా, జ్యూస్, లస్సీతో పాటు వివిధ రకాల పండ్ల రసాలు, పానీయాలు, చల్లని మజ్జిగ తాగుతున్న దృశ్యాలు కనిపించడం సర్వసాధారణమైంది. ఎండకు అనుగుణంగా చల్లని చెరకు రసం దుకాణాలు వీధి వీధిలో కనిపిస్తున్నాయి. తాగడానికి జనం క్యూ కడుతున్నారు,. పుచ్చకాయలు, కర్బూజాలకు డిమాండ్ పెరిగింది. సీజన్‌కు అనుగుణంగా పుచ్చకాయలు, కర్బూజాల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. గతంలో కిలో రూ.30 ఉన్న ధర నేడు ఏకంగా రూ.50లకు విక్రయిస్తున్నారు.

పేదల ఫ్రిడ్జికి డిమాండ్

ఎండా కాలం వచ్చిందంటే పేదవాడి ఫ్రిడ్జి(కూజా)కి డిమాండ్ అధికంగా ఉంటుంది. మట్టితో తయారు చేసిన ఈ కుండలు, కూజాలను కొనడానికి పేద, ధనిక తేడా లేకుండా అందరు వస్తున్నారు. మట్టితో తయారు చేసిన వీటిలోని నీరు తాగితే ఆరోగ్యానికి మంచిదని ధనికులు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని కుమ్మర పేటలో వీటిని ఒక్కొక్కటి సైజును బట్టి రూ.250 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. మట్టి బాటిళ్లు, కూజాలను కూడా కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా తయారు చేసి విక్రయిస్తున్నారు.



నగరంలోని కుమ్మర పేటలో విక్రయానికి ఉంచిన మట్టి కుండలు

మూగజీవాల రోదన

ఎండను తాళలేక మూగజీవాలు పడుతున్న రోదన చూడనలవి కాకుండా ఉంది. నీరు లభ్యం కాక గొంతెండి పరితపిస్తున్నాయి. నగర సమీపంలోని అంతరగంగ కొండపై ఉన్న కోతులు ఆలయానికి వచ్చే భక్తుల వద్ద నుంచి ఆహారం మాత్రమే కాకుండా వాటర్ బాటిళ్లు కూడా లాక్కుని దాహం తీర్చుకుంటున్నాయి. వానరాల కష్టాన్ని గుర్తించిన ఎంపీ ఎస్.మునిస్వామి ప్రతియేటా ఎండా కాలంలో పండ్లు, తదితర ఆహార పదార్థాలను అందించే ఏర్పాటు చేశారు. అంతే కాకుండా నీటి కుంటలను తవ్వించి అందులో నీరు వదిలి కోతులు తదితర జీవాలకు తాగునీటిని అందించే సౌలభ్యం కల్పించారు.

మోదీ పాలనలో అన్నీ కచ్చా దిన్ వచ్చాయి

- పంచ గ్యారెంటీలతో రాష్ట్రంలో అచ్చాదిన్
- సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్

రాయచూరు రూరల్: కేంద్రంలో పదేళ్ల బీజేపీ సర్కార్ హయాంలో అచ్చా దిన్ పోయి కచ్చా దిన్(చెడ్డ రోజులు) వచ్చాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నిప్పులు చెరిగారు. గురువారం నగరంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కు తెచ్చి ఒక్కొక్క జన్‌ధన్ ఖాతాలో రూ,15 లక్షలు వేస్తామన్న ప్రధాని మోదీ హామీ నెరవేరలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన తర్వాత పేద ప్రజలకు నీరు, కూడు, గూడు వంటి పథకాలను జారీ చేశామన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పంచ గ్యారెంటీలతో అచ్చా దిన్ వచ్చాయని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెసుకు గెలిపించాలన్నారు. చిక్కమంచాల వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి రూ.158 కోట్లు, బంగారప్ప చెరువుకు రూ.100 కోట్లు కేటాయిస్తామన్నారు.

నవలిపై ఏపీ, తెలంగాణ సీఎంలతో చర్చిస్తాం

తుంగభద్ర ఎడమ కాలువ కింద నవలి వద్ద సమాంతర జలాశయం నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రులు, భారీ నీటిపారుదల శాఖామంత్రులతో లోక్‌సభ ఎన్నికల అనంతరం సమావేశమై సమస్యను పరిష్కరిస్తామన్నారు. నారాయణపుర కుడి కాలువపై 5ఏ ఉపకాలువ నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. అతిథిగా పాల్గొన్న



ప్రారంభిస్తున్న డీసీఎం శివకుమార్ తదితరులు

రాష్ట్ర వైద్యవిద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు మాట్లాడుతూ జిల్లాలో గృహజ్యోతిలో రూ.90.97 కోట్లు, శక్తిలో రూ.118.20 కోట్లు, అన్నభాగ్యలో రూ.141.13 కోట్లు, గృహలక్ష్మిలో రూ.450.92 కోట్లు, యువనిధిలో రూ.1.35 కోట్ల నిధులను జమ చేశామన్నారు. రూ.211 కోట్లతో రూపుదిద్దుకున్న బంగారప్ప చెరువు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, హంపయ్య నాయక్, శరణేగౌడ బయ్యాపూర్, ఆర్.బసనగౌడ, తుకారాం, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున గౌడ, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారం పాండేలున్నారు.

మూడు గంటల ఆలస్యంగా షురూ

కాగా సమావేశానికి గ్రామీణ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలను తరలించారు. కార్యక్రమం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మూడు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2 గంటలకు డీసీఎం డీకే శివ కుమార్ వచ్చారు. దీంతో ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు సభాస్థలి నుంచి నిష్క్రమించారు.

కొప్పళ బీజేపీలో రేగిన అసమ్మతి చిచ్చు

- సిట్టింగ్ ఎంపీ సంగణ్ణకు టికెట్ దక్కక పోవడంతో ఆందోళన
- బీజేపీ కార్యాలయంలో గ్లాసులు, కుర్చీలు ధ్వంసం చేసిన వైనం

సాక్షి, బళ్లారి/గంగావతి: బీజేపీ హైకమాండ్ అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించిన నేపథ్యంలో కొప్పళ సిట్టింగ్ ఎంపీ కరడి సంగణ్ణకు టికెట్ రాకపోగా ఆయన స్థానంలో డాక్టర్ కే బసవరాజుకు టికెట్ కేటాయించడంతో కొప్పళ బీజేపీలో అసమ్మతి జ్వాల చెలరేగింది. గురువారం కొప్పళ నగరంలో జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి కరడి సంగణ్ణకు మద్దతుగా నిలిచారు. ముందుగా ఆయన నివాసంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. టికెట్ రాకపోవడంతో తీవ్ర నిరాశ, ఆవేదనతో ఉన్న సంగణ్ణను పరామర్శించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. అదే సందర్భంలో ప్రస్తుతం టికెట్ దక్కించుకున్న డాక్టర్ బసవరాజు తన అభిమానులతో కలిసి కరడి సంగణ్ణ ఇంటికి వచ్చారు. అప్పటికే బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడ ఉండటంతో బసవరాజుపై తీవ్రంగా మండిపడ్డారు.

ఏ ముఖం పెట్టుకుని వచ్చావ్?

తమ నేతకు టికెట్ దక్కకుండా చేశావని, ఏ ముఖం పెట్టుకుని ఆయన మద్దతు కోరేందుకు వచ్చావని ఘాటుగా నిలదీశారు. మానం, మర్యాద ఉంటే తమ నేత వద్దకు రాకూడదని



కొప్పళలోని బీజేపీ కార్యాలయంలో అద్దాలు పగులగొట్టిన దృశ్యం

ముఖం మీదనే మాట్లాడి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాము ఎట్టి పరిస్థితుల్లోను మీ వెంట నడిచేది లేదని మండిపడ్డారు. అక్కడ నుంచి నేరుగా సంగణ్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో ర్యాలీ చేపట్టి బీజేపీ కార్యాలయంలో గ్లాసులు, అద్దాలు, కుర్చీలు ధ్వంసం చేసి నిరసన వ్యక్తం చేశారు. పార్టీకి కష్టపడి పని చేసిన వారికి కాదని వేరొకరికి టికెట్ కేటాయించడాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని, ఇదేనా బీజేపీ సిద్ధాంతం అంటూ కొప్పళలో బీజేపీ ఎలా గెలుస్తుందో తాము చూస్తామన్నారు. కొప్పళలో బీజేపీ టికెట్ కేటాయింపుతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో ఎటు చూసినా టికెట్ చర్చ జరగడంతో పాటు బీజేపీలో హైడ్రామా చోటు చేసుకుంది. కొప్పళలో అసమ్మతి తీవ్రతరం కావడంతో ఏవిధంగా అసమ్మతిని చల్లార్చి బసవరాజుకు మద్దతుగా నిలుస్తారన్న చర్చ ఆ పార్టీలో చెలరేగింది.

ప్రజాసేవ చేసినందుకే నాకు చాన్స్

- 400కు పైగా సీట్లలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయం
- బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.శ్రీరాములు వెల్లడి

సాక్షి,బళ్లారి: తాను గెలిచినా, ఓడినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసినందునే తనకు రెండోసారి బళ్లారి లోక్‌సభ నుంచి బీజేపీ తరపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని, దేశ ప్రధాని మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు తాను కూడా సైనికుడిలా పని చేస్తానని బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బి.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో మోదీని మళ్లీ ప్రధానిని చేయడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్‌డీఏ కూటమికి 400కు పైగా సీట్లు వస్తాయన్నారు. స్వంతంగా బీజేపీ 380 సీట్లు గెలుచుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. బళ్లారి నుంచి తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. బళ్లారి లోక్‌సభ నుంచి 1999లో సుష్మస్వరాజ్ ఇక్కడ నుంచి పోటీ చేసినప్పటి నుంచి అప్పట్లో ఆమె ఓడిపోయినా ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా బీజేపీ అభ్యర్థులుగా కరుణాకరరెడ్డి, శాంత, తాను, దేవేంద్రప్ప గెలుపొందామని, ఒకసారి ఉప ఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో



శ్రీరాములును అభినందిస్తున్న దృశ్యం

కూడా బీజేపీకి జనం బ్రహ్మరథం పడతారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. దేశంలో మోదీ చేపట్టిన అభివృద్ధి పనులు, దేశ భద్రత, రక్షణ తదితర మహాత్కార్యాలే బీజేపీ విజయానికి సోపానాలు అవుతాయన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్ సురేష్‌బాబు, కార్పొరేటర్లు ఇబ్రహీంబాబు, గోవిందరాజులు, బీజేపీ నాయకులు రామలింగప్ప, మహిపాల్, ఐనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా శ్రీరాములు పేరును రెండో జాబితాలో ప్రకటించిన నేపథ్యంలో బళ్లారి జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందించారు. బీజేపీ నాయకులు డాక్టర్ బీ.కే.సుందర్, రాజీవ్ తదితరులు శ్రీరాములుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

రోడ్ల పనులకు భూమిపూజ

హొసపేటె: కూడ్లిగి సమీపంలోని అమరదేవరగుడ్డ గ్రామంలో రూరల్ రోడ్డు డెవలప్‌మెంట్ పథకం కింద కెరెకావలర హట్టి లింకు రోడ్డు, గొల్లరహట్టి రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ భూమిపూజను నెరవేర్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలకు కనెక్టివిటీ కల్పించే రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రోడ్ల అభివృద్ధితో ఇతర తాలూకాలు, జిల్లాల వైపునకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. అమరదేవరగుడ్డ సమీపంలోని గుండినహాళలో రూ.100 కోట్లకు పైగా నిధులతో వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పరిశోధన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈసందర్భంగా ప్రజాపనుల శాఖాధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనంత్‌కుమార్ హెగ్డేపై చర్యలకు డిమాండ్

బళ్లారి రూరల్: దళితుల వ్యతిరేకి, భారత రాజ్యాంగ విరోధి, బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డేపై కఠినచర్యలు తీసుకోవాలని కర్ణాటక రాష్ట్ర డీఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. డీఎస్ఎస్ రాష్ట్ర సమన్వయ సంచాలకుడు ఎ.మానయ్య మాట్లాడుతూ అనంత్‌కుమార్ హెగ్డే పదే పదే రాజ్యాంగంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారన్నారు. దళితుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. గతంలో దళితులను కుక్కలతో పోల్చి అవమానించారన్నారు. కుక్కలు అనే పదాన్ని ఆయన ఊతపదంగా వాడుతూ అందరినీ కించపరుస్తున్నారన్నారు. బీజేపీ అధిష్టానం అనంత్‌కుమార్ హెగ్డేపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉగ్రపోరాటం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ప్రముఖులే అనంత్ కుమార్ హెగ్డేతో ఇలా మాట్లాడిస్తున్నారా అన్న సందేహం కలుగు



పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న డీఎస్ఎస్ ప్రముఖులు

తోందని దళిత ప్రముఖులు ఆవేదన చెందారు. ధర్నాలో భాగంగా నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించి జిల్లాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆందోళనలో చలువాది మహాసభ గౌరవాధ్యక్షుడు నరసప్ప, ప్రాంత రైతు సంఘ అధ్యక్షుడు శివశంకర్, రాష్ట్ర ప్రముఖుడు దుర్గప్ప తళవార్, తాయప్ప, జిల్లా సంచాలకులు హెచ్.గంగప్ప, చిన్నగాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్ల పనులకు శ్రీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేమిరాజ్

కంప్లి: హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని చెరువు గట్లను అభివృద్ధి చేసే పనులకు ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ శ్రీకారం చుట్టారు. మరియమ్మనహళ్లి ఫిర్కాలో బ్యాలకుంది గ్రామ చెరువు ఎత్తు అభివృద్ధి పథకానికి భూమిపూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గదగ, తిమ్మలాపుర, నాగలాపుర, నందిబండి, బ్యాలకుంది, లోకప్పనకెరె, డణనాయకనకెరె చెరువు గట్ల ఎత్తును పెంచి నీటి వృథాను అరికడతామన్నారు.

బస్సులో తాళిబొట్టు, నగదు చోరీ

హుబ్లీ: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో ఉన్న రూ.2లక్షలు విలువ చేసే మంగళసూత్రం చైను, రూ.4 వేల నగదు చోరీ జరిగిన ఘటనలో నగరంలోని పాత బస్టాండులో గురువారం జరిగింది. కోలారు జిల్లా శారద గుండహళ్లి బంగారు పోగొట్టుకున్న బాధితురాలు. కోలారుకు వెళ్లడానికి స్థానిక పాత బస్టాండు నుంచి గోకుల్ రోడ్డు బస్టాండుకు వెళుతున్న సమయంలో బస్సులో విపరీతమైన జనం రద్దీ ఉండటంతో దొంగతనం జరిగినట్లు స్థానికులు తెలిపారు. దొంగ తన చేతివాటం చూపి మహిళ బ్యాగు ఓపెన్ చేసి దోచుకెళ్లారు. ఈ కేసును హుబ్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంట రక్షణకు ట్యాంకర్ల బారులు



ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

కంప్లి: సండూరు తాలూకాలోని రైతాంగం రబీ సీజన్‌లో తమ పంటల రక్షణకు నీళ్ల ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక వైపు తీవ్రమైన నీటి కొరత, మరో వైపు వుంజుకుంటున్న వేసవి ఎండల వేడి తాపంతో తమ పంటలను రక్షించుకునేందుకు రైతాంగం అల్లాడిపోతున్నారు. సండూరు తాలూకాలోని అరసికెరె పరిధిలోని కంచికెరె, అరసికెరె హొసకోటె, హుచ్చంగిదుర్గ గ్రామ పంచాయతీల పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. రైతాంగం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి 700 అడుగుల లోతు బోరు వేసినా చుక్క నీరు కంటికి కానరావడం లేదు. తమ పెట్టుబడులు కేవలం బోర్లు వేయించేందుకు వాడినా ఫలితం శూన్యమై రైతన్నలు పంటలు వాడిపోతున్నాయి. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

ఘనంగా పార్వతీదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో గురువారం చారిత్రక శ్రీ సుంకలా పార్వతీదేవి రథోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి. అందంగా పూలతో అలంకరించి తేరులో సుంకలా పార్వతీ దేవి ప్రతిమను ఉంచి బసవన్న గుడి వరకు భక్తులు లాగారు. గ్రామ వీధులే కాకుండా మిద్దెలు, మేడలపై నుంచి భక్తజనం వీక్షిస్తూ అరటిపండ్లు, పూల వర్షం కురిపించారు. అనంతపురంతో పాటు బళ్లారి, చిత్రదుర్గ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి పెద్దఎత్తున మహిళలు, భక్తులు పార్వతీ దేవికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించి పూజలు చేశారు.

రూపాయి నాణెం మింగి చిన్నారి మృతి

హుబ్లీ: రూపాయి నాణేన్ని మింగి శిశువు మృతి చెందిన ఘటన ధార్వాడ జిల్లా హొసయల్లాపుర కోళికెరి లేఔట్‌లో గురువారం చోటు చేసుకుంది. లేఔట్‌కు చెందిన మహమ్మద్ జుబేర్ షాలి(2) ఇంట్లో ఆటలాడుతూ రూపాయి నాణేన్ని మింగాడు. అది గొంతులో ఇరుక్కుని ఇబ్బంది పడుతుండగా, కుటుంబ సభ్యులు గుర్తించి తక్షణమే బాలుడిని ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. ఈ మేరకు ధార్వాడ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా చిన్నారి మృతితో బాలుడి ఇంట్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎంపిక



రెడ్డి శ్రీనివాస్(ఫైల్)

గంగావతి: గ్యారెంటీ పథకాల అమలు సమితి కొప్పళ జిల్లా అధ్యక్షులుగా శ్రీరామనగర్‌కు చెందిన కనకగిరి బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఈ ఆదేశాలను అందుకొని ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన గ్యారెంటీల అమలు కోసం తాను ప్రామాణికంగా కృషి చేస్తానన్నారు. ఈ పథకాల లబ్ధిదారులు ఏవైనా సమస్యలు ఎదురైతే తనను సంప్రదించాలని కోరారు. తాను సైతం లబ్ధిదారులను కలుసుకుని పార్టీ పటిష్టతకు పాటుపడతానన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి



మాట్లాడుతున్న సిద్ధలింగ రాజదేశికేంద్ర స్వామీజీ

హొసపేటె: సమాజంలో ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని ఉజ్జయిని సద్ధర్మ పీఠం జగద్గురువులు సిద్ధలింగ రాజదేశి కేంద్ర శివాచార్యులు తెలిపారు. తాలూకాలోని బయలుతుంబరగుద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన ధర్మ సభలో ఆయన మాట్లాడారు. మతపరమైన ఆచార వ్యవహారాల్లో నిమగ్నమై మనశ్శాంతి పొందడమే కాకుండా సమాజంలో సోదర భావంతో నడుచుకోవాలన్నారు. బయలుతుంబరగుద్దిలో నిత్యం ధార్మిక ఆచార వ్యవహారాలు కొనసాగాలన్నారు. అర్చకులు ఎంబి.నింబలగెరె, విజయానంద, సారంగ మఠం కొట్రేష్, బసవరాజు, రుద్రేష్, జి.బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పత్తేశ్వర మఠానికి కారు వితరణ



కారు తాళాలను స్వామీజీకి అందిస్తున్న దృశ్యం

కంప్లి: తాను ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే నేమిరాజ్‌నాయక్ తెలిపారు. మరియమ్మనహళ్లి సమీపంలోని గరగ నాగలాపురలోని గురు ఒప్పత్తేశ్వర మఠానికి ఎమ్మెల్యే కారును కానుకగా అందించి మాట్లాడారు. ఈ మఠానికి నూతన పీఠాధిపతిగా పట్టం పొందిన పీఠాధిపతి కోసం, మఠం ధార్మిక కార్యక్రమాలకు, స్వామీజీ సంచారానికి తాను వ్యక్తిగతంగా రూ.15 లక్షల విలువైన కారును అందించి తన భక్తిని చాటుకొన్నానన్నారు.

ఆరోగ్య పరీక్ష శిబిరం



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి: స్థానిక సంగ్రత్రాయ పాఠశాలలో గురువారం ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో హుబ్బళ్లి వైద్యులు డాక్టర్ నీలావతి, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ జగన్నాథ్ హిరేమఠ తదితరులు సుమారు 300 మందికి ఆరోగ్య పరీక్షలు, చికిత్స నిర్వహించినట్లు మహిళా మండలి ప్రముఖులు తెలిపారు.